# ప్రగతిపథం

దేవరపల్లి మస్తాన్‌రావు...

పురోగామి ప్రచురణలు, పొన్నూరు

# ప్రగతి పథం

(ఉపన్యాసాల సంపుటి)

రచన

దేవరపల్లి మస్తాన్‌రావు

పురోగామి ప్రచురణలు

పొన్నూరు

## ఆ ముఖము

మిత్రుడు మస్తాన్ రావు ఉపన్యాసాల సంపుటి యిది. మస్తాన్ రావు నేను యం. యన్. రాయ్  రూపు దిద్దిన నవ్యమానవవాద పథికులం. అదీ మా బంధుత్వం.

మస్తాన్ రావు జన్మించింది రజకవృత్తి చేపట్టిన కుటుంబంలో. విద్యా సంపద సంతరించుకొని, ఆలోచనా శక్తిని అలవర్చుకొని, సునిశితబుద్ధికి సాన పెట్టి, తన నిర్ణయాలకు ఆవేశాన్ని ఉద్వేగాన్ని జతపరచి, తాను గ్రహించినదిఇతరులకు చెప్తూ, తన అనుభవాలను ఇతరుల అనుభవాలతో తరచి చూసుకుంటూ, హేతువాద వైఖరితో, శాస్త్రీయ దృక్పథంతో, ఆలోచనా రంగాన్ని కార్యరంగాన్ని సమన్వయం చేసుకుంటూ జీవయాత్ర సాగిస్తున్నాడు, అలా తను మారుతున్నాడు. తనతోపాటు సంఘాన్ని మారుస్తున్నాడు. మార్చటానికి అవిరళ కృషి చేస్తున్నాడు.

అణగారిన వర్గగిలో జన్మించినవారికి తెలిసినంతగా, ఆ వర్గపు బాధలు, యాతనలు మరో వర్గానికి చెందిన సహృదయులకు కూడా తెలియవు. తాను జన్మించిన కులంవారి అవస్థలు గమనించాడు మస్తాన్‌రావు. హృదయం సంక్షోభం చెందింది. తోటివారి ఆక్రందనలు పరిష్కార మార్గాన్ని కనుక్కోమని తన మనస్సును తొందరపెట్టినై. ఆలోచించాడు. విద్యార్థిగానే కార్యరంగంలోనికి దుమికాడు. వెనుకబడిన జాతుల ఉద్యమమే అతనికి కార్యరంగమైనది. 1952లో ఆ ఉద్యమ పత్రిక “యుగవాణి'' కి సంపాదకత్వం వహించాడు. రజకజన సేవా సంఘానికి వెనుకబడిన జాతుల ఉద్యమాలనికి ముఖ్య కార్యకర్త అయ్యాడు. అఖిల భారత రజకజన సేవా సంఘాధ్యక్షుడు శ్రీ వేమవరపు వెంకటేశ్వర్లుకు బాసటగా నిలిచాడు. ఇప్పటికీ కార్యరంగాన్ని విడువలేదు. వెనుకబడిన తరగతుల సమైక్యతకోసం “వెనుకబడిన తరగతుల వేదిక'' ను తెనాలిలో స్థాపించి కార్యదర్శిగా నిర్వహిస్తున్నాడు.

యం.యన్. రాయ్ ఆలోచనాక్రమాన్ని, విశ్లేషణా విధానాన్ని తనదిగా చేసుకొని, అంబేద్కరు సాంఘిక తత్వాన్ని సాయముగా తీసుకొని. "కవిరాజు" త్రిపురనేని రామస్వామి సంప్రదాయ వ్యతిరేక వైఖరిని సమీకరించుకొని, నవ్యమానవవాది కీర్తిశేషుడు ఆవుల గోపాలకృష్ణమూర్తి శిష్యుడై, ఆయన మాటల పోకడ, సూక్తుల వేడిమి తన శైలిలో సమ్మిళితం చేసుకొని మస్తాన్‌రావు చేసిన ఉపన్యాసాలసంపుటి యీ గ్రంథరాజము.

ఉపన్యాసాలలో మస్తాన్‌రావు వ్యక్తిత్వం బహుథా. గోచరిస్తుంది అతని దృఢవిశ్వాసాలు, అభిప్రాయాలు కొట్టవచ్చినట్లు కన్పడతాయి.

" ప్రజా సంఘములు : పత్రికలు" అనే ఉపన్యాసంలో నాయకత్వ లక్షణాలు వివరించాడు. "సంపద, సమయము, శ్రద్ధ, చదువు, సంస్కారము, మేధస్సు, వ్యక్తిత్వము, నిగర్వము, నిర్మొగమాటము, నిస్వార్థము కలిగిన నాయకత్వం రాణించగలదు." (పుట 6) అంటాడు. ఎంత చక్కని కొలమానం. ఈలాంటి నాయకులుంటే ఆంధ్రావని యెంత శోభాయమానంగా వుండేది. నేటి కులతత్వాన్ని వర్ణిస్తూ వ్రాసిన గేయం

"లోగడ కులతత్వం కఱకుకత్తి

ఇప్పటి కులతత్వం మెత్తనికత్తి

....  ....  ...  ...

.....  ....  ....  ....

పెద్దకులంలోని దద్దమ్మలు పైకి రావటం

చిన్న కులంలోని మేధావులు చితికిపోవటం

నేటి నిజం -- న్యాయంకాదు కాదనటం'' (పుటలు 15, 16)

హృదయంగమంగా వున్నది. నగ్నసత్యాన్ని చాటుతున్నది "దళిత జాతులలో హేతువాద ప్రచారం'' అనే 1970వ సంవత్సరపు ఉపన్యాసంలో "ప్రతి పౌరుడు తలను, హృదయమును జోడించి ఆలోచించవలసిన సమస్య (పుట 25) అని హెచ్చరించి, ''క్రింది కులాంవారి సమైక్యత ప్రధానము'' అని నొక్కివక్కాణిస్తాడు. "హీనవర్ణములుగ పరిగణించబడుచున్నవారి కులతత్వము దేశమునకు ప్రమాదకరము'' (పుట 28) అనే ఎ.జి.కె (ఆవుల గోపాలకృష్ణమూర్తి) సూత్రాన్ని త్రికరణశుద్ధిగా విశ్వసిస్తాడు. గురువు ఆలోచనా పరంపరనుండి బలం పుంజుకుంటాడు. "వృత్తులకు సంబంధించిన సదుపాయముల రక్షణలకు ప్రభుత్వం పూచీ పడటం న్యాయం - సహేతుకం,'' (33వ పుట) అనే నార్లవారి మాటను ఆంగీకరిస్తాడు "అరువు కాళ్ళను తొలగించి స్వంతకాళ్ళపైన నిలబడగల సత్తాను ప్రతి వ్యక్తి సంపాదించుకొనుటకు ఆరాటపడుతున్నాడు'' (35 వ పుట) అని చెప్తూ స్వావలంబనాన్ని ప్రబోధించాడు. వెనుకబడిన తరగతులవారి సమస్యలు రాజ్యాంగ నిర్ణేతలకు అర్థము కాలేదని చింతించాడు (41 వ పుట), ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వము, పత్రికలవారు ఉపయోగించే "వెనుకబడిన తరగతులు,'' ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన "వెనుకబడిన తరగతుల జాబితాలోని కులాలు'' ఒకటి అనుకోరాదని విశదపరచాడు (46 వ పుట). "ఇతర వెనుకబడిన తరగతులు అంటే అసలైన అల్పసంఖ్యాక వర్గాలు. ఆకలితో అవమానంతో క్రుంగి కూలారుతున్న కులాలు, ఆలనాపాలనా లేని జనాలు'' (48 వ పుట) అని నిర్వచనం చేశాడు. "వృత్తిరీత్యా, కులరీత్యా విడివడియున్న బలహీన వర్గము లన్నిటిని సమైక్యపరచాలి'' (70 వ పుట) అని వెనుకబడిన తరగతుల వేదిక ప్రథమ వార్షిక సభ నివేదికలో 1971 లో తన సహచరులను కార్యోన్ముఖులను చేశాడు.

అనంతరామన్ కమిటి తయారుచేసిన 92 కులములను వృత్తి సంఘము లంటాడు రచయిత - కాదు - ఉపన్యాసకుడు (133 వ పుట). ఉద్యమం కార్యసాఫల్యత పొందకపోవటానికి కారణాలను తన సహజ విశ్లేషణా మేధాశక్తితో వర్గీకరించాడు మస్తాన్‌రావు. ప్రధానమైన మూడవ కారణంగా "వృత్తిసంఘాలవారవలంభించుచున్న సాధనోపాయములు ప్రజలను, ప్రభుత్వమును చలింపచేయు పద్ధతిలో లేకపోయి యుండాలి" (పుట 139) అని వ్యక్తీకరించి ఆ సంస్థలు వాడిని, వొడుపును ప్రదర్శించాలని అభిలషించాడు ఒకవైపు ఇంజనీర్లను, డాక్టర్లను, నర్సులను, శానిటరీ ఇన్‌స్పెక్టర్లను తయారుచేయుటకు శ్రమించే ప్రభుత్వం "అదే విధముగ ప్రజల కుపయోగపడు రజక, నాయీ బ్రాహ్మణ, శాలివాహన (కుమ్మరి) మహేంద్ర (మేదరి), విశ్వబ్రాహ్మణ, దర్జీ, చేనేత వగైరా చేతివృత్తుల వారు తమ వృత్తిలో నైపుణ్యము సంపాదించుకొనుటకు, వృత్తిని సుళువుగా కొనసాగించుటకు, ఇంటెల్లపాది వస్తులుండని మాత్రంగానైనా అర్థికత వొనగూర్చుకొనుటకు తగిన మార్గములను నేర్చుటకు ప్రభుత్వము పైసా ఖర్చు పెట్టకపోవుట విచిత్రం" (పుటలు 145, 146) అని ప్రభుత్వముపై చేసిన విమర్శ అభినందనీయము.

మస్తాన్‌రావు వెనుకబడిన తరగతుల అభ్యుదయ కాముకుడు. వెనుకబడిన కులాల సముద్ధారకుడు. కాని కులతత్వ వ్యతిరేకి. దూరదృష్టి కలవాడు. కులతత్వాన్ని సమూలంగా పెకలించివేస్తేతప్ప దేశానికి. పౌరులకు ముక్తిలేదని అతని విశ్వాసం. ఇదేనమక్కం అతనికి 1952లో వుంది. (పుట 29). ఇప్పటికీ అంత ధృఢంగావుంది. (పుట 89). "ఇక పోతే కుల నిర్మూలనము. దీనికి అన్నివైపుల నుండి ఒకేసారి దాడిజరగాలి ఇక్కడ "అన్ని వైపుల నుండి ఒకేసారి" అనునది ముఖ్యము. "(35వ పుట) అనే వాక్యాలు ఇందుకు నిదర్శనం. ది 9-4-72 న తెనాలిలో కులనిర్మూలనోద్యమ సభలో చేసిన "కులరహిత సమాజం" అనే ఉపన్యాసం ఈ గ్రంథానికి మకుటాయమానం.

"అందుచేత కులప్రస్తావనలేని సమాజమును సృష్టించుకొనుటకు సంఘము తీవ్రముగ కృషిచేయవలసి యున్నది.'' అని లక్ష్యమును స్థిరీకరించుకొని "అయితే కులమెటుపోతుంది? అనేది సమస్య. వర్ణాంతర వివాహాలు వినా మార్గంలేదని పెద్దలే తేల్చారు, ఇది నిజము,'' (పుట 110) అని సమాధానం చెప్తూ. "కులము మెరుగుపడాలి అందుకు కులములుండాలి. ఇది మన అభిమతము, నడవడిక కాకూడదు. "అందరు మనుష్యులమ''నుకొను సంఘము నిర్మించబడాలి''. అని ఉద్ఘాటిస్తూ. తన మానవ వాద దృక్పథాన్ని స్పష్టీకరించాడు రచయిత. తే 14-4-72 న విజయవాడ అంబేద్కరు సాహితీ విహార్ వారు యేర్పాటుచేసిన సభలోని "డాక్టరు అంబేద్కరు సాంఘికతత్వము'' పై మస్తాన్‌రావు ఉపన్యాసము అతని భావాలను మరింత సుస్పష్టము చేస్తున్నది. "మనకు రిజర్వేషన్లు వుండాలి; మన అభివృద్ధికి మరెవరో కృషి చేసిపెడతా'' రన్న భావము మనలో యెంత త్వరగా నశిస్తే అంత త్వరగా మనలోని స్వీయశక్తులను ప్రజ్వలింపజేసి కొనగలుగుతాం. రిజర్వేషన్ల పద్ధతి మన శ్రమను కొంత తగ్గిస్తుందేమో తప్ప మన అభివృద్ధికి పూర్తి పరిష్కార మార్గం కాదు. ఒకవిధంగా చూస్తే. మన పట్టుదలను సడలింపజేయు పనికిమాలిన పద్ధతి. చేతగానితన మున్నప్పుడీ పద్ధతికి ఆందోళన చేశాం. ఇప్పుడు చేవగలిగినవారుగ. చేతనైనవారుగ. బహుజనం కలిగినవారుగ, క్రింది తరగతి ప్రజలు ఋజువు చేసుకోవాలి. భూదానోద్యమము భూసంస్కరణల వాదంలోని తీవ్రతను తగ్గించినట్లు, పరుల దయాధర్మ భిక్షపై ఆధారపడు రిజర్వేషన్ల పద్ధతి స్వీయశక్తులు ప్రకోపింపకుండ అణగార్చివేస్తుందని నా అభిప్రాయం'' (పుటలు 127, 128) అని భావ ప్రకటన చేసి వెనుకబడిన తరగతులకు, దళిత జాతులకు మార్గదర్శకుడయ్యాడు మస్తాన్ రావు.

కాలం సాగినకొద్దీ ప్రతి వ్యక్తీ మారుతాడు. అతని అభిప్రాయాలు మెరుగవుతయి. అతని పంణిత భావాలు తర్కానికి, అనుభవానికి నిలుస్తాయి.

అలాగే మస్తాన్‌రావు మారాడు. అతడు అంగీకరించినా, అంగీకరించకపోయినా అది నగ్న సత్యం. "ఇప్పుడీ విషయమై మనము మరి కొంత ముందుకు పోయి ఆలోచించాలి" (పుట 126) అని చెప్పి రిజర్వేషన్లు పోవాలని అంటూ "సాంఘిక, ఆర్థిక,. రాజకీయ న్యాయము - భావనా వాక్కు విశ్వాస స్వాతంత్ర్యము - స్థాయి, అవకాశముల సమానత - వ్యక్తి గౌరవము జాతి సమైక్యత కాపాడు సహోదర భావము భద్రముగ నుండుటకు ఆదర్శ సంఘములో ప్రతి మనిషికి వీలు కలిగించాలని అంబేద్కరు ఆశించారు" (పుట 128) అని అంబేద్కరు ఆశయాన్ని తాను ధృవీకరిస్తున్న మస్తాన్‌రావు శిసలైన. అసలైన మానవవాది అని మనము తేలికగా గ్రహించవచ్చు.

సాంఘికన్యాయ సూత్రానుసారంగా వెనుకబడిన తరగతులకు కొంతకాలం ప్రత్యేక అవకాశాలు యిచ్చేటట్లుగా, కులనిర్మూలనకు కుల ప్రాతిపదికలేని పరిష్కార మార్గాన్ని కనుగొనుటకు వెనుకబడిన తరగతుల ఉద్యమ సారథి సచివుడు మిత్రుడు మస్తాన్‌రావు తన సహచరు లందరికి అమోదయోగ్యంగా వుండే పథకాన్ని రూపొందించగలడని ఆశిస్తున్నాను.

వెకబడిన తరగతుల ఉద్యమపు వేడిని, వాడిని గ్రహించాలంటే ఈ గ్రంథాన్ని ప్రతి సంఘ సేవకుడూ, ప్రతి రాజకీయవాది తప్పక చదవాలి. వదివి ఆలోచించాలి.

చీరాల

**26-11-'72** యం. వి. రామమూర్తి

## ?

మానవుని మస్తిష్కంలో ఎందుకు ? ఏమిటి ? అనే ప్రశ్న అనాదిగా వస్తుంది. లేని దైవాన్ని చిలవలు పలవలే చేసి చూసే దానికంటే, విభిన్నంగా సత్యాన్ని విమర్శించి, విచారించి చూడటం జరుగుతుంది. ఎంత స్వార్థబుద్ధి -- స్వాతిశయము ప్రబలినా ఈ సత్యాన్ని ఎవరూ, ఎప్పుడూ కప్పిపుచ్చలేరు.

వేదయుగాన్ని ప్రారంభించిన ఆర్యఋషులు మొట్టమొదట ప్రకృతి సమారాధనం గావించారు. అపైన విజ్ఞానం ప్రబలేకొద్దీ, నాజూకులు సంతరించుకొనేకొద్దీ ప్రశ్నార్థకాలు ఎక్కువయ్యాయి. తమవలె తమ నాయకులవలె దేవుళ్ళ సంఖ్య పెరిగిపోయింది. మతంలో మతాలు ఉత్పన్న మయ్యాయి. అసలీ హేతువాదం లేకపోతే పశుతుల్యుడైన మానవుడు మానవుడు కాలేక పొయ్యేవాడు. పూర్వకాలంనాటి వేషలు. భాషలు గృహవసతులు ఎంత మార్పు వచ్చాయో దీనినుండి తెలిసికొనవచ్చు. స్వార్థబుద్ధితో మానవుడు తన యింటిని, వంటిని ఎంత సంస్కరించు కున్నా. తనలోని బుద్ధి సంస్కారాన్ని కొంచమైనా పెంచుకో లేకపోయాడు. దీనికి తార్కాణంగానే మన దేవాలయాలు, పూజలు ఏమాత్రం మారకుండా నేటికీ చెక్కుచెదరకుండా నిలిచివున్నాయి.

ఏనాటి కానాడు ఎంతమంది సంస్కారులు పుట్టినా గాలిలో దీపాల్లాగా రెపరెప లాడుతూ కొంత వెలుగునిచ్చి ఆరిపోయారు. ఆ కోటిలో చేరిన వారే బుద్ధుడు, వేమన్న మొదలగువారు. అనాదిగా వస్తున్న హిందూమత ప్రభావం మీద మహమ్మదీయ. క్రైస్తవ మతాల దండయాత్రలు సాగాయి. దేశం మారింది. ఆచార వ్యవహారాలు మారాయి. దీనితో పాటు మానవ మనస్తత్వాలు మారాయి. ఒకజాతి పెద్దది. మరొకజాతి చిన్నది అని మనస్సులలో అనుకోవటమేకాని

బాహాటంగా చెప్పే ధైర్యసాహసాలు క్రమక్రమంగా లోపిస్తున్నాయి. దీనికి పలువురు తెలుగు కవులు నీరాజనాలెత్తారు. అందులో ప్రప్రథమంగా స్మరింప దగినవాడు వేమన మాత్రమే. ఆపిమ్మట కందుకూరి వేరేశలింగంగారు చెప్పుకోదగ్గ నరసింహ్మలు నాయుడుగారు, గిడుగు వేంకట రామమూర్తి పంతులుగారు ముఖ్యలు. ఇట్లా భావవిప్లవం, భాషావిప్లవం జోడుజోడుగా, తోడునీడగా మనదేశం మీద వీరవిహారం సాగించాయి.

వేద ధర్మాలకంటె పౌరాణిక ధర్మాలనే ప్రజలలో బాహాటంగా ప్రచారం సాగించే పండితమ్మన్యుల కెదురీదవలసి వచ్చింది. ఈ పని కవిరాజు త్రిపురనేని రామస్వామిగారు చేపట్టారు, వీరికి పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి మొదలగుపెద్దలు సహాయ పడ్డారు. దేశంలో కుల సంఘాలు, వృత్తిసంఘాలు విశ్లేషించి బాహ్మణ - బ్రాహ్మణేతర ఉద్యమాలు వేలూనాయి. ఈ వూపుతో సర్వజాతులు మేలుకొని తమతమ హక్కులకు పోరాటాలు సాగించాయి. ఈ తెలుగు దేశంలో విజ్ఞాన జైత్ర యాత్ర సాగించినవారు ఆవుల గోపాలకృష్ణమూర్తిగారు. వారి సన్నిహిత సంబంధము వలన పెరిగినవారు కోకొల్లలు అందులో ముఖ్యులు మా దేవరపల్లి మస్తాన్‌రావు, దాదాపు రెండు దశాబ్దాలుగా వీరు సాగించిన సాహితీ సేవ కొనియాడదగినది, పత్రికా సంపాదకులుగా, గద్య పద్య గేయాత్మక రచయితలుగా, పలు సభలలో ఉపన్యాసకులుగా రాణించారు.

ప్రతి యింటిలో ప్రతిగుండెలో దీపావళి నుంచారు. జ్ఞాన జ్యోతుల వెలుగు పదంలో ప్రగతిపథం సాగింప నుంకించారు. ప్రస్తుత రచన ప్రగతిపథం. గతిలేని జాతులకు ప్రగతిపథం. మతిలేక మానవతను కోల్పోయి దారితప్పి తారాడు మనుజపశువులకిది ప్రగతిపథం. నిచ్చెన మెట్లవంటి సంఘంలో ఎదుగు బొదుగు లేని వర్ణ వ్యవస్థలో కొట్టుమిట్టాడు జీవుల కిది ప్రగతిపథం. బలవంతపు

బ్రాహ్మణార్థంగా ఆచారకొండతో ఆలమటించే అంధజీవులకిది ప్రగతిపథం. తరతరాలనుండి నరనరాలలో జీర్ణించుకొని పోయిన అంధకార మయమైన పథంలో కన్నుగానక సంచరించు వారి కిది ప్రగతిపథం. ఇట్టి ప్రగతిపథాన్ని చూపించడానికి కలాన్ని చేబూనిన మామిత్రుడు దేవరపల్లి చరితార్థుడు, సుకృతాత్ముడు.

ఇందులో పది వ్యాసాలున్నాయి. తన పేరులో పది అక్షరాలేన్నాయి. దుష్ట శిక్షణార్థం దేవుడు పది అవతారాలెత్తితే మాయావాదుల మతమౌఢ్యాన్ని అణచడానిగ్గాడా పదివ్యాసాలు సరిగ్గా సరిపోతవని రచయిత తలపుగావచ్చని ఈ పీఠిక వ్రాసే సమయానికి వచ్చిన మామిత్రులొకరన్నారు. పూర్వపు దుష్టుల దుష్టత్వం వారితోనే అంతరించింది. కాని మన రచయిత దండెత్తిన దుష్టుల దుష్టుత్వం తరతరాలు సంక్రమించే అంటు జాడ్యం వంటిది. కాబట్టిపదేకాదు పదివేల వుపన్యాసాలు ఈ రచయిత చేయవలసి వుంది. వీటిని క్రమంలో పెట్టుకోడంలో కూడా వైదుష్యం ఎంతో కనుపడుతుంది. తెల్లజెండాతో, గుణగానంతో సంపూర్ణం గావించారు. ఇదియొక క్రొత్త యెత్తుగడ.

పూర్వం ఆంధ్రసాహిత్యం పరిషత్తువారు కావించే సభలకు కొమ్ములు తిరిగిన వుద్దండ పండితుల రావించేవారు. ముందుగా వొక విషయం యిచ్చ లిఖిత పూర్వకంగా వ్రాసుకవస్తేనే చదువనిచ్చేవారు. తీరా వేదిక యెక్కి అవాకులు - చవాకులు మాట్లాడే వారికి సభలలో తావుండేది కాదు. ఈమధ్య ఆ నియమాలను తొలగించి సందర్భా సందర్భాలుగా మాట్లాడి. తాను మాట్లాడిందేమో సభికులకు, తనకు అర్థం కాకుండా వుండడమే మహోన్నపన్యాస లక్షణంగా భావించడం జరుగుతుంది. ముందడుగును వేస్తున్న మా మస్తాన్‌రావు గారు వెనుక చూపుతో. పూర్వపు బాణీగా ఉపన్యాసాన్ని వ్రాసుక పోయే అభ్యాసం చేశారు. అందుకనే ఇవి క్షరమై పోకుండా అక్షర రూపంలో దాల్చాయి. కనీసం

సాహిత్య సభలకైనా ఈ నియమం వుండడం క్షేమకరం, ఆరోగ్యకరం అనుకుంటాను. ఇందులో 8 ఉపన్యాసాలు ఆదివారం వచ్చినవే, మరిరెండు విరామకాలంలో వచ్చాయి. అంటే వృత్తిబాధ్యత, జాగరూకత దీనివల్ల తెలుస్తుంది.

ఇక రచనా పాటవాన్ని గూర్చి చర్చిద్దాం గద్యం. పద్యం. గేయం మూడూ సమపాళంగా నడవడం దుస్సాధ్యం. పట్టుబట్టి రచన గావింన వచ్చునే గాని అది శ్రుతి పేయం గాదు కొందర రచనల్లో. అట్లా కాక దీపావళి అనే ఖండకావ్యంలో పద్యాన్ని. గేయాన్ని సమపాళంగా నడిపారు. మచ్చున కొక్క పద్యం --

ఉ॥ భావ పరంపరావళి నపార ముదం బొనరించు దివ్య దీ<br>
పావళి -- వింత వింతల టపాకు రవల్ చెలరేగు కాంతి ర<br>
త్నావళి -- యాంధ్రమాత విజయమ్మును గాంచిన వీరకంఠ హా<br>
రావళి --యిద్ది భారత ధరావళిఁ బొల్చిన పండువౌ సుమా !

--"దీపావళి"

మచ్చున కొక్క గేయం --

కరుళ్ళు గట్టిన మానవ జాతిని<br>
కరిగించుటకూ కదలించుటకూ<br>
కదలించి ముందు కురికించుటకూ<br>
ఉరికించి ప్రగతి సాధించుటకూ<br>
కంకణ మూనెను నా కలమూ

అంటూ యమకాన్ని గమకాన్ని వెలార్చారు. వచన రచనలో నేటిగ్రంథం ప్రమాణం ఇల్లా త్రివేణీ సంగమంగా వీరి రచన సాగింది. ఇంతవరకు సర్వాత్మనా వెనుకబడిన తరగతుల సంఘం వాదాన్ని. అవసరాన్ని బలపరిచే

సాహిత్యం ఆంధ్రదేశంలో లేదు. దీన్ని సమగ్రం అంటే మస్తాన్‌రావు ఆగిపోవలసి వస్తుంది; కాని ఈ ఉపన్యాసాల సంపుటే మొదటి నీరాజనం అంటే అతిశయోక్తి కాదు.

సొంతగా రచనలు సాగించవచ్చు. అచ్చు వేయించుకోవచ్చు. కాని ఈ కోవకు చెందిన రచనల నెల్ల వెలుగులోనికి తెచ్చే వుబలాటం అందరి కుండదు. మా దేవరపల్లి కవి తన "ప్రగతి పథం" అచ్చు వేయించు కొనే సమయానికి ఇదే భావాలకు దాదాపుగా నున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శిగా నున్న జాగర్లమూడి వీరాస్వామిగారి రేడియో ప్రసంగాలను, పత్రికా వ్యాసాలను గ్రంథరూపంగా ప్రచురించాలని తలచి, తద్రచనల సముచ్చయాన్ని సమకూర్చి "క్రాంతి రథం" పేరుతో ముద్రింపించుటకు వలయు ఏర్పాట్లన్నీ చేశారు. ఆ పుస్తకం పూర్తి అయిన తరువాతనే తన పుస్తకాన్ని ప్రకటిద్దామని నిర్ణయించుకొన్నారు. కులములో కులాలకు, రచయితలలో రచయితలకు రవరవలు లేకుండా వుండాలనడానికిదొక తార్కాణ. ఎందరో యువ రచయితల కితడు అండదండలుగా నుండి ప్రోత్సహమిస్తుంటాడు. ఇంకా ఎంతో ఆవేదనతో, ఆవేశంతో కలం నడపాలని కాంక్షిస్తూంటాము.

పొన్నూరు
**1-12-'72**

ఇట్లు
కవిరాజు - కళాప్రపూర్ణ
కొండవీటి వేంకటకవి

నమస్సులు
ఆముఖమును అందించిన
శ్రీ యం.వి. రామమూర్తిగారికి

ప్రశ్నార్థకమును ప్రసారించిన
శ్రీ కొండవీటి వేంకటకవిగారికి

ధన్యవాదములు
నా ఈ ప్రసంగముల కవకాశ మిచ్చిన సభానిర్వాహకులకూ
ఆలకించి ప్రోత్సహించిన సభాసదులకూ
కొన్ని ప్రసంగభాగాలను ప్రచురించిన పత్రికలవారికి
ప్రసారము చేసిన రేడియోవారికి

కృతజ్ఞతలు
ప్రచురణ బాధ్యత వహించిన
శ్రీ కొండా రంగారావుగారికి

ముచ్చటగా ముద్రించి యిచ్చిన
నాగార్జున ప్రింటర్స్, తెనాలి వారికి.

## నివేదన

భారతదేశంలో మూఢనమ్మకాలు, మూఢాచారాలు కరుడు గట్టినై. కాలం మారినా, భావాలు మారినా, పరిస్థితులు మారినా, మనదేశంలో కులవ్యవస్థ మాత్రం సడలక నిలదొక్కుకొని వుంది. కులానికి గౌరవానికి, గౌరవానికి ధనానికి, ధనానికి అధికారానికి ఒక విధమైన సంబంధం యేర్పడివున్నట్లు మనం గమనిస్తాం. ఈ అనుబంధాలను బదాబదలు చేయాలని వేదికల మీద అందరం అంగీకరిస్తున్నాం. కాని ఆచరణలో ఆబధాలు మరింత బలాన్ని పుంజుకుంటున్నట్లు అనుభవం చెబుతున్నది.

ఇప్పుడున్న సాంఘిక స్థాయిని దృష్టిలో పెట్టుకొని భారత దేశ జనాభాను ముఖ్యమైన మూడువర్గాలుగా విభజించారు. అవి (1) అభివృద్ధి చెందిన వర్గాలు, (2) వెనుకబడిన తరగతులు, (2) నిమ్నజాతులు. వెనుకబడిన తరగతులకు అభివృద్ధి చెందిన వర్గాలకు వలె ఆర్థిక వనరులుగాని, నిమ్నజాతులకువలె రాజ్యాంగ రక్షణలుగాని లేవు. గడచిన కాలంలో మనదేశంలో సాగిన సాంఘిక ఉద్యమాలు, ఆర్థిక ప్రణాళికలు వెనుకబడిన తరగతులకు అంతగా అన్వయించలేదు. ఆ మూడు వర్గాల్లోను వెనుకబడిన తరగతులవారి జనసంఖ్య హెచ్చు. అయినప్పటికీ వీరికి గుర్తింపులేదు. దీనికి ప్రధాన కారణం వీరు వందలాది కులాలుగా, చీలికలుగా విడివడి వుండటమే. ఆ విషయాన్ని చాలా సూక్ష్మంగా, సున్నితంగా ఆలోచించి అవగాహన చేసుకోవాలి.

అనుదినం పత్రికా ముఖాన బహుళంగా వినవస్తున్న అల్ప సంఖ్యాకవర్గాలు, బలహీన వర్గాలు అనే పదాలు ఆచరణలో వెనుకబడిన తరగతులకు అన్వయించటంలేదు. అంచేత అసలైన అల్పసంఖ్యాకులుగా, బలహీనులుగా వున్న వెనుకబడిన తరగతులవారికి సహాయం జరగటంలేదు. ఆపదలను

అందరూ అర్ధరహితంగా, తమ ప్రచారానికి పావులుగావాడుకుంటున్నారు. ఈ గజిబిజి రాజ్యాంగం దగ్గర నుండివుంది. ఇది స్పష్టంకావాలి.

స్వాతంత్ర్యం వచ్చిన రెండున్నర దశాబ్దాల అనంతరం కూడ వెనుకబడిన తరగతులకు ప్రత్యేక సంఘ మెందుకు? ఇది ప్రజలలో కులభావాన్ని రెచ్చగొట్టేదిగా లేదా? అనే ప్రశ్నలకు హేతుబద్ధమైన సమాధానా లిచ్చుటకు ఈ పుస్తకం దోహదకారిగా వుండగలదని ని ఆశ.

నిమ్నజాతుల కూడ రాజ్యాంగ రక్షణలపైన, ఇతరుల దయాభిక్షపైన ఆధారపడుతున్నవే తప్ప స్వంతబలంమీద ఆధారపడే స్థితికి రాలేదు. నిమ్నజాతులు, వెనుకబడిన వర్గాలవారి సహకార సానుభూతులు ఇచ్చిపుచ్చుకొనేవిగా ఆచరణలో ఆయత్తం కావాలి.

నాకు ఒకేసారి పుస్తరంగా వ్రాసే వ్యవధి లేనందున ముఖ్యమని భావించిన కొన్ని ప్రసంగాలను వ్రాత మూలకంగా సమర్పించిటం జరిగింది. వ్రాత మూలకమైన ఉపన్యాసాలు సభాసదులలో తగినంతగా ఉద్వేగాన్ని కలిగించలేవనేదే నా అభిప్రాయం. అయితే ప్రేక్షకులనుండి ఇందుకు విరుద్ధంగా వచ్చిన గుర్తింపువల్ల ఉపన్యాస వ్యాసాలను తయారుచేయటంలో నాకు నిరుత్సాహం జనించలేదు.

విషయ విపులీకరణకు చర్విత చరణంగా చెప్పిన వర్ణనలు, ఉదాహరణలు వీలైనంతవరకు ముద్రణలో మినహాయించబడినయ్.

''రచన శాశ్వతంగా వుండాలి'' అనే భావంతో ఈ పుస్తకాన్ని ప్రచురించటంలేదు, నేడు సమాజంలో ప్రమాదకరంగా, బాధాకరంగా కనిపిస్తున్న ఆసమానతలు, అనర్థకాలు అవశ్యం తొలగించబడుటకు అక్షరరూపంలో మలచబడిన ఆ మాటలు, అవి తొలగేవరకు నిలిస్తేచాలు. ఆ

పైన అవి క్షరమైనా, ఖిలమైన ఇబ్బందిలేదు. అది యెంత త్వరగా జరిగితే నా కంత సంబరం. ఈ నా నివేదనతో ప్రగతిపథాన్ని పాఠకుల ముందుంచుతున్నాను. కృతనిశ్చయంతో ముందుకు సాగండి.

తెనాలి — మీ

**8-12-1972** — దేవరపల్లి మస్తాన్ రావు

అంకితం

శ్రమజీవుల సమీకరణోద్యమ

సారథులకు, కార్యకర్తలకు

సూ చి క


| | |
|---|---|
| ప్రజాసంఘములు - పత్రికలు | 1 |
| దళిత జాతులలో హేతువాదం ప్రచారం | 17 |
| వెనుకబడిన తరగతుల వేదిక అవసరము - ఆశయములు | 37 |
| సమాజ నిర్మాణము - కవులపాత్ర | 55 |
| బలహీనవర్గముల సమైక్యత - భారతదేశ పురోగతి | 69 |
| సాంఘిక విముక్తి ఉద్యమములకు కవిరాజు చేయుత | 75 |
| కులరహిత సమాజము | 99 |
| డాక్టర్ అంబేద్కర్ సాంఘిక తత్త్వము | 115 |
| వృత్తి సంఘములు - ఉద్యోగులు | 131 |
| కీర్తిశేషులు గోపాలకృష్ణమూర్తి | 148 |

# ప్రజా సంఘములు పత్రికలు

## "తెల్లజెండా" ఆవిష్కరణోత్సవ సభ

**ది 31-5-70** **ఆదివారం** **నరసాపురం**

సభకు అధ్యక్షత వహించిన నరసాపురం పురపాలక సంఘాధ్యక్షులు శ్రీ చెరుకూరి లక్ష్మణరావుగారికి, "తెల్లరిజెండా" సంపాదకులు డాక్టర్ మల్లిబాబుగారికి, సభకు హాజరైన కవి పండితులు, పత్రికా రచయితలు, ఇతర సోదరీ సోదరులకు మొదట నా హృదయాంజలి ఘటిస్తున్నాను.

ముఖపరిచయం లేని నన్ను ఇంతదూర మాహ్వానించి, సమాజమునకు పట్టుగొమ్మైన పత్రికను ఆవిష్కరించ మని అడగటం నా జీవిత చరిత్రలో ఒక విచిత్ర సన్నివేశం.

నేను రాజకీయ నాయకుణ్ణి కాదు - పెద్ద అధికారినీ కాదు; పండిత ప్రకాండుడను కాదు - కవి శేఖరుడనూ కాద ; కళాతపస్విని కాదు - మహోపన్యాసకుణ్ణి కాదు; ధనవంతుడను కాదు - దానకర్ణుడనూ కాదు. వీనిలో ఏ ఒక్క అర్హత లేనివానికి ఇప్పటి సమాజ వాతావరణంలో ఇంతటి అవకాశం రావటం నాకు "కలయో వైష్ణవ మాయయో" గా వుంది.

అయితే నేను సాంఘిక సేవాసక్తికలవాడను - చిన్న ఉద్యోగిని. పండితుల యెడ గౌరవము కలవాడను - కవితా పిపాస కలవాడను; కళాస్వాదన చేయ

నువ్వివిళ్ళూరువాడను - విషయజ్ఞుల ఉపన్యాసాలు వినాలనేకుతూహలం కలవాడను; దరిద్రుల యెడ సానుభూతి కలవాడను - పాత్రమెరిగిన దానము నత్యుత్తమ గుణముగ పరిగణించువాడను.

ఈ సాధారణ గుణములు కల వ్యక్తులు కూడ ప్రస్తుత సమాజములో మిక్కిలిగా లోపించారు. సామాన్య జనులలో ఈపాటి అర్హతలైనా పెరిగితేనే అసామాన్యులైన వారి ప్రజ్ఞాపాటవములకు ప్రయోజకత్వ ముంటుంది. అంచేత, నన్ను ఆహ్వానించటంలోని ఆంతర్యం, సాధారణ వ్యక్తికి కూడ సమాజములో సముచిత స్థానం కల్పించటం కావచ్చు. అసామాన్యులుగా మారుటకు సామాన్యుల కిది ప్రోత్సాహం, మార్గం.

## ప్రజా సంఘములు

మనది ప్రజాస్వామిక దేశం. మన ప్రభుత్వమునకు ప్రజా సంఘములు పునాదులు. ప్రభుత్వం ఏది చేసినా సమిష్టి ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని చేస్తుంది. మనం ప్రభుత్వానికి యేది చెప్పాలన్నా సమిష్ఠిగా చెబితేనే హెచ్చు గుర్తింపు వస్తుంది. ప్రతి వ్యక్తితన సమస్యలను పరిష్కరించుకొనుటకు వ్యక్తిగాను, సమిష్ఠిగాను ప్రయత్నం చేయాలి. తన సమస్యలవంటి సమస్యలు కలవారిని కొంత మందిని కూడగట్టుకొని, వారందరి ప్రయోజనం కొరకు ప్రజా సంస్థలతోను, ప్రభత్వముతోను మంతనాలు జరపాలి. అప్పుడు వారందరి సమస్యలతో నాటు తన సమస్యలు కూడ పరిష్కారము కాగలవు. అందుచేతనే మన దేశములో సంఘములనేక పరిణామములలో లెక్కించలేనంత పెద్ద సంఖ్యలో వున్నయ్

రాజకీయంగా చూస్తే, కాంగ్రెసు పార్టీ, కమ్యూనిష్టు పార్టి, సోషలిస్టు పార్టీ - స్వతంత్ర పార్టీ, జనసంఘం - ద్రవిడ మున్నేట్ర ఖజగం వగైరా వగైరా, తిరిగి

కాంగ్రెసులో క్రొత్త కాంగ్రెసు, పాత కాంగ్రెసు, జన కాంగ్రెసు, బంగళా కాంగ్రెసు; కమ్యూనిష్టుల్లో మితవాదులు, అతివాదులు, ఉగ్రవాదులు. వారి వారికి అండదండగా శివసేన, శాంతి సేన, రాష్ట్రీయ స్వయం సేవకులు, నక్సలైట్లు, యంగ్ టర్కులు ఇంకా, ఇంకా.

సాంఘికముగా గల కులములు, వృత్తులు ముఖ్యంగా పరిశీలిస్తే.

| | | |
|---|---|---|
| బ్రాహ్మణ సంఘము | .... | నాయీబ్రాహ్మణ సంఘము |
| వైశ్యసంఘము | .... | విశ్వబ్రాహ్మణ సంఘము |
| రాజుల సంఘము | .... | భట్రాజుల సంఘము |
| కమ్మ సంఘము | .... | కమ్మర సంఘము |
| రెడ్డిసంఘము | .... | వడ్డెర సంఘము |
| కాపు సంఘము | .... | కృష్ణబలిజ సంఘము |
| యాదవ | .... | ఆదివాసి సంఘము |
| పద్మసాలి సంఘము | .... | శాలివాహన సంఘము |
| గౌడ సంఘము | .... | బీడీ కార్మిక సంఘము |
| కళావంతుల సంఘము | .... | కళాకారుల సంఘము |
| రజక సంఘము | .... | రాష్ట్రోద్యోగుల సంఘము |
| మహేంద్ర సంఘము | .... | మహిళా సంఘము |
| వాల్మీకి సంఘము | .... | రైలు ప్రయాణీకుల సంఘము |
| పూజారుల సంఘము | .... | మాజీసైనికుల సంఘము |
| ఆది ఆంధ్ర సంఘము | .... | ఆంధ్ర సంఘము |
| రైతు సంఘము | .... | రైసుమిల్లర్ల సంఘము |
| నూరుభాష్ సంఘము | .... | కారు డ్రైవర్ల సంఘము |
| ఆరెమరాటీ సంఘము | .... | కిరాణావర్తకుల సంఘము |

తాపీపనివారి సంఘము ....　　　కాఫీహోటళ్ళ సంఘము

భజన భక్త సంఘము ....　　　భోజన హోటళ్ళ సంఘము

## ఎన్నో ఎన్నో

కళాపరంగా పరికిస్తే, శిల్పులు సంఘము - చిత్రకారుల సంఘము; ఫోటోగ్రాఫర్ల సంఘము - నటీనటుల సంఘము; సినిమాలు తీసేవారి సంఘము - చూచేవారి సంఘము, అభ్యుదయ రచయితల సంఘము - విప్లవ రచయితల సంఘము; పత్రికా రచయితల సంఘము - వారి భార్యల సంఘము; యన్.టి.ఆర్. అభిమానుల సంఘము - అక్కినేని అభిమానుల సంఘము. ఇక సాహిత్య ఎకాడమీలు, సంగీత నాటక ఎకాడమీలు, వ్యక్తుల సన్మాన సంఘములు, స్మారక సభల నిర్వాహక సంఘములు కోకొల్లలు.

ఇందువలన ప్రతి వ్యవహారము సంఘముతోనే ముడివడి యున్నదని తేలిపోయినది. విధిగా ప్రతివ్యక్తి తన మనుగడకు సంబంధించిన అన్ని సంఘములతో చేరి, ఆ యా సంఘముల వృద్ధికి కృషిచేసి, తద్వారా వ్యక్తిగతాభివృద్ధిని పొందవలసి యున్నది.

## నాయకత్వము

ఏ సంఘము అభివృద్ధియైనా మూడు ప్రధాన విషయములపైన ఆధారపడి యుండును.

1. Noble and efficient leadership -
నమ్మకము, సామర్థ్యము గల నాయకత్వము.
2. Financial resources and soundness -
ఆర్థిక వనరులు, పరిపుష్టి.

### 3. Good literature and publicity -

కండగల సాహిత్యము, ప్రచారము.

నాయకులు బాగా చదువుకొన్నవారై, విషయముల నెప్పటి కప్పుడు కూలంకషముగ తెలిసికొన గలిగినవారై యుండాలి. త్యాగబుద్ధి కలవారై యుండాలి. త్యాగమనగా తనకున్న ధనమును వ్యయపరచటమే కానక్కరలేదు. అది "సమయము" రూపములో వుండవచ్చు. "మేధస్సు" రూపములో వుండవచ్చు, "ప్రయాస" రూపములో వుండవచ్చు. నాయకులు సంఘాభివృద్ధికే తమ కృషి నంతటినీ వినియోగిస్తున్నారన్న నమ్మకాన్ని తమ అనుయాయులలో కలిగించ గలిగినవారై యుండాలి. సంపద, సమయము, సహనము, శ్రద్ధ, చదువు, సంస్కారము, మేధస్సు, వ్యక్తిత్వము, వక్తృత్వము, నిగర్వము, నిర్మొగమాటము, నిస్వార్థము కలిగిన నాయకత్వము రాణించగలదు.

నిండు హృదయముతో పరోపరాకారార్థము కొన్ని ఇడుములకులోనై కృషిని సాగించిన, నాయకత్వమునకు స్థిరత్వము, వ్యక్తిగతమైన కొన్ని మేళ్లు తప్పనిసరిగ చేకూరును. ఎండ వానల కోర్చి రైతు మానవున కవసరమైన తిండి గింజలు ప్రధాన ధ్యేయంతో పండిస్తాడు. వేరే కృషి లేకుండా రైతులకు పశుగ్రాసం కూడా లభిస్తుంది. మంచి హృదయముతో సంఘములు నడుపువారికి మంచి రోజు లుండును.

పరులు సుఖముకొఱకు బ్రతు˘యత్నించిన

స్వీయ సుఖము తానె చేరునరుని.

ఇటువంటి నాయకత్వము వృత్తి సంఘములవారికి ముఖ్యముగా లోపించినది. అందుకే సంఘములు నడిచినట్లు కనుపించినా ఆశయ సాధనలో ఇబ్బందులు నడుతునై.

## ఆర్థిక పరిపుష్టి

నాయకులు, కార్యకర్తలు సంఘములను నడుపుటయన, (1) అవసరమైన నిర్మాణ కార్యక్రమములను చేపట్టుట (2) వాటికి వలసిన ఆర్థిక వనరులను చేకూర్చుకొనుట నే నెఱిగినంత వరకు రజక, నాయీ బ్రాహ్మణ, శాలివాహన వంటి వృత్తి సంఘములకు ఆర్థిక ప్రణాళిక లేదు. ఆహారము లేని ప్రాణి ఎన్నాళ్ళు జీవించగలదు? జీవించినన్నాళ్ళు కూడ శక్తిహీనంగానే వుంటుంది. శక్తిహీనమైన సంఘము నెవరు గుర్తిస్తారు? గుర్తించినవా రేమి చేస్తారు? "అయ్యో ! పాపం !" అని నిట్టూర్చి తమ దారిన తాము పోతారు.

ఆ రెండు విషయములకు సంబంధించిన ఆలోచనలను, నిర్ణయములను సంఘములలో పనిచేస్తున్న పెద్దలకు వదలి, ప్రస్తుత సమావేశమునకు సంబంధించిన మూడవ విషయమును సూత్ర ప్రాయముగ ముచ్చటిస్తాను.

## పత్రిక - ప్రచారము

పూర్వం "ధన మూల మిదం జగత్" ధనమే జగత్తుకు మూల మనేవారు. మధ్యకాలంలో అది "స్త్రీ మూలమిదం జగత్" గా మారింది. ఇప్పుడది క్రమానుగత పరిణామం చెంది "ప్రచార మూల మిదం జగత్" గా రూపొందింది.

ఎన్నికలకు ప్రచారం - వ్యాపారాభివృద్ధికి ప్రచారం - విద్యకు ప్రచారం - వైద్యానికి ప్రచారం, భక్తికి ప్రచారం - లాటరీ టిక్కెట్లకు ప్రచారం, అంతా ప్రచారమయం. ప్రచారానికి పత్రిక ప్రధాన సాధనం. అదే ప్రాణం కూడ.

భారత దేశమునకు స్వాతంత్ర్యము రాక ముందే రజక సంఘము పుట్టినది.

పత్రికను పెట్టినది. గుట్టలు - మిట్టలు, నదులు - పొదలు దాటుకుంటూ ప్రయాణము సాగిస్తున్నది.

రజక సంఘం పుట్టినది పశ్చిమ గోదావరి జిల్లా ఈ నరసాపురం పట్టణంలోనే. ప్రారంభదశలోని నాయకులలో చెప్పుకోదగివారు శ్రీయుతులు అంజూరి సూర్యనారాయణ, పోతుమూడి ముసలయ్య, బాదం సూర్యనారాయణ గార్లు. పెరిగినది కూడ ఈ నరసాపురం పట్టణమునందే. కీర్తిశేషులు కోలమూరి వెంకట్రామయ్య, లంకా పేరయ్యగార్లు సర్కారు జిల్లాలకు పరిమితమైన రాష్ట్ర సంఘమునకు అధ్యక్ష కార్యదర్శులుగ వుండెడివారు. ఈ సంఘమునకు లంకా పేరయ్య, పోతుమూడి ముసలయ్యగార్లు చేసిన సేవ, కృషి అనన్య సామాన్యమైనవి - ప్రత్యేకముగా కొనియాడదగినవి.

స్వాతంత్ర్య భానూదయముతో పాటు, 1947-48 సంవత్సరములో రజక సంఘము గుంటూరుజిల్లా తెనాలి పట్టణము మెట్టినది. అక్కడ ఆమె నిండుగా రూపురేఖలు దిద్దుకొన్నది. సర్వాలంకార శోభితయై పరిఢవిల్లినది, శ్రీయుతులు పగడాల లక్ష్మయ్య. వేమవరపు వెంకటేశ్వర్లుగార్ల శక్తిమంతమైన యువ నాయకత్వము క్రింది సర్కారు జిల్లాలతో పాటు రాయలసీమ అన్ని జిల్లాలలోను, పల్లెలలోను సంఘములు వెలసినవి.

ఒక దశాబ్దము వరకు, వారు తమ కుటుంబములను కూడా వెంట బెట్టుకొని అనేక గ్రామములు తిరిగారు. పెద్ద యెత్తున మహాసభలు జరిపారు. మంత్రులను, ముఖ్యమంత్రులను రావించారు. అప్పటి ఉమ్మడి మద్రాసు ప్రభుత్వముతో రాయబారులములు నెరపారు. సంఘీయులను ప్రభావితులను చేశారు. అట్లా ప్రభావితులైనవారిలో నేనొకడను.

1964 నుండి ఇప్పటికి వరకు శ్రీ వేమవరపు వెంకటేశ్వర్లుగానే అఖిల భారత

రజకసంఘమున కధ్యక్షులు. భారత దేశమునం దన్ని రాష్ట్రములలోను వారికి అనుచరులున్నారు. **1964**లో తృతీయ అఖిల భారత రజక మహాసభ మద్రాసులో జరిగింది. ఆ నా డక్కడ జరిగిన ఊరేగింపు, భోజన యేర్పాట్లు, సభా కార్యక్రమాలు, చర్చలు వర్ణనాతీతం. దేశములోని అన్ని రాష్ట్రములనుండి, ముఖ్యపట్టణములనుంచి, ప్రతినిధులు వచ్చారు. తిరిగి "వేమవరపు" నే అధ్యక్షులుగా యెన్నుకున్నారు. ఆంధ్ర రజకులకిది గర్వకారణం.

పత్రికా నిర్వహణయందు రజకసంఘము విశేష అనుభవమును సంతరించుకున్నది.

ఆంధ్ర ప్రాంతమున బహుళ ప్రచారములో నున్న దినపత్రిక "ఆంధ్ర పత్రిక" కు నామాంతరముగ "రజక పత్రిక"ను శ్రీ వేమవరపు వెంకటేశ్వర్లుగారి సంపాదకత్వమున తెనాలి నుండి నడిపించారు. "ఆంధ్ర ప్రభ" ననుసరించి "రజక ప్రభ" ను శ్రీ మునిపల్లె వీరయ్యగారి సంపాదకత్వమున తెనాలినుండి వెలవరించారు. "ఆంధ్ర జ్యోతి" కి బదులుగా "రజక జ్యోతి"ని శ్రీ లూటుకుర్తి లింగమూర్తిగారి సంపాదకత్వమున విజయవాడనుండి ప్రచురించారు. మిగిలిన "విశాలాంధ్ర" నేందుకు మినహాయించవలె నని "తెల్ల జెండా"ను డాక్టర్ మల్లిబాబు అనబడు శ్రీ మానేపల్లి తారకలింగంగారి సంపాదకత్వమున నరసాపురము నుండి ప్రారంభించారు. ఇది యెంతయు ముదావహం.

ఆ పత్రికల్లో ఒక దానికి పురిటిదోషం తగిలింది. మరొకదానికి బాలారిష్ట మాపాదించబడినది. ఇంకొకదానికి నడివయస్సులో రక్తపోటు వచ్చింది వాటితో గ్రుక్క తిప్పుకొనలేక, సరియైన వైద్యుడు దొరక్క అవి సమసిపోయినవి.

ఇప్పుడు రాష్ట్రస్థాయి, ఆంధ్ర రాష్ట్రమునుండి, ఆంధ్రప్రదేశ్‌కి పెరిగినది. రజక పత్రిక స్థాయి మాసపత్రిక నుండి వార పత్రికకు పెరిగినది. తార

కాలింగంగారు సాహిత్యవిశారదులు, వైద్యవృత్తిలో నున్నవారు గనుక పత్రికా బిడ్డను ఆరోగ్యముగా పెంచగలరని ఆశిద్దాం.

ఆశీ :

కష్టజీవులలోన నికృష్ట జీవి
తమ్ము గడిపెడువారి శుభమ్ము కొఱకు
నిలచి యాడుత గగనసీమలను నేడు
జాతి చిహ్నమ్ము "తెల్ల జెండా" తిరమ్ము.

విజ్ఞప్తి

పత్రిక లేనిచో ప్రచారము లేదు. ప్రచారము లేనిచో సంఘము లేదు. సంఘము లేనిచో ప్రజస్వామ్యములో మనిషికి ఉనికి లేదు. అందుచేత నేడు. పత్రిక కత్యంత ప్రాముఖ్యమున్నది.

పత్రిక లేనిచో పరదేశ వార్తల
నెప్పటి కప్పుడు చెప్పు టెట్లు?
పత్రిక లేనిచో భారత వ్యవహార
ములను క్షుణ్ణమ్ముగా తెలియు టెట్లు?
పత్రిక లేనిచో పరమపూజ్యుల మేలి?
మాటలఁ గ్రహియించు మార్గ మేది?
పత్రిక లేనిచో ప్రభవించు మన భావ
ముల నెల్ల నొరులకు తెలుపు టెట్లు?
పత్రికయె లేక చీకటి పడదె జగము
పత్రికయె లేక మే సంఘ పనులు కావు
కాన పత్రిక పోషింప గడగు డయ్య
కనికరమ్మున వృత్తి సంఘస్థులార!

## ఆదర్శం

తెల్ల జెండా ఆదర్శంయెలా వుండాలి? అనునది మరొక ప్రశ్న. ఇది కేవలం ప్రచార సాధనముగానే గాక, పరిశోధనా కేంద్రం (Research Cell) గా కూడ వుండాలి. వెనుకబడిన వర్గాలవా నందరికి విజయపతాకగా రూపొందాలి. రజకుల సమస్యలతోపాటు మరికొన్ని అవసరమైన విషయములను కూడ పరిశీలించి పరిష్కార మార్గములను సూచించవలెను.

1. సమాజములోని జాతులు కొన్ని యెలా వెనుకబడినవి?
2. వాటి సముద్ధరణ కెపుడు? యెవరు? యెటుల కృషి చేసిరి?
3. దానికి పురాణ, చరిత్ర, సాహిత్యపర ఆధారములున్నవా?
4. తెలుగునాట ఈ సంఘము నెవరు? యెపుడు? యెందు కేర్పరచిరి?
5. వెనుకబడిన తరగతుల సంఘ ఆశయము లేమిటి? ఆదర్శము లేమిటి?
6. వాటి ముఖముగా జరిగిన కృషి యేమిటి? కలిగిన ఫలితమేమిటి?
7. వెనుకబడిన వర్గమేలను నడుపు నాయకు లెవరు? వారి అర్హత లేమిటి?
8. ఈ నాయకత్వం సంఘేతరుల కభిమానం గాని, భయంగాని కలిగించినదా?
9. వారి కార్యక్రమము మేధావుల నాకర్షించినదా? సంఘీయులను తృప్తిపరచినదా?
10. ఇప్పుడున్న నడకతో ఇంకెంత కాలమునకు తనగమ్యము చేరుకుంటుంది?
11. ఉన్న ఆలోచనలను క్రమబద్ధము చేయకపోతే, కార్యనిర్వహణలో నూతన విధానమును చేపట్టకపోతే, కార్యకర్తల మనుకొనేవారిది యెంతసేపు తిరిగినా ఉన్న చోటనే వుండే గానుగెద్దు జీవితం కాదా?
12. ఆ తరగతుల పరిస్థితులు ఇతర రాష్ట్రములలో ఇలాగే వున్నవా? ఇంతకంటే హీనంగా, లేదా మెరుగ్గా ఉన్నవా?
13. మెరుగుపబిన వారి పంథా ననుసరించుటకు మనం ప్రయత్నించామా?

ఈ త్రయోదశ ప్రశ్నావళిని ప్రముఖులనుకొను వెనుకబడిన వర్గముల కార్యకర్తల కందించిన, నూటికి పతి మార్కుల కన్న తక్కువ వచ్చు వారే యెక్కువగా వుంటారు. ఇక ఇతరుల సంగతి చెప్పనవసరములేదు.

ఈ ప్రశ్నలను మనం మెదడుతో ఆలోచించాలి. విషయములను తెలిసికోవాలి. లోపములున్న సరిగాదిద్దుకోవాలి. సమస్యల పరిష్కారమునకు మార్గములను కనుగొనాలి. ఆచరణలోనికి తెచ్చుకోవాలి.

## కులతత్వం

నేడుకులతత్వం పతాకస్థాయి నందుకున్నది. పయోముఖ విషకుంభముగ, గోముఖ వ్యాఘ్రముగ మారినది.లోగడ ఈ తత్వంపై కులములవారిలో స్పష్టముగా కనుపించెడిది. వారు క్రింది కులముల వారికి కలిగించే నష్టము ముందుగానే తెలియవచ్చేది. వీరు జాగరూకులై యుండట కవకాశ ముండెడిది. ఇప్పుడటులకాదు. మాటలలో అంతా కులరహితం - సమసమాజం వినిపిస్తారు. చేతలలో తద్విరుద్ధముగా జరిపిస్తారు.

లోగడ కులతత్వం కఱకు కత్తి
ఇప్పటి కులతత్వం మెత్తని కత్తి
చెప్పేడి పేదవర్గాల ఉద్ధరణ
చేసేది పెద్దవర్గాల సముద్ధరణ
ముంగిట గాంధీ పటం
లోగిట బ్రాందీ ఘటం
తను ధరించేది ఖద్దరు టోపీ
ఇతరులకు పెట్టేది కుచ్చులటోపీ
ఓటు కిస్తాడు వందల రూకలు

అటుపైన కడతా డంతస్థుల మేడలు
పేరుచివర కులసూచన  గుర్తులు
పెట్టుకున్నారు రెడ్డి. చౌదరి, శర్మలు
ఓటర్లలిస్టునుంచి తొలగించారు కులం
బూటకపు లెక్కల గారడీ కిది బలం
ఓట్లున్న వారికి సీట్లు రాకపోవడం
సోషలిజం కంఠశోష కావటం
కమ్యూనిజంలో కమ్యూనలిజ ముండటం
పెద్దకులంలోని దద్దమ్మలు పైకి రావటం
చిన్న కులంలోని మేధావులు చితికిపోవటం
నేటి నిజం - న్యాయం కాదు కాదనటం.

ఆ సంఘర్షణ కాలంలో క్రింది తరగతి ప్రజలు మరొక ప్రమాదము నెదుర్కొనవలసి వస్తుంది. కులములు పోవలెనని, వాటివలన నష్టము పొందుతున్న వారు, న్యూనత ననుభవిస్తున్న వారు యెంత గట్టిగా ప్రయత్నిస్తే, కులముల పేరుతో ప్రయోజనము పొందుతున్నవారు, ఆధిక్యత నాపాదించుకుంటున్నావారు  కులముల మనుగడ కంత గట్టిగా ప్రయత్నిస్తారు. అయితే ఆ ప్రయత్నములు ముసుగులో జరుగుతై. క్రింది కులములవారు జాగరూకతతో మసులుకోవాలి. తమ జాగ్రత్తపైనే తమ భవిష్యత్తు, దేశ భవిష్యత్తు ఆధారపడి యున్నది.

జై జనత

# దళిత జాతులలో

# హేతువాదం ప్రచారం

## ఆవుల గోపాలకృష్ణమూర్తి సంస్మరణ సభ

ది 20-9-1970 ఆదివారం విజయవాడ

ప్రసిద్ధ ప్రస్తుత రచయిత - "ఆంధ్ర జ్యోతి" సంపాదకులు, ప్రస్తుత సభాధ్యక్షులు అయిన శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారికి, ఈ వేదికపై నా అభిప్రాయముల నభివ్యక్తము చేసికొను అవకాశమును కల్పించిన విజయవాడ ఆదిమ సమాజ విజ్ఞాన మండలి నిర్వాహకులకు, పూజ్యులైన పెద్దలయు, సదస్యులకు తొలుత నా నమస్సులు.

ఈ సభా నిర్వాహకుల ఆదేశానుసార మిపుడు 'దళిత జాతులలో హేతువాదం ప్రచారం' అను అంశముపై నా ప్రసంగ వ్యాసమును 20 నిమిషాల్లో ముగించాలి. అంచేత శీర్షికలోని పదాల అర్థం - అన్వయం చెడకుండా, హద్దుల మీరకుండా, కాలం పెరగకుండా విషయమును సంగ్రహించి వివరించటానికి ప్రయత్నిస్తాను.

హేతువాదమన మానవవాదం, నాస్తికవాదం కలసివుండే సరికొత్త వాదమని, అది మామూలు మనుషుల కందుబాటులో వుండని మేధావుల వాదమని దేశంలో హెచ్చుమంది భావన. నాకు నేనై హేతువాదమునకు చెప్పుకొను అర్థమేమిటంటే - "కారణ వాదం" (పడివాదమున కెదురు) Based on reason అని; లేదా "వాస్తవవాదం" (మిథ్యావాదమున కెదురు) Based on reality అని.

మనం నడుస్తున్నాం. బొటనవ్రేలికి యెదురు దెబ్బతగిలింది. "అబ్బా !" అని నొచ్చుకొని, తగిలిన కాలును రెండవ కాలుతో నొక్కి, క్షణమాగి, యే యితర అలోచన లేకుండా నడక కొనసాగించుకు పోతాం. మరికొంత దూరం పోయిన తరువాత అదే వేలికి తిరిగి యెదురు దెబ్బ తగులు తుంది. దెబ్బమీద దెబ్బ తగలటం చేత నొప్పి ఇనుమడించి కపాలమున కంటుతుంది. నెత్తురు బొట - బొట కారుతుంది. కాలు పై కెత్తి చేతితో నొక్కి పట్టుకుంటాం. మొదటసారిరాని ఆలోచన అనుకోకుండా వస్తుంది. ఎదురు దెబ్బ యెందుకు తగిలింది?

కాలికి అడ్డంగా రోడ్డుపైన కొక్కిరాళ్ళు నిక్కపొడుచుకొని యుండుట చేతనా? మనం ఆజాగ్రత్తగా నడవటం చేతనా?

"రాసి పెట్టిన యోగ ముంటే తగిలే దెబ్బ తగలక మానదు" అని సమాధానమునకు వస్తే, తన్నివారణకు మానవ ప్రయత్న మేదీ అవసరంలేదు. పర్యవసానంగా యెదురు దెబ్బలు తగులుతూనే వుంటై.

"అజాగ్రత్తగా నడవటం వలన" అని సమాధానము నకు వస్తే, దారి చూచి నడవటం ప్రారంభిస్తాం. అలవాటు చేసుకుంటాం. యెదురు దెబ్బలు తగలటం తగ్గిపోతై.

పుసికన్నుల్ తొసినోటిముండలకు కాపుల్గాసి రేయింబవల్

వ్యసనగ్రస్థపు రక్తిహీనపు కళావ్యాపారముల్ సల్పి, మీ

పసిమేనుల్ వృథ పాడుచేసికొని, ఆపై కర్మనుం దూరుటా !

విసమున్ లోగొని జీవమా విడిచితే వీనిన్ యనన్ భావ్యమా!

చేసిన చెడుపనులవల్ల శరీరమును చీకువడజేసి, కర్మను నిందించుట సబబు కాదు. విషము త్రాగి చచ్చిపోతున్నానని వగచి ప్రయోజన మేమి.

మరొక విషయం. కలాన్ని అధోముఖంగా పెట్టి వ్రాస్తాం. వాయుపీడనం (Atmospheric Pressure) కలంలోని సిరా బరువు లేదా శక్తికన్నా అధికమైన శక్తితో లేదా వత్తిడితో ఊర్ధ్వముఖంగా (Upward thrust) సిరాను పైకి నెడుతుంది. అందువలన కలాన్ని తలక్రిందులుగా పెట్టినా సిరా క్రిందికి జారదు. జాని, కాగితం మీదగిలికితే సిరా క్రిందికి ప్రవహించి కలం వ్రాస్తుంది. ఎందువలన?

దీనికి దీర్ఘంగా ఆలోచించాలి. కొంత శాస్త్ర పరిజ్ఞానం కావాలి. ఇక్కడ కలంలోని సిరా క్రిందికి రావటం భూమ్యాకర్షణ (Earth's gravity) వలన కాక, కాగితమునకు గల పీల్చుకొను గుణం (Absorving Property) వలన అని నిర్ధారించుకోవాలి.

ఇట్లా ప్రతి విషయమును తర్కించి, ఫలితములకు గల కారణములను గ్రహించటంపైన ప్రాయికంగా హేతువాదం ఆధారపడి యున్నదని నా భావన. ఇప్పటి సామాన్య భారతీయుని విజ్ఞాన స్థాయితో పోల్చి చూస్తే, హేతువాదం మేధావులకు అర్థమయ్యే వాదమే అవుతుంది.

ఇక పోతే దళిత జాతులు. ''దళితము'' అనగా సంస్కృతములో ''ఛేదింపబడినది'' అని అర్థం. దళిత జాతులు అనగా ఛేదింపబడిన జాతులు లేదా అణగద్రొక్కబడిన జాతులు (Depressed @lasses) - అజ్ఞానములో వున్న వర్గాలు - అయోమయములో వున్న కులాలు - ఆలనా పాలనా లేక ఆకలితో అలమటించు జనాలు, వీరికి హేతుయుతమైన ఆలోచనాక్రమము నలవరచుట అసాధ్యముకాదు. కాని ఆలస్యముగా

జరుగుతుంది. అయినా అత్యవసరము. హేతుదృష్టిని కలిగించనిచో, దళిత జాతులవారి ఆలోచనా క్రమము మారదు - భావనాశక్తి పెరగదు. భావనాశక్తి పెరగనిచో, అభివృద్ధి ప్రసక్తే లేదు. అందుచేత ఈ జాతుల్లో హేతువాదం ప్రచారం జరగాలి.

మనది విచిత్రమైన సమాజము. ఒక మానవుడు మరొక మానవుణ్ణి తాకితే మైలపడతాడు. హిందూ సమాజములో తెలివిగలవాళ్ళుగా చలామణి అయినవారు ఈ సిద్ధాంతమును ప్రతిపాదించారు - పాటించారు - గంటములతో గిలికారు - శిలాక్షరాలు చెక్కారు - మానవుల్లో ఒక భాగమును వెలి వేశారు. వీరిని ఊరిబయట కాపుర ముండమన్నారు. గ్రామములోనికి వచ్చునపుడు యెండకు చెప్పులు తొడగటం, వానకు గొడుగు వేసికొనటం కూడదన్నారు, వివాహాది క్రతువులకు దళిత జాతులవారు గుఱ్ఱమునో, పల్లకినో యెక్కి ఊరేగుటను సంఘం నిషేధించినది. ఈ అమానుష, అనర్థక సాంఘిక శాసనములన్నీ మన మందరము గమనించినవి - కొందరము అనుభవించినవి. మరి కొంచెము వెనుకకుపోతే హరిజనుడు గ్రామములోనికి వచ్చునపుడు ఉమ్మి వేసికొనుటకు తన వెంట ఒక ముంతను కూడ తెచ్చుకోవాలి. కొందరి వాదన ప్రకారం ఇవన్నీ ఆరోగ్య సూత్రములా? అయితే అందరూ ఆచరించాలి కదా? ఇదీ స్థూలముగా మన ఉన్నత హైందవ సాంఘిక చట్రము, దానికి అనుగుణముగనే ఆర్థికమైన అంతరములు; సమాంతరముగనే రాజకీయమైన అసమానతలు యేర్పడినవి - బాగా బలపడినవి. ఈ విషాదమును తీర్చుటకు, అగాధమును పూడ్చుటకు మహాత్ములెందరో ప్రయత్నించారు. సమస్య పరిష్కారము కాలేదు. ఎందుచేత?

"చాతుర్వర్ణ్యం మయా సృష్టం, గుణకర్మవిభాగశః" "గుణకర్మలను బట్టి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అను నాలుగు కులములను నేనే సృష్టించాను"

అని హిందూ మత ప్రమాణ గ్రంథమున గీతలో కృష్ణ భగవానుడు స్వయముగా నుడవినట్లు వ్రాశారు. దానిని పాండితీ ప్రకర్ష కలిగిన పై అంతస్థులలోనివారు చదివి, అర్థమును విడమర్చితమకు అనుకూలముగ, పామరులుగ వున్న క్రింది అంతస్థులలోని వారికి చెబుతారు. తమ హీనస్థితికి, దీనస్థితికి పూర్వ జన్మ కర్మ కారణమని, అనుభవించక తప్పదన్న భావము వీరికి బలముగా కలుగుతుంది.

చాతుర్వర్ణం వంటి భ్రష్ఠ వ్యవస్థ ప్రపంచములో మరెక్కడా లేదని, ఇది ప్రజలను జీవచ్ఛవములుగా, పక్షవాత రోగులుగా, ఎందుకూ పనికిరాని దద్దమ్మలుగా తయారు చేయు నికృష్ట, నిరర్థక, నీచ వ్యవస్థ అని నవభారత రాజ్యాంగ నిర్మాత కీర్తిశేషులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రవచించాడు - పరితపించాడు - విలపించాడు - విసుగెత్తిపోయాడు. హిందువుగ వుండి, పాతాళము వరకు వ్రేళ్ళుతన్ని మహాబలముగ తయారయిన ఈ కులవ్యవస్థ వటవృక్షమును కూకటివ్రేళ్ళతో పెకలించుట అసాధ్యమని తలచి, చివరకు బౌద్ధములో చేరాడు. లక్షలాది సహచరులను చేర్పించాడు. నేడు భారతీచ హిందువులు కుల సంస్కృతిని తామే వలసకు పోయిన దేశములకు కూడ మోసుకొని పోవుట గమనించదగిన విశేషము. కులరహిత వాతావరణము కలిగిన పశ్చిమ దేశములలో కొన్ని దశాబ్దములు నివసించిర భారతీయ శాస్త్రజ్ఞులు తిరిగి ఇంటికి రాగానే అస్పృస్యతను, కుల వివక్షతను పాటిస్తున్నారు. ఇంతకన్న భారతావనికి సిగ్గుచేటు పని యేమున్నది.

అనుశ్రుతముగ వస్తున్న ఈ వర్ణవ్యవస్థ, మూఢ విశ్వాసములు దళిత జాతులలో అభ్యుదయ భావములు రేకెత్తకుండుటకు కారణమైనవి. సమాజములో తాము అన్ని విధములా అణగారి యుండుటకు గల కారణములను వీరు గమనించలేక పోయారు. తమ అభివృద్ధికి తాము కృషి

చేసికొనవలెనన్న గొడవ వీరికి పట్టలేదు. ఇబ్బంది సబ్బందులకు అంకమ్మ, పోలేరమ్మ, పోతురాజు, కరణము, మునసబు, సర్పంచి వంటి గ్రామ దేవతల పాదములమీద  పడుట వీరికి అలవాటయింది - ఆచారముగ మారింది. ఇది తరతరాలుగ వస్తున్న మానసిక రుగ్మత - దుర్బలత. దీనికి తగిన శస్త్ర చికిత్స జరగాలి.

దేవుడు అవతరించి, దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించి, దేశములో సుభిక్ష వాతావరణమును నెలకొల్పుతాడని మనము పురాణాంతర్గత కథలు చదువుకొన్నాం. వాటినీ కథలుగ మన మనుకొనుటలేదు. అవి వాస్తవములని నమ్మించునంత జిగితో, పాకముతో వ్రాయబడిన కథలు, అంతకు మించిన జిగితో, బిగితో మనము వాస్తవములను గ్రంథస్థము చేయాలి. పురాణములను మరపించు ఇంపు, సొంపు, సుగుణము కలిగిన వ్రాతలను సాహిత్యవ్యాసంగము నందున్నవారు పూనుకొవాలి. ఈ పరంగా సాహితీరంగ మున విశేషమైన కృషి జరగాలి.

ఉదాహరణకు - సత్యమును ప్రబోధించుట కుద్దేశించిన సత్యహరిశ్చంద్ర కథ. ఇది భారతదేశమునందంతట బహుళ ప్రచారములో నున్న దృశ్య కావ్యము. ఈ నాటకమును పరిశీలనా దృష్టితో చూచిన ''సత్యము'' అనునది మానవుడచరించుటకు వీలైన గుణముగ తోచదు. అత్యంత భయంకరముగ గోచరించును. సత్యము జోలికి పోయిన మనిషి మాడిపోవుట సత్యమనిపించును.

సత్యమును బోధించు మరొక కథ ''సత్యకాముడు''. కులము పేర శిష్యరికమునకు నిరాకరింపబడిన సత్యకాముడు, తన పుట్టుకను గురించి నిజము చెప్పినందువలన గురువు తిరిగి ఆశ్రయ మిస్తాడు. తోటి శిష్యులకన్న మిన్నగ చూచు కుంటాడు. సత్యవచనము వలన మేలు కలిగినట్లు నిరూపించబడుతుంది. సినిమా చూచిన ప్రేక్షకుడు సత్యమువైపు ఆకర్షింప

బడతాడు. అటులనే ధర్మమును, త్యాగమును, శీలమును ప్రబోధించు కథలలో మార్పు రావాలి ఆశయము ఆచరణ యోగ్యము కానపుడు ప్రయోజనము శూన్యము కదా!

ఇప్పుడు మతముల గాడిలో పార్టీలు నడుస్తున్నవి. మతాధిపతుల పాత్రలను రాజకీయ నాయకులు పోషిస్తున్నారు. ఆర్థికమైన అంతరములు, సాంఘికమైన వికారములు, విద్యాఉద్యోగములు ప్రాకారములు పాటించక వయోజనులందరికి వోట్ల నిచ్చుట స్వతంత్ర భారతమున తొలిగా తల పెట్టిన మహోదాత్తమైన మార్పు. అయినా, వోట్లు తక్కువగ నున్న అగ్రవర్ణము లనబడువారికి సీట్లు హెచ్చుగా వస్తున్నవి. పరిపాలనీ యంత్రాంగమువారిదే. శాసనాధికారము వారి గుత్తాధికార మయింది. ఎక్కడున్నదీ కీలకం? ఇది ప్రతి పౌరుడు తలను, హృదయమును జోడించి ఆలోచించవలసిన సమస్య.

అప్పటి వరకు మా "ఇజము"లో కులము లేదు మతము లేదు - ఆర్థిక అసమానత లేదు - అని ప్రవచించిన పెద్దలు, ఎలక్షన్లు రాగానే కులము చూచి - ధనము చూచి సెలక్షన్లు చస్తున్నారు. అదేమని అడుగు హక్కు, దమ్ము రాజకీయ ముఠాలలో పనిచేస్తున్న కార్యకర్తలకు లేదు. అథవా అడిగినా ప్రయోజన ముండదు. మీదుమిక్కిలి అడిగినవాడికే కులతత్త్వము నాపాదించుట జరుగుచున్నది.

ఈ పరమ సత్యమును పార్టీలకు ఊడిగము చేస్తూ, వాటి వాటి జెండాలు మోసి మోసి భుజములు కాయలు కాచిన దళిత వర్గముల ప్రజలు గ్రహించాలి. క్రింది తరగతులు బాగుపడుటకు వారి గౌరవమును పెంచుటకు తన అభిమాన పార్టీ తీసికొంటున్న కార్యక్రమములను గమనించాలి. వ్యక్తిత్వమును నిలబెట్టుకోవాలి. డూ డూ బసవన్నలవలె కాకూడదు.

"కులము లేదు" అని ప్రచారము చేస్తూ, తమకున్న అన్ని అవకాశములను వినియోగించుకొని, ఒకే కులమువారు లేదా కొద్ది కులములవారు అధికారములోనికి వచ్చుట పై కులములవారు చేస్తున్న తప్పు.

"కులము లేదు" అను ప్రచారమును నమ్మి, తమ కులములకు అన్యాయము చేస్తూ, పై కులములవారిని హెచ్చుగా అధికారములోనికి పంపించుట క్రింది కులముల వారు చేస్తున్న తప్పు.

ఈ రెండు వాక్యములలోని వాస్తవమును ప్రజలందరు గమనించాలి. పరిష్కార మార్గమును కనుగొనాలి. ఇందుకు క్రింది కులములవారి సమైక్యత ప్రధానము. పై కులముల వారి సానుభూతి ద్వితీయము. క్రింది కులములవారు సమైక్యముగ తమ బలమును ప్రదర్శిస్తే, పై కులములవారి సానుభూతి అనివార్యంగా వస్తుంది కట్టలు తెంచుకొని ప్రవహిస్తుంది. దళిత జాతుల వారి సర్వమైన సమస్యల కిదే పరిష్కార మార్గము.

ఈ సందర్భముగ, ప్రసిద్ధ న్యాయవాది, హేతువాది, మానవతావాది, ప్రముఖ పత్రికా రచయిత, సంఘసంస్కర్త, సంపూర్ణ మనీషి, మన మిప్పుడు సంస్మరించుకుంటున్న మహావ్యక్తి, కీర్తిశేషులు ఎ.జి.కె. అనబడు ఆవుల గోపాల కృష్ణమూర్తిగారు 1952 జూన్ 10వ తేదీన బాపట్లలో వెనుకబడిన తరగతుల కార్యకర్తలు యేర్పాటు చేసిన బ్రహ్మాండమైన బహిరంగసభను ప్రారంభిస్తూ వాక్రుచ్చిన పసిడి పలుకులను ఉదహరించుట ఉచితమని నేను భావిస్తున్నాను.

"ఒకే ఒక అభ్యదమ మార్గము కొందరిపట్ల సుగమ్య గోచరముగ, మరికొందరికి కష్టముగ ఉండుట అబ్బురములేదు.

"హృదయ సంకుచితత్వమునకు తార్కాణమైన కులతత్వ మెవరిలో వున్నా తప్పే. అయితే బహుజన శ్రేయస్సు దృష్ట్యా, పరిస్థితులనుబట్టి కొందరి

కులతత్వము సమంజస మనక సమర్థించక తప్పదు.

“అగ్ర వర్ణస్తుల మనుకొను వారి కులతత్వము కొన్ని తరములుగ తమ ఉక్కుపాదముల క్రింద మట్టగించబడిన వారి స్వేచ్ఛ జీవిత కుసుమములను వాడ్చి వత్త లగునట్లు చేస్తుంది. ఇది దేశమునకు ప్రమాదకరము. హీనవర్ణములుగ పరిగణింపబడుచున్న వారి కులతత్వము పూజ్య వర్ణముల వారమని చెప్పుకుంటూ, చుక్కలలోనికి చూచేవారి కులాధిక్య తమస్సును తగ్గించి, విజ్ఞాన మహస్సును కలిగిస్తుంది. ఇది దేశమునుకు ప్రమోదకరము.

“అన్ని రంగములలోను అభివృద్ధి చెందిన రాజ్యముల జాతీయవాదము విశ్వ శ్రేయస్సు దృష్ట్యా ప్రమాదమునకు దారితీస్తుంది. బడుగు దేశముల జాతీయవాదము ఆ ప్రమాదముల బారి నుండి తప్పించుకొనుటకు అనుసరించవలసిన విధానమవుతుంది. ఇదే న్యాయము దళితవర్గముల ఉద్యయమునకు వర్తిస్తుంది. కావున, దళితవర్గముల సమిష్ఠి కార్యక్రమము సహేతుకము - చట్టసమ్మతము అనక తప్పదు.

“పార్టీ తత్వము పౌరుషమునకు, ప్రగల్భములకు, విచక్షణాజ్ఞాన శూన్యమునకు హేతువవుతుంది. తమతో పోటీపడుచున్న పార్టీలవారి తప్పులను తప్పులుగా ప్రచారము చేయుటతో పాటు, వారి ఒప్పులనుకూడ తప్పులుగ నిరూపించుటకు వీరు మరి కొంచెము పెద్దతప్పు చేస్తారు. మతతత్వము కూడ ఇంతే. కులతత్వము అన్నయ్య మతతత్వము. వీటి నన్నిటిని అధిగమించిన అసలైన అభ్యదయము సభిలషించుటయే మనందరి తత్వమైయుండాలి.

నేను సంపాదకునిగ, ఎ.జి.కె, రాజకీయ వ్యాఖ్యాతగ వుండి నిర్వహించిన “యుగవాణి” మాసపత్రిక **1952** జులై సంచికలో “కులతత్వము” శీర్షిక క్రింద నేను వ్రాసిన సంపాదకీయములో పొందుపరచబడిన ఎ.జి.కె. ఉపన్యాసభాగమే ఈ విషయము.

ఆంధ్రరాష్ట్ర వెనుకబడిన తరగతుల ఉద్యమ ప్రచార పత్రిక "యుగవాణి" అదే సంపాదకీయములో కులనిర్మూలనకు యీక్రింది సూచన చేసినది.

"కుల, మత, వర్గ. పార్టీ రహిత సమాజ నిర్మాణము జరగాలని అందరూ సిద్ధాంతముగ అంగీకరిస్తున్నారు గనుక ఇది న్యాయ సమ్మతము. సమాజాభివృద్ధికి అన్ని విధముల అడ్డంకుగా వున్న "కులము" సమూలముగ మొదట నిర్మూలింపబడాలి. అందుకు గౌరవనీయ, ఘనమైన మొదలుగు గౌరవ పదములను - విధేయుడు, సేవకుడు మొదలుగు నీచ పదములను వ్రాతలలో వాడరాదని శాసించినట్లుగానే, ప్రభుత్వము పేరు చివర కులజాడ్యమును సూటిగ సూచిస్తున్న శాస్త్రి, శర్మ, ఆచారి, నాయుడు, రెడ్డి, చౌదరి, రాజు, లింగం వంటి తోకల వాడకమును చట్టరీత్యా నిషేధించటము మంచిది."

కొన్ని వేల సంవత్సరములనుండి నిరంతరముగ కుల వ్యవస్థపై జరిగిన దాడి ఫలప్రదము కాలేదని, ఇప్పుడది శాశ్వత లక్షణమును సంతరించుకొన్నదని ప్రముఖ సోషలిస్టు (సామ్యవాద) నాయకుడు డా॥ రామమనోహర్ లోహియా"The Cast System" అను తన పుస్తకములో వాపోయాడు. అసలు జరుగుచున్న దేమన, రాను రాను ఈ రోగము ముదిరిపోతున్నది. వెఱ్ఱిమొఱ్ఱి తలలు వేస్తున్నది. పూర్వపు "నాల్గుపడగల హైందవ నాగరాజు" ఇప్పుడు "వేయి పడగలయతి క్రూర విషనాగు" అయింది. ప్రమాదము పెరిగింది.

చెప్పేదానికి చేసేదానికి నేడు పొంతన లేదు. వ్యవహారము తలక్రిందులుగ, కథ ముసుగులో సాగిపోతున్నది. మంచి మాటలతో లాలించి పాలించ ప్రయత్నించువారి మోసములను పసిగట్టి మెలగాలి. దళిత జాతులు తమ సమైక్యతా బలముతో ఈ మర్మమును ఛేదించాలి - పద్మవ్యూహమును ఛేదించాలి.

సంస్కారమనునది, అభివృద్ధి అనునది కార్యరూపములో వుండాలి. కండ్లకు కనుపించాలి. అందుకే అన్నాడు ఎ.జి.కె. "Culture is not a nown, it is a verb" "సంస్కృతి నామవాచకము కాదు, క్రియ" అని. ఇది చాల అర్థవంతమైన ప్రవచనము.

రెండు దశాబ్దముల క్రితము 1951 ఏప్రిల్ చివరి వారములో ఏలూరులో ఆంధ్రరాష్ట్ర రజకజన మహాసభ పెద్ద యెత్తున జరిగింది. ఆ మహాసభకు ఆవుల గోపాలకృష్ణమూర్తిగారు అధ్యక్షత వహించారు. ఇప్పటికి మన సభాధ్యక్షులు, అప్పటి ఆంధ్రప్రభ సంపాదకులు అయిన శ్రీ నార్ల వెంటేశ్వరరావుగారు ఆ మహాసభను ప్రారంభించారు. 1951 మే 2వ తేదీ ఆంధ్రప్రభలో "కజకవృత్తి" పై సంపాదకీయం వ్రాశారు; కులములపైన తమ అభిప్రాయమును వ్యక్తీకరించారు. ఇప్పుడు చెప్పబోవునది వారి పెద్ద సంపాదకీయములోని చిన్న భాగము.

"ప్రొద్దస్తమానము రెక్కలు విరుచుకుంటూ, తన రక్తాన్ని చాకిరేవుకు అప్పజెప్పుతూ, సాయంత్రానికి కుంటి, గుడ్డివాళ్ళలాగా బుట్టచేతబట్టి "అమ్మా ! అన్నం పెట్టమ్మా!" అని ఇంటింటికి తిరిగి, ఆ అమ్మలేదంటే చేసేదేమీ లేక, కాళ్ళీడ్చుకుంటూ తిరిగివచ్చి, పిల్లతో సహా పస్తులు పడుకొనే స్థితి ఇంకా మనకు తప్పలేదు.

"తన భార్యను ఇతరులు "ఏమే" అంటే మన పురుషుడు పౌరుషము చంపుకొని, గుడ్లు మిటకరిస్తూ, అన్నింటికీ తలవొగ్గి గాడిద చాకిరి చేస్తున్నాడు.

"ఈ విషయములు ఆర్థికంగా ఆ సంఘం దీనస్థితిని, సాంఘికంగా అది అనుభవిస్తున్న నైచ్యాన్ని కండ్లకు కట్టి నట్టు, గుండెల్లో గుచ్చినట్టు ప్రకటిస్తున్నవి.

"ఒకప్పుడు కులవ్యవస్థ నిర్దుష్టంగా వుండేదేమో. వివిధ సంఘాలమధ్య

సమన్వయం. సామరస్యం పొసగిందేమో అన్నది అప్రస్తుతం. కాలంమారింది. పరిస్థితులు మారినయ్. అభిప్రాయములు మారినయ్. సంఘవ్యవస్థలో దానికి అనుగుణ్యమైన మార్పుటు రావటం సహజమేకాదు, అనివార్యం కూడా.

"కులాలనుబట్టిగాని, వృత్తులను బట్టిగాని హెచ్చులొజ్జులు పాటించవలసిన రోజులు కావివి. ప్రజలందరకు సమానహక్కులు, సమాన బాధ్యతలు కలవని చాటింపబడే ప్రజాస్వామ్య దినాలు. ఆర్థికంగా, సాంఘికంగా, వైజ్ఞానికంగా వెనుకబడిన సంఘాలకు ఈనాటకైనా జ్ఞానోదయం కలిగి, పదుగురితో పాటు తామూ పైకి వద్దామనే ఆకాంక్ష; అభిమానంతో, ఆత్మగౌరవంతో, బ్రతుకుదామనే అపేక్ష వారిలో యేర్పడటం దేశం యావత్తు ఎంతో సంతోషించదగిన విషయం.

"వృత్తులకు సంబంధించిన సదుపాయముల రక్షణలకు ప్రభుత్వం పూచీ పడటం న్యాయం - సహేతుకం. ఈ విషయంలో ప్రభుత్వం యెంత నిర్లక్ష్యం చూపుతుందో అంత ప్రజా విశ్వాసాన్ని కొల్పోతుంది."

దళిత వర్గములపైన ఎ.జి.కె., నార్లవారు వెల్లడించిన అభిప్రాయముల వలన ఆ వర్గములకున్న ఈతిబాధలు, వారికి కలిగించవలసిన ప్రత్యేక సౌకర్యముల అవసరం తేట తెల్ల మౌతున్నవి.

దళిత వర్గముల వారి సమస్యలను హేతుదృష్టి (వాస్తవ దృష్టి) తో పరిశీలించి, ప్రచారము చేసి, పరిష్కరించవలసిన బాధ్యతను హేతువాదులు, ఆదిమజాతి విజ్ఞానమండలి వంటి సేవాసంస్థలు అధికంగా తీసుకోవాలి.

తాము కాళ్ళు ముడుచుకొని కూర్చుంటే, తమ అభివృద్ధికి ఇతరులు కృషి చేసిపెడతారని దిక్కులు చూడటమే బానిస భావములకు పునాది. మానవు డెప్పుడూ తన కేమి కావాలో ఊహించుకొలేకపోడు. ఆ ఊహించుకొన్న దానిని

ఆచరణలో ఆయత్త పరచుకొను మార్గాన్వేషణలోనే ఇబ్బంది పడతాడు. ఆ ఇబ్బందులు తన తాహతుకు మించి పోయినపుడు వాటికి లొంగి పోతాడు. పరిస్థితులకు దాసోహమంటాడు. అప్పుడే భావదాస్య బీజములు అంకురిస్తవి. మనో దౌర్బల్యం కలుగుతుంది. సాధించవలసినది చిన్న కార్యమయినప్పటికి గుండె నిబ్బరముగా వుండదు. తన శక్తిమీద తనకు నమ్మకము తగ్గుతుంది. ఇతరుల అల్పశక్తిని ఘనంగా చెప్పుకుంటాడు. అల్పుల సహాయమునకు అంగలార్చుతాడు. ఆ విలక్షణము లొకసారి ప్రారంభమయితే, మానవుణ్ని అంత తేలికగ వదలిపెట్టవు. ఇందుకు బలవత్తరమైన మరొక కారణము కూడ వుంది. తనకు యేమి కావాలో తానే ఆలోచించుకొని, తానే ఆచరణలోనికి తెచ్చుకొనటం బహు భారముగా కనిపిస్తుంది. తన శ్రేయస్సుకు ఇదరులు ఆలోచించి ఇతరులే పనిచేసిపెట్టటం సులువుగా వుంటుంది. ఆ మానసిక దుర్బలత్వమే దళిత వర్గముల వారి ఆలోచనాశక్తిని చంపి, ఇంతటి దీర్ఘకాలము బానిసలక్రింద బానిసలుగ బ్రతుకుటకు దారితీసింది.

హేతువాదం ప్రచారం చేసి, ఈ విషయములను జనసామాన్యమునకు, ముఖ్యముగ దళిత వర్గములవారికి తెలియజెప్పవలసిన అవసర మెంతగానో వుంది. ఎవరి శక్తి పైన వారికి నమ్మకము కుదురుకొనునట్లు చేయాలి. తాను కూడ మానవ సమాజములో మానవుడగా మనుటకు తగిన అవకాశము లున్నవన్న ఆత్మవిశ్వాసమును ప్రతి వ్యక్తికి కలుగ జేయాలి.

ఆర్థిక, సాంఘిక రంగములలో అనివార్యమైన మార్పు ప్రారంభమైనదనే చెప్పాలి. దళిత వర్గములలో విద్య, రాజకీయ చైతన్యము సూక్ష్మముగ ప్రబలినవి. గత చరిత్రను ప్రతి వ్యక్తి ఒకసారి నెమరు వేసుకొంటున్నాడు. అరువు కాళ్ళను తొలగించి, స్వంత కాళ్ళపైన నిలబడగల సత్తాను సంపాదించుకొనుటకు ఆరాటపడుతున్నాడు. అయితే, ఈ ఆరాటము కేవలము ఆలేశములోనికి

మారకూడదు. తన ఉత్సాహమును క్రమానుగతముగ, క్రమబద్ధముగ ఉద్వేగములోనికి మార్చుకొని కార్యరూపములోనికి తెచ్చుకోవాలి.

ఇక పోతే కుల నిర్మూలనం. దీనికి అన్ని వైపులనుండి ఒకే సారి దాడి జరగాలి. ఇక్కడ "అన్ని వైపుల నుండి ఒకే సారి" అనునది ముఖ్యము.

**(1) రాజకీయముగ :-** పేదవారిని పేదవావారు మొదట గుర్తించాలి. "విసము కూలికి ద్రావెడు వెట్టిలోలె" తమ వోట్లను డబ్బుకు అమ్ముకొన కూడదు. క్రింది తరగతులవారికి వోట్లిచ్చి అధికముగ పరిపాలనా రంగములోనికి పంపించాలి అప్పుడే అధికార వికేంద్రీకరణ జరుగుతుంది.

**(2) సాంఘికముగ :-** వర్ణాంతర వివాహములను ప్రోత్సహించాలి. కులాంతర వివాహము చేసికొన్న వారికి స్థానిక సంస్థలు పౌర సన్మానములు జరపాలి. ప్రభుత్వము వారికి ఉద్యోగములలో ప్రత్యేకతను చూపించాలి.

**(3) ఆర్థికముగ :-** వెనుకబడిన వర్గముల వారికి విద్యా ఉద్యోగములలో ప్రత్యేక సౌకర్యములతో పాటు, పరిశ్రమలు స్థాపించుకొనుటకు; వ్యవసాయము, కంట్రాక్టులు చేసి కొనుటకు ప్రభుత్వము వడ్డీ లేకుండా - లేక తక్కువ వడ్డీతో అప్పు లివ్వాలి.

తమ సోమా జ్యోతిర్గమయ.

# వెనుకబడిన తరగతుల వేదిక

# అవసరము - ఆశయములు

### వెకబడిన తరగతుల వేదిక ప్రారంభసభ

ది 1-11-1970 ఆదివారం తెనాలి

తెనాలి పురపాలక సంఘ అధ్యక్షులుగ, ఆంధ్రప్రదేశ్ శాసనసభా సభ్యులుగ, స్థానిక కళాశాల నిర్వాహకులుగ, బలహీన వర్గాల ఉద్యమ సారధులలో ఒకరుగ విశేష అనుభవమును గడించి, ఇప్పుడు మన "వెనుకబడిన తరగతుల వేదిక, తెనాలి" (The Backward Classes Forum, Tenali) ప్రారంభ సభకు అధ్యక్షత వహించుట కంగీకరించి అరుదెంచిన శ్రీ నన్నపనేని వెంకట్రావుగారికి, ఈ కార్యక్రమములో ప్రధాన భూమికలు నిర్వహించుచున్న వక్తలకు, నాలో ఊహామాత్రముగా వున్న భావనకు ఈ విధమైన కార్యరూపము నిచ్చుటలో కలసివచ్చిన కార్యకర్తలకు, మా ఆహ్వానమును మన్నించి విచ్చేసిన సభా సదులకు సుస్వాగతము వారికి నా హృదయపూర్వక నమస్కారములు.

ఈ "వెనుకబడిన తరగతుల వేదిక" నే వ్యవధి లేకుండ, ఈ రోజుననే ప్రారంభించవలసిన అవసరమును, ఆ వేదిక ఆశయములను వివరించ వలసిన బాధ్యత సమావేశ కర్తగ నాపై వున్నది. నిర్ణయించిన కార్యక్రమము ననుసరించి ఈ వివరణ 20 నిమిషములకు పెరగకూడదు. ప్రసంగముల కన్న ప్రసంగ వ్యాసములు కాలమును, విషయమును కుదించు కొనుటకు, భద్రపరచి ప్రచురించుకొనుటకు ఉపయుక్తముగ వుండగలవని భావించబడినది.

ఈ రోజు నవంబరు ఒకటి. ఆంధ్రప్రదేశ్ పదునాల్గు సంవత్సరములు క్రితం మవతరించిన రోజు ఈ మాట ఒక్కటే చెప్పితే ఈ రోజు ప్రాధాన్యత

విశదపడదు. అంతకు ముందు నాలుగున్నర దశాబ్దములుగ నాయకులు దేశమును భాషా ప్రయుక్తముగ విభజించవలెనని నిరంతరముగ సల్పిన పోరాటము విజయవంతమై ఆంధ్రప్రదేశ్‌గా రూపొందిన దినము. ఆ రోజుననే మరికొన్ని రాష్ట్రములను భాష ప్రాతిపదికగ యేర్పాటు చేశారు. భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరములతో లిఖింపబడిన దిన మది.

ఈ నవంబరొకటికి ప్రకృతి సిద్ధమైన ప్రాధాన్యత కూడ వుంది. దేశములు దేదీప్యమానముగ వెలిగించు దీపావళి నవంబరొకటికి ఒకటి రెండు రోజులు పూర్వమో, తరువాతనో వస్తుంది. వర్షాకాలపు మసకమబ్బులు విడిపోయి వెలుగురోజులు ఆరంభమౌతై. వ్యవసాయాది పను లింకా ప్రారంభము కావు. ప్రజలు విశ్రాంతిగా వుంటారు.

ఆర్యులు చీకటిగా వున్న ఉత్తర ధృవమునుండి వలస బయలు దేరి వెలుగును చూడటము, శ్రీకృష్ణుడు నరకుని వధించటము, శ్రీరాముడు అరణ్యావాసము ముగించుకొని విజయవంతముగ అయోధ్యకు తిరిగి రావటము, బలిచంక్రవర్తికి వామనుడు పాతాళమున కంపి మోక్షమివ్వటము, జైనమత స్థాపకుడైన మహావీరుడు నిర్యాణము చెందటము వంటి యెన్నో పురాణ, చరిత్ర ప్రసిద్ధమైన ఘన కార్యములను దీపావళి సహచరియైన నవంబరొకటి జ్ఞాపకం చేస్తుంది. విజ్ఞానమునకు, వివేకమునకు, పరిపాకమునకు, ప్రగతికి ప్రతీకగ దీపమును ప్రపంచమంతట పరిగణిస్తారు. అజ్ఞాన తమస్సులో వున్న వెనుకబడిన తరగతులవారికి విజ్ఞాన మహస్సును కలిగించు ఉద్యమ ప్రారంభమున కీ రోజు తగినదని నిర్ణయింప బడినది.

ప్రత్యేకముగ ఈ 1970 నవంబరు ఒకటిని "ప్రజాసహకార దినము"గ వెల్లడించలెనని ఈ వర్గముల శ్రేయోభిలాషులలో ఒక రైన జగ్జీవన్ రాం ఇటీవల ప్రకటించారు. నెలలో మొదటి ఆదివారం ఆ వేదిక కార్యక్రమములు

జరుపుకొనవలెనని మా ఉద్దేశ్యం. దానికి అనుగుణముగ ఈ నవంబరొకటిన ఆదివారం వచ్చింది ఇన్ని కలసి రావటమువలన వ్యవధి తక్కువగా వున్నా, ఈ రోజున వెనుకబడిన తరగతుల వేదిక ప్రారంభ సభ జరుపుటకు నిశ్చయింపబడినది.

ఈ కార్యక్రమమును ప్రకటించిన తరువాత వెనుకబడిన తరగతులకన్న, నిమ్న జాతులను కలుపుకొని, బలహీన వర్గములకు (Weaker Sections) ఈ వేదికను విస్తృతపరిచిన బాగుండునేమో చూడమని కొందరు పెద్దలు సూచించారు. ఈ సూచనతో నాకు వ్యతిరేకత లేదు. నిమ్న జాతులను కలుపుకొని వెనుకబడిన తరగతులు సమైక్యముగ కృషిని సాగిస్తేనే దేశములో అత్యధిక సంఖ్యాకులుగ వున్న బలహీన వర్గములు బలపడతై - బాగుపడతై. ఇది జరగాలి. అయితే, ఈ రోజున - అంటే, స్వాతంత్రం వచ్చిన 23 సంవత్సరాల అనంతరం "వెనుకబడిన తరగతులు" అని చెప్పబడుచున్నవారికి దేశము మొత్తముమీద ప్రత్యేకముగ ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని ప్రత్యేక బలహీనతలు యేర్పడినవి. ఆ బలహీనతలను సవరించుటకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఈ విషయమై నా అభిప్రాయములను సహృదయముతో స్వీకరించి సానుభూతితో పరిశీలించవలెనని సభాస్తారులకు మనవి చేస్తున్నాను.

వెనుకబడిన తరగతుల ప్రజలు ప్రస్తుతము చాల ప్రమాద పరిస్థితిలో వున్నారు. ప్రజారాజ్యములో వీరి భాగమేదో, స్థానమేదో; ప్రణాళికలలో వీరి ప్రగతికి తీసికొనుచున్న కార్యక్రమము లేవో తెలియుటలేదు. దేశము సోషలిజమువైపు పరుగిడుచున్నదని అంటున్నాము - అరుస్తున్నాము యే చట్టములోను. సంస్థలోను వెనుకబడిన వర్గముల అభివృద్ధిని గురించి ఇదమిద్దముగ చెప్పు వాక్యములు గాని, వ్యక్తులుగాని కనపడుటలేదు. వెనుకబడిన తరగతుల నిటులనే వుంచి సోషలిజమును తెచ్చు టమెటుల సాధ్యపడునో అనూహ్యము.

వెనుకబడిన తరగతులపైన - వారి సమస్యలపైన దేశములో అందరికీ, లేదా చాలామందికి అస్తవ్యస్తమైన పరిజ్ఞానమే వుంది. వీరి బాగోగులను చర్చించి నిర్ధారించుటకు నవభారత రాజ్యాంగ నిర్ణేతలకు సహితము సాధ్యపడలేదు. భారత రాజ్యాంగములో "Other Back ward Classes"ఇతరవెనుకబడిన తరగతులు అను పదము నొకటి రెండు చోట్ల ప్రస్థావించటము తప్ప, స్పష్టమైన నిర్ణయములు చేయలేక పోయారు. దీనికిగల కారణములు (1) ప్రాంతములను బట్టి, వృత్తులనుబట్టి దేశములో రకరకములుగ, అనేకముగ వున్న వీరి సమస్యలు వారికి అర్ధము కాకపోవుట, (2) వెనుకబడిన తరగతులవారినుండి ఆందోళన తగినంతగా కాదుగదా అసలు లేకపోవుటే. నేడురాజ్యాంగ పరమైన విషయముపై ప్రసంగించ వలసిన వారు మరొకరున్నారు గనుక నేను విస్తృత పరిధిలో చర్చించను.

ఆర్థిక, సాంఘిక, విద్యారంగములు ప్రాతిపదికగ దేశ జనాభాను మూడు తరగతులుగ విభజించారు.

(1) Scheduled Casters and Scheduled Tribes.

షెడ్యూల్డు కులములు, షెడ్యూల్డు జాతులు. వీరిని నిమ్నజాతులు, కొండజాతులు అని హరిజనులు, గిరిజనులు అని అంటారు.

(2) Other Backward Classes. ఇతర వెనుక బడిన తరగతులు. చేతివృత్తులవారను పదము కూడ వీరికే వర్తిస్తుంది.

(3) Forward Classes. ముందుబడిన తరగతులు లేదా అభివృద్ధి చెందిన వర్గములు. బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, కమ్మ, రెడ్డి, నాయుడు మొదలగు కులములవారు ఈ వర్గము క్రిందకు వస్తారు.

షెడ్యూల్డు కులములు, షెడ్యూల్డు జాతుల వారికి జనాభా నిష్పత్తిపైన విద్యాఉద్యోగములలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో 100కి 18 స్థానములు కేటాయించారు. ఇందులో హరిజనులకు 14, గిరిజనులకు - 4, అట్లాగే రాజకీయాధికారమును కూడ వీరికి పంచిపెటారు. గడచిన 23 సంవత్సరములు వారి కోటాకు భిన్నము లేకుండ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వములలో ఇచ్చిన సౌకర్యములను వారు అనుభవిస్తున్నారు. నా దృష్టిలో ఈ అనుభవించు సౌకర్యములింకను సరిపోవుట లేదు.

ఇప్పుడు పొందుతున్న సౌకర్యములవలన దేశము మొత్తముమీద ప్రతి రాష్ట్ర ములోనుI.A.S., I.P.S. వంటి (All India Services) అఖిల భారత సర్వీసులలో మొదటి తరగతి గజిటెడ్ ఆఫీసర్లుగ, ప్రభుత్వ కార్యదర్శులుగ, డైరెక్టర్లుగ, విశ్వవిద్యాలయ ఆచార్యులుగ, ఉపాధ్యక్షులుగ ఉభయ శాసనసభల సభ్యులుగ, పార్లమెంటు సభ్యులుగ, మంత్రులుగ, ముఖ్యమంత్రులుగ, రాజకీయ పార్టీల కేంద్ర నాయకులుగ అన్ని స్థాయిలలోను హరిజన గిరిజన వర్గములవారు ఈ 23 సంవత్సరముల కాలములో వేల సంఖ్యలో అనుభవమును గడించారు. నివేశన స్థలములు, బంజరు భూములు అక్కడక్కడ వీరికి ఇవ్వబడినవి. Leather Boards ద్వారా వృత్తి సౌకర్యములు కొంతకు కొంత కల్పించబడినవి. హాస్టలు మేనేజిమెంట్లు హెచ్చుగా ఇవ్వబడినవి. స్వతంత్ర భారతములో హరిజనులు, గిరిజనులు పొందిన మేలు, పంచుకున్న పాటి ఏదో కొంత పరిమాణము (Scale) లోకనబడుచున్నది. సంవత్సరములు గడచినకొద్ది. సౌకర్యములు కొనసాగినకొద్ది వారిలో చైతన్యవంతులైన వారి సంఖ్య సహజముగ పెరుగుతుంది. చైతన్యము పెరిగిన కొద్ది ఆందోళనకు కావలసిన బలమును ఆయత్తపరచుకొన గలుగుతారు. ఇప్పుడిక వారి పురోగతి ఆగదు.

ఆ ఇచ్చే సౌకర్యములు యే ఒక్కరు లేదా వర్గము దయదలచి ఇస్తున్నారని నేననను. యే వర్గమున కా వర్గమును చూచినపుడు హరిజనులు సమాజములో బహుళ సంఖ్యలో వున్న వర్గము. వీరి వోట్లు హెచ్చు. ఎవరు అధికారములో వున్నా వీరివంక చూడకుండుటకు వీలు లేదు.

ఇంత వ్యవహారమున్నా పల్లెపట్టులలో నివసించు సామాన్య హరిజనుని స్థితి మారలేదు. ఇంకా అక్కడక్కడ యేదో ఒక నెపముతో హరిజన యువకులను స్తంభములకు గట్టి సజీవ దహనము చేయుటవంటి దారుణ దానవ కృత్యములు జరుగుచున్నవి. దీనివలన పై వర్గముల మౌఢ్యమెంతటి ముదురుపాకములో వున్నదో, హరిజనులు తమ్ముతాము రక్షించుకొనుటకు ఇంకా యెంత బలమును సమకూర్చుకొనవలయునో బోధపడగలదు.

ఇది క్రింది నుంచి పై వరకు లింకులున్న హరిజనుల విషయము కావున పార్లమెంటువరకు పోయి చర్చలు, విచారణలు జరిగినై. ఇదే వెనుకబడిన తరగతులవారికి జరిగితే పంచాయతీబోర్డు వరకు కూడ పోయేది కాదు. ఈ మధ్య తెనాలి బాటా కంపెనీలో పనిచేస్తున్న మన భావనాబుుషిగారి అబ్బాయికి జరిగిన అవమాన మేమిటి? బలమున్న వర్గమువా రతనిని బజారులో కొట్టారు. కాగితములపై కథనంతా జరిపాం. మొదట మనవైపు సాక్ష్యము చెప్పుట కంగీకరించినవారు చివర కెదురు తిరిగారు. ఇంకా గొడవ చేస్తే ఉద్యోగ మూడపెరుకుతా మన్నారు. ఇదే హరిజన బాలుడైతే, కొట్టినవాడి వీపు మీద దెబ్బ పడకుండా వుండేదికాదు.

కేవలము నల్ల ప్రభువుల దయతోనే అయితే, హరిజనుల కిప్పుడున్న స్థాయిని చేరుకొనుట కింకా 23 సంవత్సరాలు పట్టేది. క్రైస్తవ మిషనరిల సహాయ సంపత్తులు వారికి యేదోవిధముగ అందుతున్నవి. వారి త్వరితగతి పురోభివృద్ధికి మిషనరీల చేయూత చెప్పుకోదగ్గది. స్వాతంత్ర్యోద్యమమును,

హరిజనోద్యమమును గాంధీజీ జోడించి నడిపారు. నిమ్న జాతుల సంఖ్యాబలమునకు గాంధీజీ ఆశీర్వాద బలమెంతగానో తోడైనది.

ఇక పోతే, ఇతర వెనుకబడిన తరగతులు (Other Back ward Classes) వారి సంగతి. ఇది రాజ్యాంగములోని పదము. "ఇతర" వెనుకబడిన తరగతులు అనుటలోని, ఈ పదమునుకు, పదములో యిమిడియున్న జనమునకు ప్రాధాన్యత పోయింది. అసలు వెనుకబడిన తరగతులు నిమ్నజాతులే నని తేల్చారు. వారికి కోటా నిర్ణయించారు. ప్రజాస్వామికములో భాగస్వాములగుటకు పద్ధతుల నేర్పరచారు. కేంద్రములో "ఇతర వెనుకబడిన తరగతు" లను మాటకు నిర్వచనము లేదు. సహాయము లేదు. కేంద్ర నాయకులా పదము నప్పుడపు డూతపదముగ ఉచ్చరిస్తూ ఉంటారు. ఆ పదమునకు వారి అంతర్గతమైన భావము, అర్థము నిమ్నజాతులను. పత్రికలవారు యధాతధముగ తెలుగు అనువాదము చేసి "వెనుకబడిన తరగతు" లని అంటే, ఆంధ్రప్రదేశ్‌ప్రభుత్వము ప్రకటించిన వెనుకబడిన తరగతుల జాబితాలోని కులములవారు ఆ విషయములు తమ వేనని అనుకుంటున్నారు. ఈ సంగతిని ఇక్కడ సమావేశమైన పెద్దలు స్పష్టముగా తెలుసుకోవాలి, జనసామాన్యమునేకాక, చదువుకొన్న వారిని సహితము పెడత్రోవను పట్టిస్తున్న ఈ పద ప్రయోగమును పత్రికలవారు కూడ సందర్భమును బట్టి విడమర్చి వ్రాయాలి.

రాష్ట్ర ప్రభుత్వములు మాత్రము వెనుకబడిన తరగతులకు కొంత నిర్వచనము చెప్పి, కొన్ని కులములను కలిపి వెనుకబడిన తరగతుల జాబితాగా ప్రకటించారు. వీరికి కొన్ని సౌకర్యములను కలిగించారు. ఈ కులముల సంఖ్య ఆంధ్రప్రదేశ్‌లో 92 ఈ పుణ్య కార్యమునకు పునాది వేసిన వారు స్వాతంత్ర్య సముపార్జనకు ముందున్న జస్టీసు పార్టీ(Justice Party) వారు. పూర్వపు

అవిభక్త మద్రాసు రాష్ట్రములో Communal G. O.ను ప్రవేశపెట్టి వెనుకబడిన తరగతులవారికి విద్య, ఉద్యోగములలో కొన్ని స్థానములను కేటాయించారు. ఆ పద్ధతిని కాంగ్రెసు ప్రభుత్వములు కొంతకాలము కొనసాగించినై. ఆంధ్రప్రదేశ్ అవతరించిన తరువాత శ్రీ నీలం సంజీవరెడ్డిగారు ఈ G. O, ను రద్దు చేశారు. ఈ వర్గముల కిచ్చిన సౌకర్యలములు నిలచిపోయినై.

వెనుకబడిన వర్గములలో హెచ్చుమంది చేతివృత్తుల (కులవృత్తుల) పైన జీవిస్తున్నారు. ఎవరికి వారినిగ చూచిన మొత్తము జనాభాలో వీరు అల్పసంఖ్యాకులుగ వుంటారు. వీరిలో కొంతమంది వెట్టి చాకిరి, ఊడిగము చేయుట కుపయోగ పడుచున్నారు. విడివిడిగా వీరికి ధనబలము లేదు, జనబలము లేదు, విద్యాబలము లేదు, ఉద్యోగబలము లేదు, అధికారబలము లేదు, వృత్తిని విస్తృతము చేసికొను శాస్త్రీయ పరిజ్ఞానము లేదు, డబ్బును ప్రోగుచేసికొను ధోరణి లేదు, ఎదురు తిరుగు గుణము లేదు, ఉన్నదల్లా, హంగుదారులు బండెడు చాకిరి చేయించుకొని అనుగ్రహించి పికెడు పెడితే తినటం, ఆగ్రహించి తంతే పడటం.

మొదటి వర్గమునకు చెందిన హరిజనులు - గిరిజనులు 100కి 18 మంది వున్నారు. రెండవ వర్గమునకు చెందిన వెనుకబడిన తరగతులవారు 100కి 70 మంది వున్నారు. ఈ 70 మంది 100 కులములుగా, చీలికలుగా వున్నారు. ఈ 100 కులముల వారిని ఇ ఒక త్రాటిపైన నడిపించుట, ఆలోచించిన అసాధ్యముగ కనపడుతుంది - ఆచరణలో కూడ అటులనే వున్నది. అయితే, మరొకమార్గ మేదీ లేదు. ఏవిధముగా నైన వీరందరిని కలిపి కట్టగట్టితే తప్ప - వీరందరు కలసి కట్టగా వుంటే తప్ప వీరందరి సమస్యలు పరిష్కారముకావు. అన్ని రంగములతో పాటు, రాజకీయ రంగములో కూడ వీరు భాగస్వాములు కాకపోతే, వీరిగతి యెన్నటికీ ఆధోగతిగానే వుంటుంది.

ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంఘము స్వతంత్ర భారతముతో పాటు 23 సంవత్సరముల క్రిత మావిర్భవించింది. చేతివృత్తుల రక్షణకు అధికారికముగ సూచనలివ్వగల ప్రణాళికలను తయారు చేయగల వ్యక్తులను నేటికి కూడ తయారు చేయలేక పోయినది. శాసన సభలోనికి ఒక్కరిని కూడ తమ ప్రతినిధిగ పంపించుకొనలేక పోయినది. పది లక్షల సభ్యుల బలముగల రజకుల కొక్క ప్రతినిధి లేడు. అట్లాగే అన్ని వర్గములకు.

నేడు దేశములో "ఇతర వెనుకబడిన తరగతులు" అంటే అసలైన అల్పసంఖ్యాక వర్గములు, ఆకలితో అవమానముతో క్రుంగి కూలారుతున్న కులములు, ఆలనా పాలనా లేని జనాలు.

హరిజనోద్యమమునకు గాంధీజీవలె బలహీన వర్గముల నన్నిటిని కలిపి నడిపించు ఉద్యమమునకు డా॥ రాంమనోహరలోహియా పునాది వేశారు. దీనినీ ప్రాంతములో సామ్యవాదోద్యమ సారధిగా వున్న శ్రీ నన్నపనేని వెంకట్రావుగారు కొనసాగించగలరని ఆశిస్తున్నాను.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వెనుకబడిన తరగతులుగ ప్రకటించిన 92 వర్గములలో ప్రభుత్వ మిచ్చు సౌకర్యములను అభివృద్ధి చేసికొని ఆచరణలో ప్రయోజనమును కొంతకు కొంతైనా పొందగలిగినవారు చేనేతవా రొక్కరేనని చెప్పాలి. ఆ పటుత్వము, ప్రభావము వారి నాయకత్వములో వున్నది. చేనేత నేత శ్రీ ప్రగడ కోటయ్యగారి జీవితమును, నిర్మాణ కార్యక్రమమును వర్గసంఘముల నాయకులు, కార్యకర్తలు మార్గదర్శకముగ స్వీకరించాలి. ఎక్కడయిన ఒకరు గౌడ సంఘీయులు రాజకీయ రంగములో ముందునకు వచ్చినట్లు కనుపిస్తారు. మిగతా 90 వర్గముల వారికి ప్రాతినిధ్యము లేదు. ప్రాతినిధ్యమున్నవారె తమ సమస్యలు పరిష్కారము కాక పట్లు పట్టుకుంటూవుంటే, లేని వారి సంగతి యెవరాలోచిస్తారు? ప్రభుత్వము చేసిన

చట్టములను, జారీచేసిన ఉత్తర్వులను, అర్థము చేసికొను స్థితిలో వెనుకబడిన తరగతులులేవు. చేనేతవారిని మినహాయిస్తే, మిగతా వర్గములవారు సహకార రంగముతో తగిన సంబంధము పెట్టుకొనలేదు. ఒకటి రెండుచోట్ల మిగతా వర్గములవారు సహకార రంగముతో సంబంధములు పెట్టుకున్నారు కాని, విజయవంముగ నిర్వహించలేకపోయారు. ప్రభుత్వ ధనసహాయము సహకారశాఖద్వారా 90 వర్గములుగ నున్న అశేష జనానికి జరగలేదు. సహకార రంగము నుపయోగించుకొను పరిజ్ఞానము, కార్యదక్షత వీరికి లేదు. వెనుకబడిన తరగతులవారికి సుశిక్షతమైన నాయకత్వము కావాలి - రావాలి.

వెనుకబడిన తరగతులలో చాలమంది కళాకారులున్నారు. సంగీతము, చిత్రలేఖనము, నృత్యము, శిల్పము వంటి లలిత కళలలో నిష్ణాతులైనవా రున్నారు. బుట్టలల్లుట, బట్టలు నేయుట, మృణ్మయ పాత్రలు, బొమ్మలు చేయుటలో ఆరితేరినవా రున్నారు. బంగారము, వెండి ఇత్తడి, రాగి, ఇనుము, కొయ్య, ఊయి వంటి జడపదార్థములను మలచి, నగిషీలు దిద్ది, సజీవములుగ, శాశ్వతములుగ చేయు వృత్తికళలలో సిద్ధహస్తులున్నారు. సర్వకాలములకు పనికివచ్చు కండగల సాహిత్యమును సృష్టించగల కవులు కూడ కొద్ది సంఖ్యలో వున్నారు. ఈ కళలకు గౌరవమున్నా, కళాకారులకు గౌరవము లేదు. పోషణ లేదు. గుడిలోని శిల్పమును తరతరాలుగా పూజిస్తాం. ఆ శిల్పమును సృష్టించిన అపర బ్రహ్మను గురించి క్షణముకూడ ఆలోచించము. అతని పేరు గుడిలో యే మూల చూచినా కనుపించదు. జనములో వినిపించదు. అందముగ, ఆరోగ్యముగ వుండుట కనుదినము ధౌత వస్త్రములు ధరిస్తాం. వాటిని మల్లెపువ్వులువలె తెల్లగ తెల్లగ తయారుచేయుట కవసరమగు నీటి సౌకర్యమును కలిగించమని రజకవృత్తిదారులు చెవి నిల్లుగట్టుకొని రొద చేస్తూ వుంటే, చెవుల్లో సీసం కరిగించుకొని పోసుకుంటాం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మిటీవల అనంతరామన్ కమిటీ ద్వార సేకరించిన లెక్కల ప్రకారము ఇతర వెనుకబడిన తరగతులు ఒకటిన్నర కోట్లు. అనగా, ఆంధ్ర ప్రదేశ్ మొత్తము జనాభాలో సగమున్నారు. వాస్తవమున కింకా హెచ్చుమంది ఉంటారు. ముందుపడిన తరగతులవారు, నిమ్నజాతులవారు కలసి సగమునకు తక్కువగా వుంటారు. సగమునకు తక్కువగా నున్న వారిది మొత్తము పెత్తనము. సగమునకు పైగా వున్న జనాభా బాగోగులను గురించి, ప్రాతినిధ్యమును గురించి ఏమి ఆలోచించినట్లు? కేవలము గాలిలో వదలిపెట్టారు. సగమునకు పైచిలుకుగా నున్న జనం బాగుపడకపోతే, బాధపడుతూవుంటే, సోషలిజ మెలా వస్తుంది? వీరందరిని కలుపుటయే సమస్య. కలిపితే సోషలిజము తనంతట తానే వస్తుంది.

వీరందరిని ఒక్క త్రాటిపైన నడుపుటకు, వారి వారి సమస్యలను కూలంకషముగ చర్చించి, విషయములను నిగ్గుదేల్చి ప్రచారము చేయుటకు ఒక "కేంద్రము" లేదా "పీఠము" అవసరమని భావించబడినది. దానినే "వెనుకబడిన తరగతుల వేదిక" పేరుతో తెనాలిలో ఈ రోజున స్థాపించుకుంటున్నాం.

సూత్రప్రాయముగ వెనుకబడిన తరగతుల వేదిక ఆశయములు - కార్యక్రమములు ఇట్లా వుంటై.

(1) వెనుకబడిన తరగతులకు చెందిన వారి సమస్యలపై అనుభవమున్న వారిని పిలిపించి ప్రసంగముల నిప్పించుట. ఆ యా సమస్యలను కూలంకషముగ చర్చించి, వాటి పరిష్కారమునకు తగిన సూచనలు, ప్రణాళికలు తయారు చేయుట.

(2) వెనుకబడిన తరగతులకు సంబంధించిన వివిధ ప్రభుత్వ ఉత్తర్వు

(G. O.) లను కోర్టు తప్పులను సేకరించుట, లోతుపాతులను చర్చించుట, లోపములున్న సవరణలు ప్రతిపాదించుట. ఉన్న జి.వో.ల అమలుకు, లేని వాని తయారుకు కృషి చుయుట.

(3) వెనుకబడిన తరగతులకు చెందిన కళాకారులను సన్మానముల రూపములో గౌరవించుట. తన కళానైపుణ్యము ద్వారా ఈ ఉద్యమమును బలపరుచు యేవర్గమునుకు చెందిన కళాకారుని కైనను ఈ వేదికపై గౌరవ సమ్మానములు గావించబడును. ఉద్యమమున కుపయోగపడు సారస్వత సృష్టికి ప్రత్యేక కృషి సల్పుట.

(4) వర్గసంఘములకు తోచిన సలహాల నిచ్చుట. వారి ప్రత్యేక కార్యక్రమములకు దోహద మిచ్చుట.

(5) విద్యార్థులకు, విద్యాధికులకు, ఉద్యోగులకు ఈ ఉద్యమ స్వరూప స్వభావములను నచ్చజెప్పి, ఈ ఉద్యమము వారి సహకారమును పొందునట్లు చూచుట.

(6) వివిధ వర్గముల, స్థాయిల వ్యక్తుల మధ్య పరిచయముల కలిగించిభావ సమైక్యతను సాధించుట.

(7) కుల నిర్మూలనకు దగ్గర మార్గముగ వున్న కులాంతర, మతాంతర వివాహములను ప్రోత్సహించుట. అట్లా ముందుకు వచ్చిన వ్యక్తులను ఈ వేదికపై గౌరవించుట.

(8) ఏ యొక్క వృత్తియైన, వర్గమైన మెరుగుపడుటకు కార్యకర్తలు కార్యోన్ముఖులైనవారి కీ వేదిక నిర్వాహకులు వ్రాతకోతలలోను, సలహా సంప్రతింపులలోను అండగా వుండుట.

(9) విషయమును, కాలమును నియమబద్ధము చేసి ప్రసంగముల నిప్పించుట ద్వార, విషయములను క్షుణ్ణముగ చదివి, అర్థము చేసికొని మాట్లాడు, వ్రాయు వ్యక్తులను తయారు చేయుట.

(10) ప్రముఖ ప్రచార సాధనములైన పత్రికలు, రేడియో, సినిమాలు, నాటకములు ఈ ఉద్యమమున కుపయోగపడునట్లు చూచుట.

ప్రస్తుతమున కీ వేదిక వెనుకబడిన తరగతుల ఉద్యమ సర్వతోముఖ వికాసమున కవసరమైన విషయములను చర్చిస్తుంది. ప్రజలనుండి తగిన గుర్తింపు, ప్రోత్సాహము, స్థాయి వచ్చినపుడు నిర్మాణ కార్యక్రమము ను చేబడుతుంది. దానికి తగిన వ్యక్తుల సమీకరణమే యీ కృషి.

వేదిక పైరునుగురించి, నిమ్నజాతులు, అల్పసంఖ్యాక వర్గములు మొదలగు బలహీన వర్గముల నన్నిటిని కలుపుకొని వ్యవహరించుటను గురించి వచ్చు సూచనల నాలోచించుట కెప్పుడూ అవకాశ ముండును.

నిర్వాహకవర్గము, వేదిక పరిధి పరిమితముగ నున్నప్పుడే కార్యక్రమములు తక్కువ అభ్యంతరములు, అడ్డంకులతో విరివిగ, విస్తృతముగ జరగగలవని నా వ్యక్తిగత భావము

# సమ సమాజ నిర్మాణము

# కవుల పాత్ర

## అత్తోట రత్నకవి షష్ఠిపూర్తి సన్మాన సభ

ది 8-11-1970 ఆదివారం తెనాలి

సభాధ్యక్షులు, మద్దిపాడు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ గద్దె వీర రాఘవయ్య గారికి, స్థానిక వి. యస్.ఆర్. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి ఏంజిలా సాల్మన్ రాజు, అభ్యుదయ చలన చిత్ర రచయిత శ్రీ మోదుకూరి జాన్సన్ గార్లకు, రసజ్ఞులైన సభాసదులకు నా నమోవాకములు.

ఇది అత్తోట రత్నం భాగవత్కవి షష్ఠిపూర్తి సమ్మాన వేదిక. విద్యావేత్తలు, కవి శేఖరులు, పండిత శ్రేష్ఠులు, గాయక శిఖామణులు, నటకావతంసులు, సంఘ సంస్కర్తలు ఆసీనులై నిండు పేరోలగము. ఇల్లు చూచిన చాలు ఇల్లాలిగుణ మవగత మవుతుంది. సమ్మానితుని గుణగణములకు, శక్తిసామర్థ్యములకు సభ నలంకరించిన బహుముఖ ప్రజ్ఞాశాలురే సాక్ష్యము - ప్రతిబింబము.

మనము కళల (Arts) నరువది నాల్గుగ విభజించాం. అందులో కవిత్వము, సంగీతము, నాట్యము, శిల్పము, చిత్రలేఖనము అను నైదింటిని లలితకళల (Fine Arts)గ పేర్కొన్నాం.

తనకు తా నలరి, ఇతరుల నలరింపజేయు మహాశక్తి ఈ లలితకళల కున్నది. ఏ దేశపు ఔన్నత్యము నయిన చెప్పుట కాదేశపు లలితకళలు స్థాయిని కొలమానముగ తీసుకుంటారు. కాళిదాసు కవిత్వము, త్యాగరాజు సంగీతము,

కూచిపూడి నాట్యము, అమరావతి శిల్పములు, అజంతా - ఎల్లోరా చిత్రములు భారతదేశమున కంతర్జాతీయ కీర్తిని ఆర్జించిపెట్టినై.

ఇందులో ఏ ఒక్క కళను సాధింపవలెనన్నా, తదేకమైన నిరంతర కృషిని సాగించాలి. అందుకు కాలం (Time) పడుతుంది. ఈ కృషిలో మునిగి తేలు మనిషి మరొక పనికి ఉద్యమింపలేడు. ఆర్థికతను మార్చుకొను అవకాశముండదు, సహజముగ కళాకారులకు -

సభాగౌరవములు నిండు - దిన పస్తులు మెండు

సరస్వతీ ప్రసన్నము మిన్న - లక్ష్మీ ప్రసన్నము సున్న

బయట పల్లకీలమోత - ఇంట్లో ఈగల మ్రోత.

అసలు పేదవారికే ఈ కళలబ్బుతాయో, లేక ఈ కళ లబ్బినవారు పేద వారవుతారోగాని, మొత్తము మీద ఈ కళాకారులందరు పేద వారుగానే కనపడుచున్నారు. మన దేశములో చిరకాలముగ నున్న స్థితియిది.

మానసికోల్లాసమునకు, వికాసమునకు అత్యవసరమైన లలితకళలు వర్ధిల్లవలెనన్న కళోపాసకులు పోషింపబడాలి. ఈ కళాకారుల నెవరు పోషించాలి?

రాచరికములున్న రోజులలో కృష్ణదేవరాయలు, రాజరాజనరేంద్రుడు వంటి రసపిపాసులైన రాజులు కొందరు కళాకారులను పోషించారు - పూజించారు. కావ్యములలో తాము తమ ఘనత అభినుతింప బడవలెనను స్వార్థమీ "పోషించుట"లో కొంత ఇమిడియున్నది. కళలు నిలుచుట, కళాకారుడు మనుటయను పరార్థము కూడ ఈ "పోషించుట"లో వున్నది. కనుక ఇబ్బందిలేదు.

ఇవి ప్రజాస్వామిక దినములు. ప్రజలే స్వాములు. అనగా ప్రభువులు.

అందుచేత కళాకారులను నేడు ప్రజలే ఆదరించాలి. ఆదరించటమంటే, పనిపట్టుకొని అతని దగ్గరకు వెళ్ళి ఇంత డబ్బు ఇచ్చి రావటముకాదు. ఒకరిద్దరు డబ్బిచ్చి నందువలన కళాకారునకు శాశ్వత ప్రయోజనముండదు. మరి చేయవలసిన దేమిటి? అనునది ప్రశ్న.

కళాకారుని పేరు విన్నవారు, ప్రతిభ తెలిసిన వారు, కళల వలన అనుభూతిని పొందగోరువారు, ఆయా కవుల పుస్తకములను అచ్చొత్తించుట, స్వయముగ కొని చదువుట, నాటకములను చూచుట, చిత్రములను గీయించుకొనుట, శిల్పములను చేయించుకొనుట చాలు - కళాకారుడు పోషింపబడతాడు; ఇటువంటి సన్మానములు చేసిన చాలు - కళోపాసకుడు ఉత్తేజితుడవుతాడు. ఏకవి సన్మానమున కయిన పదిరూపాయలు చందాయిచ్చుటకన్న, ఆకవి పుస్తకములు పది కొని చదువుట శ్రేష్ఠము. ఇలా చేసిన, కళ ఉభయ తారకముగ ఉపయోగపడి, ద్విగుణీకృతముగ భాసించగలదు.

లలిత కళలో ఒక దానిని ఉపాసన చేసి, స్వాధీనము చేసుకోవాలంటేనే మహా ప్రళయము. మఱి రత్నంగారు నే నెరిగినంత వరకు మూడింటిని సాధించారు. ఆయన మొదట భాగవతారు - సత్కథాగానము చేసెడివారు. వారు కథలు చెప్పుతీరు ప్రజల నాకర్షించింది. ప్రేక్షకులను మైమరపించింది. దీనికి హావభావ వ్యక్తీకరణ కవసరమైన నటనా వైదుష్యము, శ్రావ్యమైన గాత్రము, సంగీతశాస్త్ర పరిజ్ఞానము వుండాలి. అవి రత్నకవిగారికి పెట్టని సొమ్ములు. తరువాత వీరు కవిత వ్రాయుట ప్రారంభించారు. అనతి కాలములోనే కవిత్వములో సిద్ధహస్తుడనిపించు కున్నారు. ఇప్పుడుసాహిత్య ప్రక్రియలలో చరమస్థాయియని చెప్పబడుచున్న దృశ్యకావ్యము "రారాజురాక"ను వ్రాశారు. వీటివలన సాహిత్య, సంగీత, నాట్యరంగములలో రాణింపుకు రత్నంగారు చేసిన కృషి పరిధిని, పడిన ఇబ్బందుల పరిమాణమును మనమూహించుకొనవచ్చును.

తాను స్వయముగ "స్వప్నవాహిని"లో నుడివినట్లు - రత్నం భాగవత్కవి. వందల కొలది సభాపీఠములపైన ప్రార్థనా గీతములు పాడారు. వేవేల సత్సభావేదికల నిల్చి చెలువమొప్ప ఉపన్యసించారు. అగణితంబైన సభాంతరమ్ముల కథలు వినిపించి బుధుల మెప్పించినారు. స్వాతంత్ర్య మననేమొ చాలుమూలెరుగని జనములకు బోధ సలిపినారు. ఈ విధముగ వారు కూలిజనములకును, కర్షకులకును గూడ చేతనైనంత సేవ చేసినారు. అందులకీ ప్రాంత ప్రజలు రత్నముగారి కెంతయు ఋణపడి యున్నారు.

"విశేషము లేని మానవుని పొగడుట పనికిమాలినపని. అటులనే పుణ్యశీలుర ప్రస్తుతించుటకు వెనుకాడుట రోతపని" అంటారు. రత్నంగారికి, నాకును గురుతుల్యులైన "కవిరాజు" కొండవీటి వేంకటకవిగారు. ఇందుకు నిదర్శనముగానే రత్నకవి, పంచాయతీ సర్పంచిగా వుండి ఎడ్లపల్లి గ్రామాభివృద్ధికి పాటుబడిన పెద్దమనిషి అలపర్తి నాగభూషణం చరిత్ర, పంచాయతీ సర్పంచిగానే వుండి వల్లభరావుపాలెం గ్రామమును తీర్చిదిద్దిన వేజెండ్ల బాపయ్య చరిత్ర వ్రాశారు, బైబులు గ్రంథస్థమైన అబ్రహాము, జీసస్ వంటి పుణ్యపురుషుల చరిత్రలు కూడ రత్నంగారి కలము నుండి వెలారినవి.

అన్నింటికి మించి రత్నకవిగారి నవ్య భావనాశక్తికి ప్రతీకగ పది కాలముల పాటు నిలువగలిగినది "స్వప్న వాహిని" పద్య కావ్యము. ఇది ఎసకలిగిన పుస్తకము. మానవుని అభివృద్ధికి అన్ని విధముల అడ్డంకుగ వున్న కుటిల కుల, మత సిద్ధాంతముల కిది కత్తిపోటు, కవిగారి మాటలలో -

"వింతల, కార్భటమ్ములకు, వెట్టితనాలకు, వర్ణభేద సిద్ధాంత కుల ప్రతిష్ఠలకుదావల మాంధ్రధరాతలమ్ము."

ఆంధ్రదేశములో తాండవిస్తూ వికటాట్టహాసము చేయుచున్న అమానుషము నెంత స్పష్టముగా చెప్పారు !

“తెలివిగలట్టి మూర్ఖులు, సుధీబలశాలుర మంచు నిక్కుచున్ కొలువులనంది చీల్చి చెడగొట్టిరి మానవసంఘమున్ కటా !”

పై వర్గములవారి కుతంత్రముల నెంత సూటిగ చెప్పారు !

ఇప్పటి కాలమునకు పనికిరాని పాత ధర్మశాస్త్రముల పాతకపు, కిరాతకపు వ్రాతల నెటుల విమర్శించిరో పరిశీలించండి.

“ఆర్యు డాచరింపనగు శిక్ష వేరొక్క
డాచరింప శిక్ష అధిక మగును;
ఎచ్చులొచ్చు చట్ట మిచ్చకొలందిగా
వ్రాసినారు కొంప దీసినారు.”

ఎక్కువ కులమువాడు తనకన్న తక్కువకులమువానిని చంపినచో శిక్ష రాష్ట్ర బహిష్కారము.

తక్కువ కులమువాడు తనకన్న యెక్కువ కులమువానిని చంపినచో శిక్ష శిరచ్ఛేదము.

ఆర్యుడు వ్యభిచరించినచో శిక్ష 500 ఫణములు.

క్షత్రియుడు వ్యభిచరించినచో శిక్ష 100 ఫణములు, గార్ధభ మూత్రముతో స్నానము, శిరోఖండనము.

ఆ వ్యభిచారమునె శూద్రు డొనర్చిన శిక్ష మర్మాంగ ఖండనము .

అనగా, శిక్షా నిర్ణయము అపరాధమునుబట్టి జరిగెడిది. ఇంతకన్న ఘోరకలి, దురాగతము వేరొకటి యున్నదా?

ఈ నీచమైన హేయమైన కులతత్వము సమూలముగ నిర్మూలింపబడవలెను. ధనవంతుల దమ్మిడీలు పేద ప్రజలకు ముఖ్యముగ స్వేచ్ఛాపిపాసులైన కవులకు మత్తుమందుగ పని చేయకూడదు. అందుకు రత్నకవిగారు -

"కవుల కలములు ధనికుల కాళ్ళువదలి

కష్టజీవుల డొక్కల గాంచెనేని

స్వర్గ మీ నేలపై సృష్టిసలిపి మీకు

మానమర్యాద లొసంగి మనుపగలవు" అంటారు.

ఎన్నో పురాణాంతర్గత మర్మములను మనము ఛేదింప వలసి యున్నది. కల్ల బొల్లి కథలనుండి వాస్తవముల వైపుకు మానవుల మనస్సులను, ఆలోచనలను మరల్చవలసి యున్నది.

సత్యమునకు ప్రతీకయైన హరిశ్చంద్రుని అన్ని ఇడుమలు గుడి పింపవలసిన అవసరమేమిటి?

ధర్మమునకు ప్రతి రూపమైన బలిచక్రవర్తిని భూస్థాపితము చేయవలసిన స్థితి యేమిటి?

త్యాగమునకు మూర్తిగ్ర నిలిచిన శిబిచక్రవర్తి శరీరమును కోయించవలసిన అగత్య మేమిటి?

శీలమునకు నిలయమైన  ఏకలవ్యుని విద్య నేర్పకయే బొటన వ్రేలు నఱికించుట దేనికి?

ఇటువంటి దుష్కృత్యములను చాటునవి అనేక మున్నవి. వాటిని వింటుంటే సత్యము, ధర్మము, త్యాగము, శీలము, గురుభక్తి అనునవి భయంకరమైనవిగను, మానవులమైన మన మాచరించుటకు వీలుగాని గుణములగను, ఆచరించు వారిని ప్రమాదములకు గురిచేసి ఆహుతిగొనువానిగను గోచరించుట లేదా?

ఈ పరముగ తొలుత "కవిరాజు" త్రిపురనేని రామస్వామి, కీర్తిశేషులు ఆవుల గోపాలకృష్ణమూర్తిగార్లు కొంత కృషి చేసిరి. ఆ దృక్పథమును కొండవీటి వేంకటకవి, అత్తోట రత్నకవి వంటివారు అందుకొని అలవర్చుకొన్నారు.

సాహిత్యరంగమున విశేషమైన మార్పు రావాలి. మంచి గుణములు, మానవ విలువలు గల వ్యక్తులకు మేలు చేకూరు సన్నివేశములతో, వాస్తవికతను దృష్టిలో పెట్టుకొని కథలు, నాటకములు వ్రాయబడాలి.

మృదు మధురమైన రత్నకవి గొంతుకను ఆవుల గోపాలకృష్ణమూర్తిగారు టేపురికార్డుద్వార అమెరికావరకు మోసికొనిపోయి, అక్కడి ప్రజలకు తెలుగు నుడికారపు ఇంపుసొంపులను వినిపించారు. ఆ విషయమును ఆవులవారు తన "ఆమెరికా పర్యటన" గ్రంథములో తెలియజేశారు. ఇది ఆవుల వారికి చితికిన కులములపైన, చిన్న మనుషులపైన ప్రత్యేకముగ రత్నంగారిపైన గల అవ్యాజాను రాగమును తెలియజేయు చున్నది.

పై కులములవారు క్రింది కులముల వారిని పీక్కుతింటున్నారని పుస్తకములలోను, ఇంటి తలుపులు బిగించి నాలుగు గోడలమధ్యను విలపించిన సరిపోదు - ప్రయోజన ముండదు. ఇటీవల భారతీయులవి బండబారిన గుండెలైనవి - మొద్దుబారిన మనసులైనవి. Gass Stove తో కాల్చితే తప్ప

అవి కరిగే స్థితిలో లేవు. కీలెఱిగి వాతపెట్టాలి.

నిచ్చెనమెట్ల సంఘముగనున్న మనవ్యవస్థను, ఆర్థిక అంతస్థులు, రాజకీయ అసమానతలు, సాంఘిక వికారములు లేని సర్వసమాన స్థాయిగల సంఘముగ రూపొందించవలెనని మనమంటున్నాం. ఈ లక్ష్యమును ఊహామాత్రముగానే ఉంచుకుందామా? ఆచరణలోనికి ఆయత్తము చేసికొందామా? ఆచరణలోనికి మలచవలెనన్న మన మేమి చేయాలి? ఇది ఆలోచనాపరుల బుఱ్ఱలను బ్రద్దలుచేస్తున్న తెగని సమస్యఅయింది. ఇందుకు నా ఊహకందుతున్న మార్గములివి -

(1) సత్తువ లేదనుకుంటున్న క్రింది మెట్టులోని వారిని అక్కడనే వుంచి, పై మెట్టులోని వారిని క్రిందికి లాగుట;- దేశాభివృద్ధి దృష్ట్యా ఇది అభిలషణీయముకాదు.

(2) పిక్కబలము కలిగిన పై మెట్టులోని వారిని ఉన్న స్థానములోనే వుంచి, ఇంకా పైకిపోకుండసీలలుకొట్టి క్రింది మెట్టులోవారిని మెల్లగా పైకి యెక్కించుట; - ఇందుకు కాలహరణము జరుగుతుంది. అందుచేత ఇదికూడ అంగీకార యోగ్యముకాదు.

(3) పై మెట్టులోని వారిని సగము మెట్లు క్రిందకుదింపి, క్రింది మెట్టులోని వారిని సగముమెట్టుపైకి యెక్కించుట; -

ఈ పద్ధతి అనతికాలమున సమసమాజ నిర్మాణము సాగించుట కనుకూలముగ నున్నది.

ఈ మార్పుకు సమాజము సిద్ధపడాలి. సిద్ధపడకపోతే, క్రిందిస్థానములో వున్న దళిత వర్గములు (Depressed Classes), బలహీన వర్గములు

(Weaker Sections), వెనుకబడిన తరగతులు (Backward Classes), అల్పసంఖ్యాక వర్గములు అనబడువారు (Minorities) తమ సమైక్యతా బలమును ప్రదర్శించి సమాజమును సరియైనగాడిలో నడిపించాలి.

ఈ సంక్షోభము తగ్గవలెనన్నా, అగాధము పూడవలె నన్నా అనుసరించవలసినవి రెండే రెండు మార్గములు -

(1) కులము కులతత్వము పోవాలి. మతము మతతత్వము మారాలి. ఇవి మటుమాయ మగుటకు కులాంతర, మతాంతర వివాహములే శరణ్యము. ప్రజలు, ప్రభుత్వము వర్ణాంతర వివాహములను ప్రోత్సహించాలి. పేరు చివర రెడ్డి, చౌదరి, శాస్త్రి, లింగము, యాదవ, గౌడ వంటి కుల సంకేతముల వాడకమును అసహ్యించుకోవాలి - చట్టరీత్యా నిషేధించాలి.

(2) అధికారములోనికి క్రింది కులముల వారు సమధికముగ రావాలి. ఇందుకు వీరు తమ వోట్లను తాము వినియోగించుకుంటేచాలు విసము కూలికి త్రాగెడు వెట్టివారివలె ధనమునకు వోటును బలియిచ్చుట మానాలి.

వర్ణాంతర వివాహములు చేసికొనుటకు, చిన్నకులములుగ పరిగణింపబడుచున్న వారధికారములోనికి వచ్చుటకు అనువుగ సాహిత్యము, ముఖ్యముగ దృశ్యసంబంధమైన నాటకములు, సినిమాలు సృష్టించబడాలి. ముసుగులో గుద్దులాట, తెరవెనుక భాగవతము, లాలూచీతనపు రచనలు చేయుట మానుకోవాలి. స్పష్టమైన వ్రాతలు బయటకు రావాలి. దీనికి తమిళనాడులో ద్రవిడమున్నేట్రకజగము (D.M.K) నాందీ గీతము పాడింది. సాహిత్య సంగీత రంగములలో అనుభవమున్న రత్నం భాగవత్కవి వంటివారు ఆ పాటను లయతప్పకుండ వినిపించి మనల నుత్తేజితులను చేయుట సులభము. ఈ D.M.K అనుమాటకు "దళితవర్గముల ముందడుగు

కూటమి.'' అనియొక సందర్భమున రత్నకవి అన్వయముచెప్పి, D.M.K విధానము మన కనుసరణీయమని తన అభిమతమును వ్యక్తపరచారు. ఇది చక్కటి ఊహ. ఆమార్గమున రత్నకవి కృషి చేసి మనలను వేధించుచున్న సర్వసమస్యల పరిష్కారమునకు బాధ్యత తీసికొనగలరని ఆశిస్తున్నాను.

మరొక బాధ్యతనుకూడ రత్నకవి తీసికొనిన బాగుండునని, అతి అవసరమని నాసముత్కంఠ.

పుణ్యము - పాపము, స్వర్గము - నరకము, దేవుడు - దయ్యము, మాయలు - పునర్జన్మ, సమాజమున కుపకారము చేయునవి - అపకారము చేయునవి, నమ్మతగినవి - నమ్మతగనివి ఆదిగాగల విశేషములు హిందూమతములోవలెనే, క్రైస్తవ మతములో కూడ వున్నవి.

"స్వప్న వాహిని'' హిందూమతములోని మూఢవిశ్వాసములపైన దాడి. క్రైస్తవ మతములోని అవాఛనీయ విషయములపైన కూడ "కలలో ఏసు'' శీర్షిక క్రింద ఒక సవిమర్శ వ్రాసి స్వప్నవాహినిలో భాగముగ చేర్చాలి. అటులనే "కలలో మహమ్మదు''ను కూడ చేర్చిన మంచిది.

మరొక సంగతి స్వప్నవాహిని బ్రాహ్మణ కులము పైన కత్తిగట్టినది. ఈ ఉద్యమము నప్పటి పరిస్థితులను బట్టి యం. యన్.రాయ్. రామస్వామి నాయకర్, త్రిపురనేని రామస్వామివంటి వారు ప్రారంభించారు, పెంచారు. చాల వరకు కృతకృత్యులయ్యారు. బ్రాహ్మణుల ప్రాబల్యము తగ్గింది.

ఇప్పుడు మన ప్రాంతములలో మన మేమి చూస్తున్నాము? యేమి అనుభవిస్తున్నాము? బ్రాహ్మణుల తరువాతగా వున్న ఒకటి రెండు కులముల ప్రాబల్యము, ఆధిక్యత, అధికార జులుము వగైరా విహారము చేస్తున్నవి. ఇవి ఏ యొక్క వ్యక్తిని, గ్రామమును దృష్టిలో పెట్టుకొని అంటున్న మాటలు కావు.

రాష్ట్ర వ్యాప్తముగ నున్న స్థితిని, లెక్కలను ఆకళింపు చేసికొని. ఆధారము చేసికొని అంటున్న మాటలు. వీటిని తగ్గించుటకు తగిన యోచనలు, సూచనలు, రచనలు చేయాలి.

షష్ఠిపూర్తి సమ్మాన వేదిక నలంకరించిన, కనకాభిషేక సింహాసనము నధిష్ఠించిన అత్తోట రత్నం భాగవత్కవి పూర్ణాయుషుతో, ఆరోగ్యముతో, కీర్తికాంతతో, శాంత (వారి అర్ధింగి)తో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నాను.

విశ్వ సమ్మాన సమ్మాన వేదిమీద
కూరుచుండిన “అత్తోట” వారి పైన
కురియు గావుత సుమదళ కుంభవృష్టి
దివ్యగుణ సుమవల్లి మా తెలుగుతల్లి

నాకీ అవకాశము లిచ్చిన సమ్మాన సంఘమువారికి కృతజ్ఞతలు.

జై జనత.

# బలహీన వర్గముల సమైక్యత

# భాతదేశ పురోగతి

## వెనుకబడిన తరగతుల వేదిక ప్రథమ వార్షిక సభ

ది.7-11-1972 ఆదివారం తెనాలి

సభాధక్ష్యులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక శాఖా మాత్యులు శ్రీ అనగాని భగవంతరావుగారికి, ప్రారంభకులు, ఆంధ్రప్రదేశ్ శాసనసభాసభ్యులు శ్రీ తులిబందుల నాగేశ్వరరావుగారికి, సామ్యవాదోద్యమ సారధి శ్రీ నన్నపనేని వెంట్రావుగారికి, మాజీ జిల్లా విద్యాశాఖాది శ్రీ పులివర్తి శరభాచారిగారికి, వేదిక అధ్యక్షులు, న్యాయవాది శ్రీ కొండారంగారావు గారికి, బహు ప్రాంతములనుండి విచ్చేసిన వేలాది సభాసదులకు నా స్వాగత సుమాంజిలి.

వెనుకబడిన తరగతుల వేదికకు సంవత్సరకాలము కార్యదర్శిగా పనిచేసిన నేను, తద్వేదిక ప్రథమ వార్షికోత్సవ సభకు ఒక నివేదికను సమర్పించుట ఆచారముగ, అవసరముగ భావించి మీ ముందు నిలుచున్నాను. ఉన్న వ్యవధినమసరించి బహు క్లుప్తముగ మనవి చేయు విషయములను శ్రద్ధగా వినవలసినదిగ కోరుచున్నాను.

## వేదిక నిర్మాణము

వెనుకబడిన తరగతుల ప్రజలు (people of other Back ward Classes) ప్రస్తుతము చాల జటిలమైన, భయంకరమైన, విషమ పరిస్థితితులలో నున్నారు. మొత్తము జనసంఖ్యలో సగమునకుపైగావున్న వీరి బాగును గురించి, ప్రాతి నిధ్యమును గురించి ఆలోచనలులేవు, చెప్పుకోదగిన కార్యక్రమములులేవు.

వీరికి యేది చేయవలెనన్నా రాజ్యాంగము అడ్డమువస్తున్నదని న్యాయస్థానములు తీర్పులు చెబుతున్నవి. రాజ్యాంగములో వీరికి రక్షణలేదు. వీరికి కొంతకాలము ప్రత్యేకరక్షణలు అవసరమని అధిక సంఖ్యాకులైన ప్రజలు భావించినపుడు, తరనుకూలముగ రాజ్యాంగము సవరించబడాలి. అది జరుగనినాడు సామ్యవాద నినాదము మేడి పండు సంస్కారమునకు నిదర్శనముగనే నిలిచివుంటుంది. ఒక ఆంగ్లమేధావి నుడివినట్లు "అందరిని అంతకాలము మోసగించ లేము. కొందరిని కొంతకాలమువరకే మోసగించగలము."

వృత్తిరీత్యా, కులరీత్యా, మతరీత్యా. వాడివడియున్న బలహీన వర్గములన్నిటినీ సమైక్యపరచాలి. భారతదేశ పురోగతికిది వినామార్గము లేదు. ఇక్కడ "అన్నిటినీ" అను పదములో హరిజనులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, ముస్లిములు, మొదలగు అల్పసంఖ్యాక వర్గముల వారంతా వున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో అరవైసంవత్సరములుగ వృత్తి, లేదా వర్గసంఘములు విడివిడిగా పనిచేయుచున్నవి. ఎవరికి వారు మొత్తము జనాభాలో అల్పసంఖ్యాకులగుట వలన కార్యసిద్ధికి బలము చాలలేదు. అందరు కలసి ఏకరాశి సంఘముగ యేర్పడి 23 సంవత్సరములైనది. అయినను తగిన బలమును పుంజుకొనలేదు. వీరిలో చెదురు మదురుగనున్న ధనవంతులు, వ్యాపారస్తులు, విద్యావంతులు, న్యాయవాదులు, డాక్టర్లు, ఉద్యోగులు, కవులు, గాయకులు, టెక్నీషియన్లు, ఉద్యమాభిమానులీ ఉద్యమ పరివ్యాప్తికి చేయూతనివ్వాలి. ముఖ్యముగ విద్యార్థులు పూనికతో పనిచేయాలి. వీరందరిని కలిపి నడుపుటకు, వారివారి సమస్యలను చర్చించి ప్రచారము చేయుటకొక "పీఠము" అవసరమని భావించారు. ఆ నా భావనకు "వెనుబడిన తరగతుల వేదిక, తెనాలి" (The Back ward Classes Forum, Tenali)పేరుతో 1970 నవంబరు 1వ తేదీన తెనాలిలో రూపకల్పన జరిగింది.

**నివేదిక ఆశయములు :**

(52 - 54 పేజీలలో చూడము)

**జరిగిన కార్యక్రమములు :**

1. గత సంవత్సరము నాలుగు సమావేశములు జరిగినవి. ఈ క్రింది ప్రముఖులు పాల్గొని తమకు ముందుగ నిర్ణయింపబడిన విషయమును, కాలమును నియమబద్ధముచేసి ప్రసంగించిరి.

   1. శ్రీ నన్నపనేని వెంట్రావుగారు. - కాంగ్రెస్ సోషలిస్టు ఫోరంనాయకులు.
   2. శ్రీ దేవరపల్లి మస్తాన్‌రావుగారు - రహదార్లు, భవనముల శాఖ సూపర్ వైజరు.
   3. శ్రీ కొండా రంగారావుగారు - న్యాయవాది.
   4. శ్రీ అడ్సుమిల్లి పూర్ణచంద్రరావుగారు - ఆంధ్రజ్యోతి సహాయసంపాదకులు.
   5. శ్రీ పెనుమాక ఆంజనేయులుగారు - ఫారెస్టురేంజి ఆఫీసరు.
   6. శ్రీ అత్తోట రత్నకవిగారు - హరిజనోద్యమ నాయకులు
   7. శ్రీ అన్నం కేశవరావుగారు - విద్యుత్ శాఖలో హెడ్ క్లార్క్.
   8. శ్రీ పరుచూరి అచ్యుతరాంగారు - కవిరాజు, ఎ.జి.కె. భావవికాసకేంద్రం.

   వీరికి మా హృదయ పూర్వక అభివందనములను సభాముఖముగ తెలియజేయు చున్నాను.

2. అనేక మంది ఉద్యోగులతో, కళాకారులతో సంప్రదింపులు జరిపాం. వారినుండి సంతృప్తికరమైన సమాధానము సహకారము వచ్చినవి.

3. ఆకాశవాణి విజయవాడ కేంద్రము వారితో ఉత్తర ప్రత్యుత్తరములు జరిపాం. వారి సమాధానము అసంతృప్తికరముగ వున్నది. దీని విషయమై తిరిగి ప్రయత్నము జరగాలి.

4. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమునకు "వెనకబడిన తరగతుల కమిషన్" సమర్పించిన నివేదిక, దానికి ప్రభుత్వము జారీచేసిన జి.వో., దానిపై హైకోర్టు తీర్పు కాపీలు సేకరించబడినవి - చర్చించబడినవి. వెనుకబడిన తరగతుల అభివృద్ధికి సంబంధించినంతవరకు రాజ్యాంగ సవరణలు యెట్లా వుండవలసినది కేంద్ర ప్రభత్వమునకు నివేదిక పంపించబడినది.

5. వెనుకబడిన తరగతుల ఉద్యమమునకు సంబంధించిన శ్రీ దేవరపల్లి మస్తాన్ రావుగారి వ్యాసములను, ఉపన్యాసములను, వేదిక సమావేశములలో సమర్పించి ప్రముఖుల ప్రసంగ వ్యాసములను గ్రంథముల రూపములో ప్రచురించుటకు ప్రయత్నములు జరుగుచున్నవి.

6. కులాంతర వివాహములు చేసికొన్న యువతీ యువకులకీ వేదికపై గౌరవించుట కాహ్వానములు పంపించబడినవి.

7. ప్రభుత్వపు సత్వర గృహనిర్మాణ పథకము క్రింది తెనాలిలో ఇండ్లులేని వారికి గృహవసతి కల్పించు కార్యక్రమము ప్రారంభించబడినది.

మా కార్యక్రమములలో, ముఖ్యముగ ఈ ప్రథమ వార్షికోత్సవ మహాసభ యేర్పాటుకు, విజయమునకు తోడ్పడిన పెద్దలకు, మిత్రులకు కృతజ్ఞతలు తెలుపుతూ సెలవు తీసికొంటున్నాను.

# సాంఘిక విముక్తి ఉద్యమములకు

# "కవిరాజు" చేయూత

## త్రిపురనేని రామస్వామి సభ

ది 14-2-72 సోమవారం (రాత్రి గం. 8లకు) తాడికొండ

సభాధ్యక్షా ! సోదరీ సోదర సదస్యులారా !

ప్రకటించిన కార్యక్రమానుసారము నేడీ సభకు ఆంధ్రవిశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు శ్రీ లంకపల్లి బుల్లయ్యగారు అధ్యక్షత వహించగా, కళాప్రపూర్ణులు శ్రీ కొండవీటి వేంకటకవిగారు సభను ప్రారంభించగా, నేను ప్రసంగకునిగ వ్యవహరించవలసియున్నది. శ్రీ బుల్లయ్యగారు కారణాంతరములచే రానందున, నా ప్రియమిత్రుడు శ్రీపరుచూరి అచ్యుతరాం పెద్దల కోరిక మేరకు అధ్యక్షపీఠము నలంకరించి సభా నిర్వహణ భారమును వహించుట, మద్గురు తుల్యులు శ్రీ వేంకటకవిగారి ఆదేశానుసారము నేను సభను ప్రారంభించుట జరుగుచున్నది. అదియునుగాక, ఈ సభానంతరము ప్రదర్శించనున్న "ఖూనీ" నాటకమును తిలకించుట కాతురతగనున్న వేలాది ప్రేక్షకులకు విసగట కలుగని విధముగ ముచ్చటగ, ముక్తసరిగ ప్రసంగమును ముగించవలసిన అవసరమున్నది. ఇవ్విధముగ అనుకొకుండగ ఇనుమడించిన నా బాధ్యతను సహృదయ జనసందోహమునకు తృప్తికరముగ నిర్వహించ వలెనను ఆకాంక్షతో నా ప్రసంగమును ప్రారంభిస్తున్నాను.

ఇది "కవిరాజు" త్రిపురనేని రామస్వామి సభ. "భావ విప్లవ కవిరాజు" రామస్వామి సభ. అంతేకాదు, పురాణ పురుషుడైన రామునకు "స్వామి" అనగా రామునకు మగడనని తానే చెప్పుకొనిన ధీరుడైన రామస్వామి సభ.

పేరు పెట్టుకొనుట పెద్దవారి మమత
దాని నిలుపుకొనుటలోనె తనదు ఘనత.

పేరు నిలబెట్టుకొని సార్థక నాముడయ్యారు రామస్వామిగారు.

నాకు రసవత్ కవితయన అభిమానము, సాంఘిక సమత యన ఉబలాటము; సమాజములో హీనముగ, దీనముగ చూడబడుచున్న బలహీనవర్గముల సముద్ధరణపట్ల చాల ఆరాటము. వీరి హీనత్వమును, దీనత్వమును పోగొట్టుటకు ఆంధ్రప్రదేశమున అనేక ముగ ఆవిర్భవించిన ఏ వర్గసంఘములతో గత **25** సంవత్సరములుగ సంబంధములు పెంచుకున్నాను.

ఆర్థికత వనగూడితే ఈ వర్గములకు దౌర్భాగ్యము పోతుందని ఊహించాం. ఈ వర్గములలో డబ్బున్నవాడు కూడ, పైవర్గముగ వర్గీకరింపబడిన వారిలో తనకన్న తక్కువ డబ్బున్న వాడి జులుంముందు నిలువలేకపోతున్నాడు. విద్యలేమి వీరి హైన్యమునకు హేతువని భావించాం. ఈ వర్గములలో విద్యాధికులుగ నున్న వారి విద్య, ఉద్యోగము కేవలము వారి భుక్తికే పరిమితమైనది తప్ప తనయెడ సమాజములోగల చులకన భావమును పోగొట్టలేక పోయినవి. రాజకీయాధి కారలోపము వీరియెడ చూపించబడుతున్న తక్కువ భావమునకు కారణమై యుండనోపునని తలపోశాం. క్రింది వర్గములో పుట్టివాడు. శాసనసభ్యుడైనా, అమాత్యుడైనా వారికి ఆయా స్థాయిలలో రాజకీయ ఊడిగము తప్పుటలేదు. అందుచేత విద్య, ఉద్యోగము, ఆర్థికత, అధికారముకాక భారతదేశములన ఆ సాంఘిక అసమానతలు చిరకాలముగ చెదరకుండ నిలద్రొక్కుకొనుటకు మరేదోయొక బలవత్తరమైన కారణము, శక్తి మంతమైన హేతువు, భయంకరమైన రోగము, కుటిలమైన కుట్ర వుండితీరాలి. ఆకారణములను కనుగొనె పరిశోధనలలో బయల్పడిన ఫలితమే “మతము.” ఆ పరిశోధనా విజేతలలో త్రిపురనేని రామస్వామి గారొకరు.

ఈ భీకర మతమహామారిని హతమార్చులు సుళువైన వ్యవమారముకాదు. దాని శిరస్సు నరికితే తిరిగి అతుక్కొంటున్నది. దాని ఒక్క రక్తబిందువు క్రిందపడితే వెయ్యి మహామారులుగ రూపొందుతున్నది. దాని ఆయువుపట్టు యెక్కడున్నదో పరిశోధన ప్రారంభించారు.

మాయలపకీరు జీవము చిలుకలోనున్నది. ఆ చిలుక కొండలు, గండభేరుండ అడవులుదాటి, సప్తసముద్రములు దాటి, జీవిగడ్డను చేరుకుంటే, అక్కడ భీకరమృగములు, భయంకర భూతములు కాపలాకాయు మంత్రాలమట్టి తొట్టి లోగుండా పాతాళమునకుదిగి, కార్చిచ్చులను, కాలసర్పములను తప్పించుకొనిపోతే, ఒక బంగారుపంజరములో కనిపిస్తుంది. అది పంచవన్నెల రామచిలుక. అంతకుముందే మార్గము తెలిసికొన్నాడు గనుక, సాహసముతో ముందుకు సాగిపోయి బాలవర్ధిరాజు మాయలపకీరు ప్రాణమున్న చిలుకను సాధించి తెచ్చాడు. చిలుక గొంతునులిమితే పకీరు ప్రాణము పోయింది. ఇది చాల తేలికైనపని.

మతమహామారి అందులో హిందూమత మహామారి జీవమును చాలమెలికలలో, మంత్రమను తంత్రముతో అనేక చోట్ల బిగించారు. దాని ప్రాణమును వేదములలో పెట్టారు, స్మృతులలో భద్రపరచారు, పురాణములలోపొదిగారు, ఆచారములలో రంగరించారు, సాహిత్యములో - సామెతలలో - తత్వములలో అక్కడక్కడ, యెక్కడెక్కడో చొప్పించారు. ఈ మతమహామారి ప్రాణమును అనేకానేక అణువులుగ చేసి, మహమ్మదు వెంట్రుకలలాగ, బుద్ధుని బొమికలలాగ, గాంధీజీ బూడిదలాగ, యెన్నెన్నో చోట్ల నిక్షేపించారు. ఏ మూలన ఈ ప్రాణాణువు మిగిలినా అనతికాలములోనే నల్లి పిల్లలవలె, గాలిలో వాసనవలె నలుమూలలకు విస్తరిస్తుంది. ఎవరైనా, యెప్పుడైనా ఈ పరముగ నున్న అణువుల నన్నిటిని ఛేదించగల రేమోనని, మనుష్యుల

పెరులలోను, పరిపాలకులను పరిపాలించు మతాధిపతుల పీఠములలోను, సకల చరాచర జగత్తుకు స్రష్ఠ (Suprem Power) యని చెప్పబడుచున్న దేవునిలోను ఈ మత మహామారి ప్రాణాణువులను ప్రతిష్ఠించారు. మరలా దేవుణ్ని తీసికొని వెళ్ళి చెట్టులో పెట్టారు, పుట్టలో పెట్టారు, గుట్టలో పెట్టారు, పాములో పక్షిలో వుంచారు, గాలిలో - నీళ్ళలో కలిపారు. అక్కడకీ అనుమానము తీరక, దేవుణ్ని కనుపించని గుణములో, నిర్గుణములో, నిర్వికారములో దాచారు, ఆఖరికి మనందరిని అయోమయములో వుంచారు.

ఇన్ని దిక్కులలో, చిక్కులలో వుంచిన మత మహామారి ప్రాణమును మొత్తముగా పట్టుకొనివచ్చి, మన అధీనములో వుంచుకొనవలెనన్న, దీని ద్వారా వ్యాపించిన మౌఢ్యమును పటాపంచలు చేయవలెనన్న, యెన్ని రంగములలో, యెందరిపై యెన్ని రకములుగ యుద్ధమును ప్రకటించవలెనో, యెన్ని విద్యలలో ఆరి తేరవలెనో ఊహించండి.

ఈ శ్రమనంతా చేశారు కవిరాజుగారు. కీలకములన్నిటిని గ్రహించారు. కీలెరిగి వాత పెట్టారు. పాతపురాణములపై పూతపూశారు - సూతపురాణము వ్రాశారు. భగవద్గీతపై గీతపెట్టారు - మరొక భగవద్గీత బ్రహ్మనాయనిచే చెప్పించారు. "శంబుకవధ" వ్రాసి రామాయణమును రచ్చకీడ్చారు. "కురుక్షేత్ర సంగ్రామము" రచించి భారతమును బట్టబయలు చేశారు. "ఖూనీ" వెలువరించి క్రొత్తమాటలతో ప్రమాద భరితమైన పాత సంప్రదాయములను దిగుమతి చేయు ఆధునికుల వ్రాతలను ఖూనీ చేశారు. అనేకగీతములు. శతకములు వెలార్చి మానవుని మౌఢ్యములో నుంచుట కేర్పరచబడిన ఆనుపానులను ఛేదించారు. అందుకే శూద్రులుగా చిత్రించబడిన వారికి ముఖ్యముగ సమాజములో అన్నివిధముల వెనుక బడియున్న వారికి త్రిపుర నేని రామస్వామి చిరస్మరణీయులు.

## కవిరాజు సాహిత్యము :

లోగడ పాలకుల చట్టములు, సాంఘిక చట్రములు, యెంతటి కట్టుదిట్టముగ, క్రూరముగ, పైశాచికముగ వుండేవో శంబుకవధ నాటకములో అంగదునికి శంబుకునిచే చెప్పిస్తాడు.

"చోరత్వమునుజేయ శూద్రున కవయవ
విచ్ఛేదనము శాస్త్ర విహితమంట
ఆ దోషమునె విప్రుడాచరించినయంత
మందలింపులె ధర్మమార్గమంట
బ్రాహ్మణీ స్నేహ సంపర్కమ్ముగల శూద్రు
నగ్ని కర్పించుట న్యాయమంట
శూద్రవనిత మరుల్సొక్కిన విప్రుండు
సంతాపపడుటయే చాలునంట
ఇవియె మనధర్మ శాస్త్రము లిందునందు
నివియె చుమ్ము నిష్పక్షపాతైకబుద్ధి
మనకుగా జెప్పి పెట్టిన మహితములగు
గ్రంథరాజముల్ వానర రాజపుత్ర !"

ఇది యెంతటి ఘోరము. ఒకేరకమైన తప్పు నొకరు చేసిన మందలింపు, మరొకరు చేసిన మరణదండన.

మానవ సత్యములను మంటగలపిన ఈ వ్రాతలకు, వాదనలకు ఆధారములుగ, ప్రమాణములుగ చూపబడుచున్న, చెప్పబడుచున్న పుస్తకముల ప్రతులను సమూలముగ భస్మీపటలము చేసినతప్ప భారతజాతి బాగుపడుటకు

వీలు లేదని నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ వాపోయాడు - త్రిపుర నేని రామస్వామి నిర్ధారించాడు. తత్సాధనకు సాహిత్యము నాయుధముగ కవిరాజు స్వీకరించాడు. అందులోని అన్ని ప్రక్రిలను అవలబించారు. అన్నిట దిట్టని పించుకున్నారు.

అవకాశము వచ్చినపుడెల్ల కులాధిక్య తమస్సును తొలగించుటకు కవిరాజు ప్రయత్నము చేశారు.

కురుక్షేత్ర సంగ్రామములో శ్రీ కృష్ణరాయబార ఘట్టము. సుయోధనుని దుశ్చేష్టలు పాండవ ధార్తరాష్ట్ర విభేదములకు కారణమని శ్రీ కృష్ణుడంటాడు. అదికాదు, మదోన్మత్తుడైన భీముని దుండగములని కర్ణుని సమాధానము. భీముడు చిన్ననాట తెలియక చేసిన కృత్యముల నిపుడు నట్టించుకొనుట పాడికాదని కృపుడు కర్ణుని మందలిస్తాడు. తెలియనితనమే అయితే భీముడు ధర్మజాదులపై ఒక సారియైనా దుండగములు సాగించియుండవచ్చును గదా ! అని కర్ణుడు వాదిస్తాడు. అంత బ్రాహ్మణోత్తముడైన ద్రోణుడందుకొని కర్ణునితో -

"సూతకులోద్భవుండయినచో ఇపుడీవు వచించినట్లుగా
అతడు చేయకున్నె ఇది "యౌ'' నిది "కాద''ని యెంచకుండగాఁ
పూతకులమ్మునందతడు పుట్టుట రట్టడి సేతకెట్లుగా
చేతము సమ్మతించును అశేషవిశేషకుణజ్ఞ డౌటచే !''

వెంటనే, కర్ణుడు కోపోద్రిక్తుడై, ''ఆచార్యా ! గుణంబులు కులానుసరణంబులా? నిండు పేరొలగంబున నోటికివచ్చిన ట్లేల ప్రేలెదవు'' అని గద్దించి ద్రోణుని నోరుమూయిస్తాడు.

కవిరాజుగారు బారిష్టరు. ఆయన సహజ వాదనాపటిమ వారి నాటకములలోని పాత్రల సంభాషణలో మనకు గోచరమవుతుంది. సంధికొరకై కౌరవ సభకు వచ్చేముందు కృష్ణుడు విదురుని ఇంట్లో విందారగించి వస్తాడు. ప్రారంభముననే కర్ణుడు "కృష్ణా ! నీవు సంధి చేయదలపెట్టినది మాతోనా? విదురుతోడనా?

ఎవనితో సంధికార్యంబు నీవు నడప
భవ్యమని వచ్చినావొ యవ్వాని యింటఁ
కుడిచి కూర్చుండి సంధిమా టడుగవచ్చు
నంతియేకాని యీ రీతి నాచరింతె?

పొంతుర చేయగ దలపు పుట్టిన, మా నరపాలు నింటి క
భ్యంతర మేమి సెప్పకయె వచ్చి భుజించి అనంతరమ్ము ని
శ్చింత మెయిన్ ప్రసంగములు చేయుట యొప్పుగాని, యీ క్రియన్
గ్రంతలవారి యిండ్లకడ గైకొన బోలునె భోజనాదులన్.

దీనిని బట్టి చూడ నీవు సంధి చేయు తలంపున వచ్చితివో, వేఱు దురూహచే వచ్చితివో జగద్వితంబు కాగలదు'' అంటాడు.

అప్పుడు కృష్ణునిచే యెంత చాతుర్యముగ, సహజముగ సమాధానము చెప్పిస్తాడో చూడండి.

"బంధువర్గంబు జూచుట, సంధిచేత
రెండుకార్యముల్ నేబొనరింప వచ్చి
యందు మొదటికార్యము తీఱ, నవల జేయ
గడగుచుంటిని రెండవకార్య మిపుడు.

ఇదియునుంగాక

ఎట్టివాడైన బగతుని యింట విందు
నారగించుట మేలౌనె? యంగరాజ :
కాన మిమ్ము మీ నరపాలు గాదటంచు
విదురునన్నంబు గుడిచితి విందు నగుచు''

జీవకారణ్యమును కవిరాజు స్వీయ జీవితములోను. రచనలలోను చూపెట్టారు. ఆయన శాకాహారి. విదేశములలో కూడ మాంసము, మద్యము స్వీకరించలేదు. ''ఖూనీ'' నాటకమున జీవహింసను మాన్పింప వేనునిచే పలికించిన పలుకులు మానవ హృదయముల ద్రవింపజేయగలవు.

## ఆస్తికత - నాస్తికత

కవిరాజు మొదట ఆస్తికునిగా వుండి, తరువాత నాస్తికునిగా మారెనని హెచ్చుమంది అభిప్రాయము. మొదటి నుండి నాస్తికుడే నని ఈ మధ్య తెనాలి సభలో తాడికొండ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ బి. రామకృష్ణగారన్నారు.

నేను దేవుని గుఱించిన లోతుపాతులలోనికి పోదలచలేదు. మానవుడు ఆస్తికుడుగా మారినంత సులభముగ నాస్తికుడుగా మారుటలేదు. కవిరాజు నాస్తికతను ప్రతిపాదించారు. ఆవుల గోపాలకృష్ణమూర్తి నాస్తికతను ప్రచారం చేశారు. నేను ఆస్తికతవల్ల మానవుని మనుగడ కవసరమైన పురుష ప్రయత్నమునకు ముప్పు వాటిల్లుతుందని నమ్ముతున్నాను. మా భావము, ప్రభావము జీవిత ప్రధాన భాగస్వాములపైన ఊహించినంతగా పనిచేయలేదు - ఒకరకముగ విఫలమైనవని చెప్పుటకు నేను వెనకాడుటలేదు.

ఇటులనే నాస్తికతలో విశ్వాస మున్న చాలమంది భావము, ప్రభావము పరిధి వ్యక్తిగతమై చిన్నదిగా వుంటున్నది. విస్తృత మగుటలేదు. ఈ స్థితికి గల కారణములు, మార్పులు, మార్గములు కనుగొనబడి బహుళ ప్రచారములోనికి

రావాలి. గౌతమ బుద్ధుడు కూడ దేవుని విషయము తేలక, వీలైనంతవరకు దేవుని గురించిన ప్రస్థావన తేవద్దని, చర్చలు జరపవద్దని చెప్పాడు.

మన పగ వ్యతిరేకత భూదేవుని పై కాదు - దేవుని పైన అంతకన్నా కాదు - దేవుని పేరుతో భూదేవతలు, తదనుచరులు చేయుచున్న మోసములు, దగాలు, దోపిడీలపైన పొట్టకూటికొరకు కొందరు తమ ఆధిక్యతను సమాజములో స్థిరస్థాయిగా నిలుపుకొనుట కనుసరించుచున్న చెడువిధానములపైన, వైదిక కృతీక వలయములపైన, మానవ స్వత్వములను, వ్యక్తిస్వేచ్ఛను అభిలషిస్తున్న మనము దాడిజరపాలి. అందుకు కవిరాజు నాందిప్రస్థాపన జరిపారు. అమూల్యమైన "ధూర్త మానవా !" గ్రంథమును మనకు ప్రసాదించారు. ఇది వ్యంగ్య ప్రధానమైన కావ్యము. భూదేవుడు, అతనిభజన సమాజము చేయుచున్న చేష్టలకు దేవుడెల్లా గగ్గోలు పెడతాడో గమనించండి.

"ప్రతివర్షంబును నా వివాహమను పేరన్ పెక్కు చందాల దు
ర్మతి చందాలు వసూలుచేసి, ప్రతియూరన్ గజ్జ కట్టింతువే ?
గతి యీ మాత్రములేదె నాకరయ? నే గావించుకోలేనె? యీ
గతి నన్నీవు పరాభవించుటకు సంకల్పింతువే మానవా :
బలియే పాపము చేసినాడతనిపై వైరంబు నాకేల?త
త్బలిరాజ్యంబు హరింప వంచకుడనై ధర్మంబు పోద్రోసి, దో
ర్బల వానుండగు నింద్రుబ్రోవ నవతారంబెత్తినానంచు లో
కులు నమ్మన్ వచియింతువింకయిన బొంకుల్ మాకవా? మానవా?
ఏ నొక జాతికూడు భజియించుచు మిక్కిలి తక్కువ జాతులన్
హీనముగాగఁ జూతునని యెవ్వరు సెప్పిరి నీకు వంచకా?
మానవులందురున్ సరిసమానులుగారొకొనాకు? మాయురే

మానక నీవయిట్టి యవమానము జేతువె ధూర్తమానవా :

మొత్తము 32 పద్యములుగల చిన్న పుస్తకమిది. ఇందులోని ప్రతి పద్యమొక రసగుళిక - ఒక చైతన్యస్రవంతి - ఒక ప్రగతి పథం.

1929లో ఉప్పు సత్యాగ్రహము రోజులలో వ్రాసిన "వీరగంధము తెచ్చినారము - వీరుడెవ్వడొ తెల్పుడీ !'' అనుగీతములోని కవిరాజు దేశాభిమానము మొక్కవోనిది. ప్రతాపరుద్రీయము, సారంగధర గేయములలో ఆయన వెలికి దీసిన చారిత్రక సత్యములు గమనించ తగినవి.

కవిరాజు భావ విప్లవకారుడు, పండితుడు, తాత్వికుడు, మహాకవి, గొప్ప విమర్శకుడు, వారివి మామూలు విమర్శలు కావు, తిరుగులేని విమర్శలు, సాహితీరంగమున అజరామరముగ నిలువగలిగిన విమర్శలు. ఆయన రచనలలో సాంఘిక దృక్పధము హెచ్చు.

## ప్రస్తుత మన కర్తవ్యము

లోగడ జరిగిన తంత్రములను, కుతంత్రములను సింహావలోకనము చేసికొన్నాము. నేడు భారతదేశమున, ప్రధానముగ ఆంధ్రదేశములో యధాతథముగ నున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులేమిటి? భావుకులుగ, ఆలోచనా పరులుగ, కించిత్ జ్ఞానము కలిగిన వారుగ, కవిరాజు విప్లవ భావములపై అభిమానము కలిగినవారుగ, అన్ని రంగములలోను సమతను, వ్యక్తి స్వేచ్ఛను కోరుచున్నవారిగ మన కర్తవ్య మేమిటి? అను విషయములపై నా అభిప్రాయములను ముక్తసరిగ ముచ్చటిస్తాను.

కవిరాజు సాహిత్యమును ముమ్మరముగ ప్రచారము చేయవలెను. వారి నాటకములైన కురుక్షేత్ర సంగ్రామము, శంబుక వధ, ఖూనీ మొదలగువాటిని,

సమర్థవంతమైన సమాజముల (Troups) నేర్పాటుచేసి, ప్రదర్శింపజేయ వలెను. ప్రస్తుతము తెలుగునాట ప్రదర్శింపబడుచున్న నాటకములను వ్రేళ్ళపై లెక్కించవచ్చును, అందులో అతి ముఖ్యమైనది తిరుపతి వెంకట కవుల "కురుక్షేత్రం". ఈనాడీ నాటకమును విషయము కొరకెవ్వరు చూడరు. కేవలము నటుల నటనా చాతుర్యము, సంగీత మాధుర్యము, పద్య పఠనా విధానము చవిచూచుటకే ప్రేక్షకు లీ నాటకమునకు వెళ్తారు. ప్రతి పట్టణమున వందలసార్లు ప్రదర్శింపబడినది. ప్రతి నాటకమునకు వేలకు వేలు రూపాయలు కలెక్షన్ వస్తున్నది. దీని తరువాత చెప్పుకొన తగినంతగ ప్రదర్శింపబడుచున్నవి సత్యహరిశ్చంద్ర, చింతామణి నాటకములు. సత్యము కొఱకు హరిశ్చంద్రుడు పడు పాట్లు చూస్తుంటే ప్రేక్షకునకు ప్రాణము గిజగిజలాడి పోతుంది. సత్యము పలుకువాని కీ లోకమున కలుగు ప్రయోజనము సూన్యమనిపిస్తుంది. చింతామణిలో సుబ్బి శెట్టి పాత్ర, బాలనాగమ్మలో తిప్పడు పాత్ర, హరిశ్చంద్రలో వీరబాహు పాత్ర సమాజములో కొందరిని కులం పేరుతో క్రుంగదీస్తూ వుంటవి. ఇవి కొందరికి హాస్యం - మరికొందరికి అపహాస్యం, మరికొందరికి ఆనందం - ఇంకొందరికి అవమానం. ప్రజలలో కుల పరిగణన శాశ్వతముగ పరిరక్షించుట కీ నాటకము లమితముగ తోడ్పడుచున్నవి. ఈ కలుషితమును కడిగి వేయుటకు కార్యక్రమములు ఉవ్వెత్తున సాగాలి.

కవిరాజుగారి కురుక్షేత్ర సంగ్రామము తిరుపతి వెంకట కవుల కురుక్షేత్రమున కెందునా తీసిపోదు, పద్యములు వినుటకే గాక, విషయ పరిగ్రహణకు కూడ ప్రజలీ నాటకమును హెచ్చుగా చూడగలరని నా నమ్మకము. అటులనే శంబుక వథ, ఖూనీ. తెనాలిలో సీతారామయ్య, గుడివాడలో వెంకటేశ్వరరావు. తాడికొండలో రామకృష్ణగార్లు సమర్థవంతమైన నాటక సమాజములను తయారు చేయగలరని విశ్వసిస్తున్నాను.

ది 23-1-72 న తెనాలిలో ఆంధ్ర జ్యోతి ఉపసంపాదకులు శ్రీ అడ్డుమల్లి పూర్ణచంద్రరావుగారు త్రిపురనేని రామస్వామి తత్త్వవిచార సభలో మాట్లాడుతూ, కమ్మవారి సభలు కమ్మవారు పెడితే కమ్మవారే హెచ్చుగా హాజరవుతారని, అట్లాగే రెడ్డివారి సభలు, దళిత వర్గాల సభలు జరుగుతున్నాయని అన్నారు. ఈ మాటలు సభా ముఖమున వినుట కంత ఇంపుగా వుండవు. మందు చేదుగానే వుంటుంది. నిజం నిష్ఠూరంగానే వుంటుంది. అయినా, మందు తినటం, నిజం మాట్లాడటం మానివేయకూడదు. దేశమును, ముఖ్యముగ ఆంధ్ర ప్రాంతమును పట్టి పీడిస్తున్న కులభావం సమూలముగ పోవాలి. కులభావ మనునది సున్నితముగ ఆలోచించ వలసిన సమస్య. సమాజమును మొత్తముగ బాగుచేయవలెనను తలంపు కవిరాజుగారి కున్నదనుటలో యెవరూ శంకించవలసిన పనిలేదు. అయినప్పటికి, కవిరాజు కమ్మసంఘ శ్రేయస్సుకు ప్రత్యేక కృషి చేశారు. పూర్వము కమ్మవారికి శ్రమ నధికముగ జేయుట, వచ్చిన కాసును ముటగట్టుట లక్ష్యముగ వుండేది. అందువల్లనే హెచ్చు స్థిరాస్థులను సమకూర్చుకొన గలిగారు. క్రమముగ ఆ పద్ధతులు మారుటను కవిరాజు గమనించి, వారి బాగు కొరకు ప్రబోధ గేయములు వ్రాశారు.

"కమ్మకట్టును, కమ్మగుట్టును
కమ్మ పొదుపును కీర్తిచే
కమ్మనాటను దాటిపోయెను
గంతుపెట్టుచు పూర్వమున్.
భూమి నమ్ముక బ్రతుకుచుండిరి
కమ్మవారలు నే డెటో.
వేగుచుక్కదె వెల్గుచున్నది
తూర్పుదిక్కున చూడుమా
వీఁగిపోవకు కమ్మ బాలుడ

వెట్టిపోకలు పోవుచున్.''

వారు అధ్యక్షులుగ నుండి కొంతకాలము కమ్మ సంఘమును నడిపించారు. గుంటూరు పట్టణము వంటి విద్యాకేంద్రములలో కమ్మ హాస్టళ్ళు పెట్టించారు. ముందు తన చుట్టూ వున్న జనాల అభివృద్ధికి పాటుబడ్డారు. అటులనే రెడ్డి, వైశ్య, తెలగ సంఘములు తమ తమ విద్యార్థి వసతి గృహముల నేర్పరచుకొని, తద్వర్గముల అభివృద్ధికి కృషి చేసినై. ఇది ముదావహమైన సంగతి. ఇవ్విధముగ పై వర్గ సంఘములు క్రింది వర్గముల వారిలో చైతన్యమును, సంఘీ భావమును కలిగించినవి. తరువాత హరిజన సంఘములు, హాస్టళ్ళు కాంగ్రెసు ప్రభుత్వ సహకారముతో యేర్పాటు చేయబడినవి. తదనంతరము రజక, నాయీబ్రాహ్మణ, కళావంతుల, శాలివాహన, సుగాలి, ఆదివాసుల వంటి సంఘము లేర్పడి సమాజములో తమకు సముచిత స్థానము కల్పించుకొనుటకు కృషి ప్రారంభించారు. అటుపై వీరందరు కలసి వెనుకబడిన తరగతుల సంఘము నేర్పాటు చేసికొన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకార మీ కులములు 92. అయితే అతి ప్రధానమైన ఆర్థిక లోపమువలన కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య సంఘములకు వచ్చిన ఊపు, బలము ఈ సంఘములకు రాలేదు.

త్రిపురనేని రామస్వామిగారు సాంఘికోద్యమము ప్రారంభించిన తొలిరోజులనాటి దశలో శూద్రులుగ పరిగణింపబడిన కమ్మ, రెడ్డి, వెలమ, కాపు వర్గములు నేడు లేవు.

పరిపాలనా యంత్రాంగములో, సాంఘిక గౌరవములో బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియులతో సరిసమానముగ, మరి కొన్ని రంగములలో మిన్నగ వున్నారు. రామస్వామిగారి అభిప్రాయము ననుసరించి కమ్మ, రెడ్డి, వెలమ, కాపు వర్గములు క్షత్రియ వంశోద్భవములు. అందుచేత ఇప్పుడు వీరందరు అసలైన శూద్రులుగ పరిగణింపబడి. విజ్ఞాన పరిధుల నుండి బహిష్కరింపబడి, తరతరములుగ

అణగారిపోయిన వెనుకబడిన తరగతులవారి సర్వతోముఖాభివృద్ధికి సానుభూతితో సహకరించాలి. ఈ రెండు వర్గముల మధ్య నున్న అంతరమును తగ్గించుటకు పై అంతస్థులోవి వారొక్కొక్క మెట్టు క్రిందికి దిగాలి - అదే సానుభూతితో కూడిన త్యాగము. క్రింది అంతస్థులోనివా రొక్కొక మెట్టు పైకి యెక్కాలి - అదే ధైర్యముతో కూడిన చొరవ, అప్పుడే ఈ అగడ్త త్వరగా పూడుటకు, అంతరము తగ్గుటకు అవకాశమేర్పడుతుంది. దీనికి అనువైన నీతిని, రీతిని (Thinkers) ఆలోచనా పరులు ప్రదర్శించాలి - అనుసరించాలి. ఈ విషయమై ప్రముఖ న్యాయవాది, మానవతావాది, కవి రాజు ప్రధమ శిష్యులు అయిన కీర్తిశేషులు ఆవుల గోపాలకృష్ణమూర్తిగారి సూక్తులను రెండు మూడుదహరించుట అసందర్భము కాదు.

"సాంఘిక న్యాయము జరగాలంటే, ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక ప్రజాస్వామ్యములు ఆచరణలోనికి రావాలి."

"వెనుకబడిన జాతుల ఉద్యమమంటే సాంఘిక విముక్తి ఉద్యమముగా నేను భావిస్తున్నాను"

"మనిషి మారుతున్నాడు. మనుగడ మారుతోంది. కాని సాంఘిక జీవనంలోని నిమ్నోన్నతాల దూరం తగటానికి ఆశించిన మార్పు జరగకపోవటం శోచనీయం. ఆలోచించదగిన విషయం."

"వర్ణ వ్యవస్థ కులవ్యవస్థగా దిగజారి, నాలుగు వర్ణాలు నాలుగువందల కులాలుగా మారిపోయినై. దేశం వర్ణాల, కులాల దేశంగా కరుడుగట్టి కూర్చుంది. ఆ పాకం సడలకపోగా చిట్టెంకట్టిపోయింది నూటికి తొంభైమంది జనంలో ఈ మౌఢ్యం పోలేదు. ఇది పోయితీరాలి."

భారతదేశ అభివృద్ధిని, సమైక్యతను, గౌరవమును దిగజార్చుచున్న ఈ పైశాచిక కులవ్యవస్థ పోవట మెలా? వర్ణాంతర, కులాంతర వివాహములు వినా దీనికి మార్గము లేదు. ఆ పద్ధతిని ప్రజలు గౌరవించాలి, ఆచరించాలి. అట్లా వివాహము చేసికొన్న యువతీ యువకులకు ప్రభుత్వము ప్రత్యేక సౌకర్యము లిచ్చి (Incentives) ప్రోత్సహించాలి.

దళిత వర్గములకు రాజ్యాంగ మిస్తున్న ప్రత్యేక సౌకర్యముల పద్ధతిలో కొంత మార్పు రావాలి. రెండు తరములు గజిటెడ్ ఉద్యోగులుగ పనిచేసిన వారి కుటుంబములను దళిత వర్గముల జాబితానుండి తొలగించాలి. అప్పుడా సౌకర్యములా వర్గములలో ఇంకా హీనస్థితిలో నున్న వారికి హెచ్చుగా ఉపయోగపడగలవు.

ఓటర్ల జాబితా నుంచి "కులము"ను తొలగించారు. పేరు చివర పేర్కొనబడుచున్న  పేరు చివర పేర్కొనబడుచున్న రెడ్డి, చౌదరి, శాస్త్రి, రాజు వంటి కుల సంకేతములను శాసనము ద్వారా తొలగించాలి. ఈ వ్యాధి ఇపుడు ముదిరి యాదవ, గౌడ సంఘములలో ప్రవేశించినది. ఇది ఇట్లానే కొనసాగితే అన్ని కులములకు విస్తరించే ప్రమాదమున్నది. ఈ విషయమును పసిగట్టిన కవిరాజు తన పేరు చివర "చౌదరి" తగిలించవద్దని తన ఆఖరి రోజులలో అనుయాయులకు విజ్ఞప్తి చేశారు. కుల సంకేతములను వాడుకొనుటవలన గౌరవమో, సౌకర్యమో కలుగుతుందని భావించబడినట్లయితే, ఆ సంకేతములను అన్ని కులములవారు వాడుకొనాలి. అది కూడదనుకొన్నప్పుడు అన్ని కులములవారు తీసివేయాలి. ఈ న్యాయమును పాటించుటకు ప్రజలు, ప్రభత్వము ఉద్యమించాలి.

## బాబాలు

ఆర్యబుుషుల కాలము దాటి, మతాచార్యుల కాలముదాటి, బాబాల కాలములో పడ్డాం. షిర్డీ సాయిబాబా, అవతార్ మెహర్‌బాబా కొన్ని శాంతి సందేశముల నిచ్చి వెళ్ళిపోయారు. వీరిద్దరికీ ముందు అలీ బాబా పేరు విన్నాం వీరందరికీ దిట్టలైన ప్రచారకులు, అనుయాయి లున్నారు. ఇప్పుడు భగవాన్ సత్యసాయిబాబా వున్నారు. ఈయన ఆంధ్ర ద్రేశ్‌లోనే వున్నారు. నేనే దేవుడనని ప్రకటిస్తున్నారు. మహిమలు చూపిస్తున్నారు. భారతీయ ప్రముఖ శాస్త్రవేత్త (Secientist) సూరి భగవంతం, బహుభాషాకోవిదుడు, రాజనీతిజ్ఞుడు బూర్గుల రామకృష్ణారావు, కులపతి మున్షీ, గుంటూరు జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పండితకవులు మాధవరాయశర్మ, "అమరేంద్ర" అనబడు నరసింహశాస్త్రి, జంధ్యాల పాపయ్యశాస్త్రి, నటకావతంస బుర్రా సుబ్రహ్మణ్యకయశాస్త్రి, గాయక శిఖామణి ఘంటసాల వెంకటేశ్వర బాబాగారి శిష్యకోటిలో చేరి వారి మహిమల వలన స్వీయానుభూతిని పొందినట్లు హెచ్చు మోతావులో ప్రచారము సాగిస్తున్నారు. వెంకటగిరి మహారాజా వంటి కోటీశ్వరులు దేశవ్యాప్తముగ వేల సంఖ్యలో ఆయన శిష్యరికం చేస్తున్నారు. ప్రభుత్వ రంగములోని చాలమంది గజిటెడ్ ఉద్యోగులుగా వున్న డాక్టర్లు, ఇంజనీర్లు, జడ్జీలు, కార్యదర్శులు బాబాగారి ప్రబోధములకు, మహిమలకు ప్రభావితులయ్యారు రకరకముల బంగారువస్తువులు, పుస్తకములు, విభూతులు, తీర్థములు, ప్రసాదములు ఇసుకనుండి, సూన్యము నుండి ఆవిర్భవింపజేయుట, మనోరంజకమైన ఉపన్యాసముల నిచ్చుట సత్యసాయి చేస్తున్నారు. విశేష జనాలు మంత్రముగ్ధ లవుతున్నారు. పైన ఉదహరించినవా రంత ఆలోచనా రహితులని, అనర్థాన్ని వాంఛిస్తున్నారని అనుటకు హేతువాదులకు ఆధారములున్నవా? ఇటీవల సత్యసాయి మద్రాసులో చేసిన ప్రసంగం టేపు రికార్డు ద్వారా విన్నాను. కరుణ,

శీలము, త్యాగము, సత్యము, సమత, సౌభ్రాతృత్వము, స్నేహశీలత, సానుభూతి వగైరా మానవ విలువలలో దైవచింతన కూడ చేర్చారాయన. అయితే వారి పూజా విధానము వైదికాచారము ననుసరించి యున్నది. సమాజములో పై అంతస్థులో వుండి, పలుకుబడి గలిగి, ప్రచారమున కుపయోగపడగల వ్యక్తులకు సత్యసాయి బాబా ప్రాధాన్యత నిస్తారని, కొంత ఆర్థికత నొనగూర్చగలరని పలు వ్యక్తుల ప్రసంగముల వలన తేటతెల్ల మౌతున్నది. ఇవి మామూలు మనిషి గుణాలు. వేదములు, స్మృతులలోని శ్లోకములను వారి భక్తులు పిల్లలచే కూడ వల్లెవేయిస్తున్నారు. ప్రజా శ్రేయస్సుకు బాబా కార్యక్రమములెంత వరకుపయోగపడగలవో, లేక అపకారము చేస్తాయోఆలోచనాపరులైనవారు, శాస్త్రీయ దృక్పథముతో అవస్యము చర్చలు జరిపి, నిగ్గు దేల్చి, ప్రచారము చేయాలి. ఇట్లానే 30 సంవత్సరములుగ అన్న పానీయములు మాని మౌనముగ సమాధిలో నున్న ముమ్మడివరం బాలయోగి సంగతి. ప్రయోజన మేమోగాని వీరిది ప్రమాదము లేని పద్ధతి.

## ఆకాశవాణి

ఇప్పుడన్నిటికన్న అతి ప్రమాదభరితముగ పరిణమించినది ఆకాశవాణి ప్రసారము చేయుకొన్ని కార్యక్రమములు. ఇది హెచ్చుబాధ్యత కలిగిన, శక్తి వంతమైన ప్రచార సాధనము. రోజువారీ దీని వినిమయ కాలమును 4 ప్రధాన భాగములుగ విభజించు కొనవచ్చును. రోజులో ఒకవంతు ఆహారము - వ్యవసాయము - రైతులు పరముగ, మరొకవంతు మతము - దేవుడు - భక్తి పరముగ, ఇంకొకవంతు సినిమాలు - సంగీతము - ప్రకటనలు పరముగ, మిగిలిన నాల్గవవంతు తమకు నచ్చిన సారస్వతము - కవులు - వార్తలు పరముగ కాలము ఖర్చవుతున్నది.

వ్యవసాయ వృత్తిని మినహాయించి, అన్యముగ వున్న వందలాది చేతివృత్తుల అభివృద్ధిని గురించి, వాటిపై ఆధారపడిన కోట్లాది ప్రజల జీవితముల మెరుగును గురించి ఒక్క ముక్కైనా చెప్పుటలేదు. ఈ రేడియోద్వార మత మౌఢ్యమును మరింతగ నూరిపోస్తున్నారు. ఉదాహరణకు - వారములో కొన్ని రోజులు ప్రొద్దున్నే రేడియో ఆన్ చేస్తే ఈ శ్లోకం వినిపిస్తుంది.

స్వస్తి ప్రజాభ్య : పరిపాలయన్తాం

న్యాయేన మార్గేణ మహీం మహీశా:

గోబ్రాహ్మణేభ్య : శుభమస్తు నిత్యం

లోకాస్సమస్తాస్సుఖినోభవన్తు.

ఈ శ్లోకపు అర్థమును, అన్వయమును యెంతమంది గమనిస్తున్నారు? పులివర్తి శరభాచారిగారి ''యశోధరా'' కావ్యము చదివేవరకు నేను గమనించలేదు.

స్వస్తి ప్రజాభ్య : = ప్రజలకు శుభమగుగాక.

పరిపాలయన్తాం న్యాయేన మార్గేణ మహీం మహేశా : = న్యాయమార్గములో పరిపాలన సాగించు రాజు లీ వసుధపై కలుగుగాక.

ఇక మూడవ పాదములో అటువంటి రాజుల కనుదినము శుభము కలుగుగాక అను అర్థము నిచ్చు "తత్ పాలకాభ్య : శుభమస్తునిత్య'' అని వుండాలి. కాని మొదటి రెండు వాక్యములతో అన్వయము కుదరని "గో బ్రాహ్మణేభ్య : శుభమస్తు నిత్యం = గోవులకు, బ్రాహ్మణులకు అనునిత్యము శుభము కలుగుగాక'' అని వుండుట అతుకుల బొంతగా నున్నది. ఇకపోతే

నాల్గవపాదము - "లోకాస్సమస్తాస్సుఖి నోభవంతు = లోకమున సకల ప్రాణులు సుఖముగా నుండుగాక.''

ఇట్లా అన్వయము లేని శ్లోకములు, సమాజములో కులాధిక్యతను లేదా వర్ణాధిక్యతను బోధించు శ్లోకములు యెన్నో వస్తున్నవి. ఈ విషయములో కూడ ఆలోచనా పరులు జాగ్రత్త వహించాలి.

నాకీ అవకాశము నిచ్చిన కార్యకర్తలకు, శ్రద్ధగా విన్న సభికులకు ధన్యవాదములు.

# కులరహిత సమాజము

## కుల నిర్మూలనోద్యమ సభ

ది 9-4-1972 ఆదివారం తెనాలి

సభాధ్యక్షులు, స్థానిక న్యాయవాది శ్రీ కొండారంగారావుగారికి, కులనిర్మూలన సంఘ వ్యవస్థాపకాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శి శ్రీ జాగర్లమూడి వీరాస్వామిగారికి, ఈ సంఘనిర్వహణ భారమును వహించిన ఆంధ్రప్రదేశ్ కుల నిర్మూలన సంఘ కార్యదర్శి శ్రీడి.జి. రామారావుగారికి, సభ నలంకరించిన పెద్దలకు హృదయపూర్వక నమస్కారములు.

ఇది కులనిర్మూలన సభ. దీని పేరు వింటుంటే, గజిబిజిగావున్న నేటి సమాజవ్యవస్థను సరిదిద్దుటకు వీలుగా, అత్యంత శ్రద్ధాసక్తులతో పరిశీలించి నామకరణం చేసినట్లు తోస్తున్నది. ఇంతవరకు మనకు సంఘములో, ముఖ్యముగ ఆంధ్ర ప్రాంతములో బ్రాహ్మణ సంఘము, కమ్మసంఘము, రెడ్డిసంఘము, కాపుసంఘము, మొదలుకొని, హరిజన సేవా సంఘము, రజకజన సేవాసంఘము, నాయీబ్రాహ్మణ సంఘము, యాదవసంఘము వగైరా వగైరా వృత్తి సంఘములు లేదా వర్గసంఘములు యేర్పడి ఆయా వర్గముల, లేదా కులముల అభివృద్ధికి ఇతోధికముగ కృషి జరిపినవి. ఇప్పుడు యేర్పాటు చేయబడినది కులనిర్మూలనసంఘము. అందుచేత పై సంఘముల యేర్పాటులోని ఆశయమున కిది కించిత్ భిన్నమైనది.

భారత దేశమును తరములేకాదు, యుగములుగా పట్టి పీడిస్తున్న కులజాడ్యమును సమూలముగ నిర్మూలించ వలె నన్న మహదాశయముతో

కులనిర్మూలనసంఘము యేర్పాటు చేయబడినది. ఈ "కులనిర్మూలన" పదమును మరికొంచెము పరిశోధనచేస్తే మనలను మరింతగా వేధిస్తున్న "మతము" అనుదానిని జాగ్రత్తగ మినహాయించినట్లు కనపడుచున్నది. వ్యవస్థాపకులు పంపిన కరపత్రములనుబట్టి ఇది కేవలము కుల నిర్మూలన సంఘమే కాని మత నిర్మూలన సంఘముకాదు. మిగతా మతములజోలికి పోకుండ హిందూ మతములోని కులవ్యవస్థ (వర్ణ వ్యవస్థ) ను నిర్మూలించుటకు మాత్రమే ఈ సంఘ మేర్పాటు చేయబడినదని బోధపడుచున్నది.

ముహూర్తబల మనునది యేదైన యున్న అది ఈ కులముల నేర్పాటు చేయవలెనని తొలుత తలంపు వచ్చిన లేదా వ్రాసిన ఘడియకే అది వర్తిస్తుందని నా నమ్మకము కదలించుటకు వీలులేనంత బిగింపుతో ఈ కుల వ్యవస్థ నిర్మాణము జరిగినది.

మూర్ఖులు మూడు రకములు. తెలియని మూర్ఖులు. తెలసీ తెలియని మూర్ఖులు, తెలిసిన మూర్ఖులు. సమాజములో మేధావివర్గముగ నున్న బాగుగ తెలిసిన మూర్ఖులు ఈ కుల వ్యవస్థ నేర్పాటు చేశారు. పేర మొదురిలు భగవంతుని ముఖమునుండి ఊడిపడినవని చెప్పబడుచున్న వేదములలో కుల ప్రసక్తి లేదు - త్రిమూర్తుల ఊసులేదు. అందులో వున్న దంతా మానవునకు ఇహలోకములో కావలసిన బంగారము, గోవులు, వీర్యవృద్ధి కావాలనే కోర్కెల దండకము - అందు కుపకరించు ప్రకృతిలో సిద్ధమగు వస్తువుల పూజ. అదే ప్రకృతి పూజ. వేదకాలము నాటి వారికి ఆహారము లేక అన్నము పరబ్రహ్మ స్వరూపము. ఆనందమునకు, సృష్టికి మూలాధారము లైన స్త్రీ, పురుష అంగము లగు యోనిని, శిశినమును కలిపి ఒక ఆకారముగా తయారు చేసికొని వారు పూజించారు. యోనిలో కుదురుగా చొప్పించబడిన శిశినమే లింగాకారము. అంతియే కాని, ఇప్పు డూహించబడుచున్న శంకరుడప్పటి లింగాకారము కాదు.

ఇది తరువాత వచ్చిన కల్పన. తెలివిగల మూర్ఖులు చేసిన అభూతీ కల్పనలు కోకొల్లలు. అందులో ఇది యొకటి.

తరువాత అనాది మానవులకుశాస్త్ర పరిజ్ఞానము (Knowledge of Science) ప్రారంభమైన తరువాత పకృతి మూల  పదార్థమును రెండు భాగములుగ విభజించి,  వాటికి పేర్లు పెట్టుకొని పూజించ నారంభించారు. అదే శివం, శక్తి. శివము పదార్థము  (Matter) ఇది జడమైనది. శక్తి పదార్థములో ఇమిడి యున్న చైతన్యము (Energy). శక్తిని ఆవరించుకొని పదార్థముంటుంది. కదలునది శివము. కదలించునది శక్తి. నిప్పు  శివము. అందులో కాలేగుణము శక్తి. కాయము శివము. అందులోని జీవము శక్తి. తరువాత వీటికి శంకరుడు, పార్వతి పేర్లుతగిలించి, ముక్కు, చెవులుపెట్టి చాల హంగామా చేశారు. ఇదంతా కల్పనాజగత్తు.  ఇట్లా వచ్చిన కల్పనలలో కులమొకటి. ఈ నాలుగు కులములను నేనే సృష్టిసస్తున్నాని కృష్ణపరమాత్మ ఉవాచగ హిందువులకు ప్రమాణ గ్రంథముగ చెప్పబడుచున్న భగవద్గీతలో ఇరికించారు. మన దేశములో కులము కలిగించుచున్న హేయభావమును, అనైక్యతను గమనించిన, ఇటువంటి దుష్టమైన మాటలు, బుద్ధిహీనమైన పదములు భగవంతుడు పలికివుంటాడా? పలకడు. అట్లా పలికి వుంటే, భగవంతుడు తాను పవిత్రముగ సృష్టించిన కులము, కులము యొక్క భ్రష్ట పరిణామమును ఊహించలేని హ్రస్వ దృష్టిపరుడై  వుండాలి. ఆమాత్రము దూరదృష్టి లేని వాణ్ణి భగవంతుడంటామా? తెలివిగల  మూర్ఖులు చేసిన ఇటువంటి అపభ్రంశపు పనులు చెప్పుకుంటూపోతే ఇప్పుడు నాకిచ్చిన సమయము చాలదు. ఈ కారుకూతలన్నియు  నితరుల కష్టముమీద జీవించుట కలవాటుపడిన పరాన్న భుక్కులు కూసినవే - వ్రాసినవే.

అందుచేత, మత నిర్మూలనమని అనకపోయినా. ఈ కులనిర్మూలన మనుపేరులో హిందూమత నిర్మూలనమను అర్ధము ద్యోతక మవుచున్నది.

శ్రీ వీరాస్వామిగారు న్యాయశాఖకు కార్యదర్శిగ వుండి, చట్టముల నాపోశనము పట్టిన దిట్టయగుటచేత, శాసనములలో నిగూఢముగవుండు చిక్కులను (Implications in Law) ఆలోచించి మన లౌకిక రాజ్యము (Secular state) లో యెవరి మతమును వారు అట్టిపెటుకొన వచ్చునని భారతరాజ్యాంగ మిచ్చుచున్న హామీకి భిన్నముగ లేకుండ వుండుటకు సంఘము పేరులో మత నిర్మూలనము చేర్చ లేదేమోయని అనిపించు చున్నది.

కులమును నిర్మూలించవలెనన్న అనేక విషయముల పైన ఒకేసారి, ఒక్కుమ్మడిగ, అన్ని మూలలనుంచి అత్యంత శక్తిమంతముగ దాడి జరపాలి.

అతి ప్రాచీనము, అత్యున్నతము అనుకుంటున్న హైందవ సంస్కృతి యను రథమునకు కులము, దేవుడు అనునవి రెండు చక్రములు. వాటిని సంధించు ఇరుసు మతము. ఇందులో కులమను చక్రమును ఛేదించిన దేవుడను చక్రము, మతమను ఇరుసు అనామక మగును. తొలుత గౌతమ బుద్ధుడు తాను దుష్ట త్రయముగ భావించిన ఈ మూడిటి మీద దండెత్తాడు. కులం పోవాలన్నాడు. మతం పేరుతో, పుణ్యము పేరుతో, యజ్ఞము పేరుతో జరుగుతున్న అక్రమములు, నరబలి, పశుబలి వంటి దారుణ హింసాకాండ పనికిరాదన్నాడు. దేవుణ్ని గురించిన ఆలోచన మానవునకక్కరలేదన్నాడు. మనము కేవలము మానవులుగ మానవత్వముతో వ్యవహరించా లన్నాడు. మానవునకు కావలసినది సంఘ క్షేమము - సంఘం శరణం గచ్ఛామి అన్నాడు.

తాను మహారాజు కుటుంబమునకు చెంది, సర్వము పరిత్యజించి, అత్యంతమైన , నిరంతరమైన పట్టుదలతో కృషి చేశాడు. తన సిద్ధాంతమును ప్రపంచ వ్యాప్తము చేశాడు. అయినా దానిని కూడ మన దేశములో పరాన్న భుక్కుల వర్గము నిలువనీయలేదు.

మన దేశములో ప్రత్యేకమైన విశేష మున్నది. అమిత తెలివి కలిగినవారు బహుకొద్దిమంది వుంటారు. ఆ తెలివి పరిమాణ మింతని చెప్పలేము. They are extremely genius. వారిని అనుసరించు మందబుద్ధులు చాలహెచ్చు సంఖ్యలో వుంటారు. ఆ కొద్దిమంది కోవకు చెందిన వాడే శంకరాచార్యులు. ఆయన కోటిసూర్యులంత శక్తిసంపన్నుడు శంకరాచార్యులు పనిగట్టుకొని, ఆసేతు హిమాచల పర్యంతము పర్యటించి భారతదేశములో బౌద్ధమును నిర్మూలించి, హిందూమత పునరుద్ధరణకు కారకుడయ్యాడు. తిరిగి హిందువులకు కులమను ఇనుప సంకెళ్ళను తగిలించాడు.

తరువాత రాజారాంమోహనరాయ్, కందుకూరి వీరేశలింగం, యం.యన్. రాయ్. కరంచందుగాంధి, డా॥ అంబేద్కర్ వంటివారు కులముల నిర్మూలనకు కొంత కృషి చేశారు. కొంతకు కొంత కృతకృత్యులయ్యారు. అంతలో స్వరాజ్యపోరాటము కుతికలమీదకు వచ్చింది. అప్పుడుకూడ రాజకీయ దాస్య విముక్తి ప్రధానమా? అను మీమాంస వచ్చినది. డాక్టర్ అంబేద్కర్ వంటివారు మనకు సాంఘిక దాస్యవిముక్తి ప్రధాన మని - ఇంట గెలిచి రచ్చగెలవాలని వాదించారు. దేశములో అందరి సమస్యగనుక - రాజకీయ దాస్య విముక్తి ప్రధానమని గాంధీజీ వాదన. ఇందుకు అంబేద్కర్ కలసిరాక పోతే ప్రాయోపవేశముచేసి తాను చచ్చిపోవటం అంబేద్కర్‌కు కూడ ఇష్టములేదు గనుక తన పట్టుదలను కొంత సడలించుకొని రాజీపడ్డాడు. హరిజనులకు జనాభా నిష్పత్తి మేరకు ప్రత్యేక నియోజకవర్గములు (Seperate Electorate) వుండవలెనను పట్టును (ఇతరుల వోట్లతో ప్రమేయము లేకుండ హరిజన అభ్యర్థులకు హరిజన వోటర్లే ఓట్లు వేయాలి) సడలించుకొని మామూలు నియోజకవర్గము (General Electorate) లలో ఓటర్లందరు హరిజనులనే యెన్నుకొనవలెను (Reservations) అను పద్ధతికి అంగీకరించాడు. దీని

వలన  గాంధీజీకి ప్రాణభిక్ష జరిగింది. హరిజనులకు అన్యాయం జరిగింది అంబేద్కర్ సూచించిన పద్ధతి ప్రకారమయిన  వ్యక్తిత్వము కలిగిన హరిజన ప్రతినిధులు యెన్నికగుట కవకాశ ముండెడిది. ఇప్పుడు పై అంతస్తులలోని వారి కనుసన్నలలో, అడుగుజాడలలో నడచు ప్రతినిధుల నెన్ను కొనక హరిజనులకు తప్పుట లేదు.

పూర్వమీ కులములు శ్రమవిభజన (Division of labour) ప్రాతిపదికగ యేర్పడినవని, ప్రజలంతా సంఘమును ఏక కుటుంబ సభ్యులను మహదాశయముతో వర్ణ వ్యవస్థ యేర్పాటు చేయబడినదని ఒక వాదనవుంది. అప్పుడది అవసరమే అయినప్పటికి, ఇప్పుడు పనికిరాదు. నేడీ కుటుంబ సభ్యులకు సమాన అవకాశములులేవు. వ్యవసాయము, వాణిజ్యము మొదలగు కొన్ని వృత్తులు ఆర్థికతను చేకూర్చుకొని గౌరవ ప్రదమైనవిగ భాసించు చున్నవి. రజక, పాకీ వగైరా మరికొన్ని వృత్తులు అర్థికత అందరానిదై నీచభాజకముగ పరిణమించినవి. ప్రజాస్వామికములో కూడ ధనబలము, కులగౌరవమున్న వారికి రాజకీయ పెత్తనము గుత్తమైనది. అవి లేని వారికి అధికారము అందరానిది, ఆశించరానిది అయింది.

నే నీ తెనాలిలో తక్కువ సాఘిక స్థాయి కలిగిన కులమునకు చెందిన వాడ నను కారణముతో చేరిన 3 మాసములకే ఇల్లు ఖాళీ చేయవలసి వచ్చినది ఆ ఇల్లు మరీ అగ్రవర్ణస్థుల మనుకొనువారిది కాదు. మధ్యరక మనుకొను చున్న తెగవారిది.  వారి కుటుంబమునకన్న మా కుటుంబము పలుకుబడిలోను, పరిశుభ్రములోను, అలవాటులలోను,  పలకరింపులలోను మిన్నగ వుండేది. వారింట్లో యే ప్రత్యేక వంటకము చేసికున్నను ముందు మా పిల్లలకు, తరువాత మాకు పంపుట ప్రారంభించిన దా యింటి యజమానురాలు. అవి స్వీకరించుటకు మొదట నా భార్య ఇష్టపడలేదు. పదార్థములను పంపించవద్దని

వారితో చెప్పింది. ఆప్యాయముతో ఇస్తున్న పదార్థములను స్వీకరించుట కెందుకు మా ఆవిడ అయిష్టముగ నున్నది మొదట నాకు బోధపడలేదు. ఒకటి రెండు సందర్భములలో తీసికొనిన తప్పేమున్నదని నే ననుటకూడ జరిగినది.

మే ముంటున్న ఇంటి యజమానులకు పిల్లలు లేరు. మా ఆవిడ తయారు చేసిన పిండివంటలు వారికి రెండు పర్యాయములు పంపించినది. ఏదో ఒక మిషతో వారు తీసికొనలేదు. ఆ ఇంటిలో వారికి దేవభక్తి హెచ్చుగ నున్నట్లు కనుపించేది. ఒక నాడు నే నింటియందుండగ, మా ఆవిడ కావలెనని విజయదశమి రోజు ప్రసాదము తయారుచేసి పంపించింది. అది కూడ తినే ఓపిక లేదని వెనుకకు పంపించారు. అప్పుడు మా ఆవిడ చాల నిష్కర్షగ చెప్పినది - "మా పదార్థములను తీసికొనుట కిష్టము లేనపుడు మీ పదార్థములను పంపించవద్దని, పంపించిన స్వీకరించన"ని. ఆమాట కామె విపరీతముగ గింజుకున్నది. పదిరోజులలో ఇల్లు ఖాళీ చేసెడివరకు ఆవిడ మమ్ములను కాని, ఆవిడ భర్తను కాని నిదురపోనివ్వలేదు.

చిన్న కులములలోనుంచి చదువుకొని, ఉద్యోగములు చేసెడివారికి రెండు బాధలున్నవి. కులము పేరు చెప్పిన ఇబ్బంది. చెప్పకపోతే తప్పు. కులం పేరు చెప్పినచో సరియైన ఇల్లు అద్దెకు దొరకదు. దొరికినప్పటికి చుట్టూ వున్న సమాజము గౌరవించదు. అందువలన, వెనుకబడిన తరగతులుగ నిర్దేశింపబడిన వర్గములనుండి ఉన్నత స్థితికి వచ్చినవారిలో కొంతమంది ఇప్పుడు తాము నాయుళ్ళమని చెప్పుకొనుట కద్దు, ఇది పోవాలి. కులం చెప్పకుండా వుంటే ఎప్పుడో ఒకప్పుడు బంధువుల రాక సందర్భములోనో, వివాహముల సందర్భములోనో, స్కూలు రిజిష్టరుల వలననో కులం సంగతి బయటపడక తప్పదు. ప్రతి ఆఫీసరు జవానుకు తన ఆఫీసరు కులము చార్జీ తీసికొనకముందే తెలుస్తుంది. తద్వారా అందరికీ తెలుస్తుంది. అందరికి

తెలిసిన దానిని మరుగుపెట్టుటకు ప్రయత్నించుట కేవలము అమాయకము, అవివేకము, ప్రమాదము.

తాము చెప్పితే తప్ప తమ పిల్లలకు తమ కులము తెలియదని ఒకరన్నారు. అది సరికాదు. మా కులమును గురించి మా పిల్లలకు చెప్పవలసిన అవసరము కాని, సందర్భము కాని యెప్పుడూ రాలేదు. మే మెప్పుడూ చెప్పలేదు. సరిగా మాట రాని 4 సంవత్సరాల మా చిన్న పాప ఒకనాడు వాళ్ళ అమ్మతో అంటున్నది - "అమ్మా ! మనం చాకలోళ్ళమంటగా ! " అని. ఆటలో తాయం పెట్టలేదని అంతకన్న ఊహ తెలిసిన అగ్ర వర్ణస్థుల పిల్ల లా మాటలని మా పాపను ఆటనుండి బహిష్కరించారు. ఇ దిప్పటికి వారము రోజుల క్రితము జరిగిన సంఘటన. అంతే కాదు. నే ననిన మెంతో ఆప్యాయముగ గౌరవముగ వుండి, విద్యలో మిన్నగ వున్న వారే మాటల సందర్భములో, అప్రయత్నముగ "దోబీ మార్కు సంతకాలేగదండీ !" అని నాతో నే అనుట అనేకసార్లు విన్నాను. ఇది వారి తప్పనినే నన‌ను. ఇది మన మహోన్నత హైందవ సంస్కృతి, నానుడినుండి వచ్చినమాట.

మరొక సంఘటన. నేను, శ్రీ నన్నపనేని వెంకట్రావుగారు మరికొంత మిత్రుల కలసి సాంఘిక సమస్యలపైన పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నాం. "సాంఘిక న్యూనతని తెగగొంతు చించుకున్నారది ఇప్పుడెక్కడ వున్నదండీ ! అందరము సమానముగ గౌరవించు కుంటున్నాముగదా !" అని వెంట్రావుగారిని ప్రశ్నించారొకరు. వెంకట్రావుగారు తడువుకొనకుండ "నీవు బోగంవేషాలేస్తున్నావే" అని నే నన్నప్పుడు నీ మనసులో కలుగు హెచ్చులొజ్జుల పరిణామమే సాంఘిక ఆధిక్యత, న్యూనత అన్నారు.

అందుచేత అసలు కుల ప్రస్తావన లేని సమాజమును సృష్టించుకొనుటకు సంఘము తీవ్రముగ కృషి చేయవలసి యున్నది.

అయితే కులమెలాపోతుంది? అనేది సమస్య. వర్ణాం తర వివాహములు వినా పరిష్కారమార్గము లేదని పెద్దలు తేల్చారు. ఇది నిజము.

కులము పోవుటకు చేయు ప్రయత్నములో యెదురగు కష్టనష్టము లేవి యనునది ఆలోచన, వర్ణాంతర వివాహము చేసికొన్న వారి జీవితము ముప్పాళ్ళ రంగనాయకమ్మగారి "బలిపీఠం" అవుతుందేమోనని చాలమంది భయం. ఈ సందేహమును నిన్న గుంటూరులో జరిగిన కుల నిర్మూలనోద్యమ సభలో శ్రీమతి సుశీల మహంతిగారు వెలిబుచ్చారు. సుశీలా మహంతిగారు వర్ణాంతర వివాహము చేసికొన్నారు. వారు శాఖాహారి, మహంతిగారు మాంసాహారి, అయినా వారికి సఖ్యత సరిగానే యున్నది.

కొందరు ప్రేమించుకొని, మరికొందరు అప్పటి వారి వారి పకిస్థితులవలన వర్ణాంతర వివాహములు చేసికొని ప్రేమభారము, పరిస్థితుల ప్రభావము తగిన వరువాత ఆహార నియమములు, ఆచార వ్యవహారములు కుదరక తమ పిల్లల వివాహములు వగ్గై రా ఆలోచనలోనికి వచ్చినపుడు, తమను కష్టములలో తమవారు, పొరుగువారు ఆదుకొనకపోయినపుడు కుటుంబములో నానా బీభత్సము చెలరేగుటకు ఆస్కారము లేక పోలేదు.

వీటిని తట్టుకొనుటకు భావ పరిణామము చెందాలి. తమ మనస్సును ముందు కట్టుదిట్టము చేసికోవాలి. ఈ రకమైన ఇబ్బందుల నుండి ఆదుకొనుటకు ప్రభుత్వ శాసనములు, బలమైన సాంఘిక సంఘములు తమ వెనుక నున్న వన్న ధైర్యము వర్ణాంతర వివాహములు చేసికొన్న వారికి కలగాలి. వర్ణాంతర వివాహములు చేసికొన్న వారికి ప్రభుత్వము కొన్ని ప్రత్యేక సౌకర్యములను కలిగించి ఉద్యమమును ప్రోత్సహించాలి. బంజరు భూములను, ఉద్యోగములను, శాసనసభలు, రాజ్యసభ, స్థానిక సంస్థలలో వీరికి స్థానములను ప్రత్యేకించాలి. పేరు చివర కుల సంకేతముల వాడకమును శాసనము ద్వారా

నిషేధించాలి. సమాజము కాల ప్రవాహమును, పరిణామమును సకాలములో అందుకొనలేక పోతే, సగోత్రీ కుల వివాహము చేసికొనరాదని సాంఘిక నియమమున్నట్లుగనే ఒకే కులములో జరిగిన వివాహము చెల్లనేరదని శాసనము చేయాలి. Marriage with in the cast must be invalidated. నిన్న గుంటూరు సభలో గోరా గారు చేసిన ఈ సూచనతో నే నే కీభవిస్తున్నాను.

ఇంత కాలమీ సమస్యపై జనం నొక్కిపెట్టక పోవుటకు మరొక కారణముకూడ కనిపిస్తున్నది. ప్రపంచ సమస్యలతో పోల్చి చూచుకున్నప్పుడు కులమనునది భారతదేశములో, అందునా హిందూమతములోగల సమస్యగా భావించబడి యుండ వచ్చును. అందుచేత పెద్దపెద్ద రాజకీయములు మాట్లాడుట అలవాటు పడిన చిన్న చిన్న వాళ్ళు కూడ కులమునొక సమస్యగ తీసికొనరు - తీసికొన్న వారిని అవహేళన చేస్తారు.

నేడు కులసమస్య తీవ్రత ముదురు పాకములో పడింది. ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి దీనికి రాజకీయముగ కొంత పరిష్కార మార్గము (Solution) చూపించగలరన్న ఆశ హెచ్చు జనాంగములో నున్నది. ఆర్థిక, అధికార పంపిణీలు అవసరమైన బలవంముగనైన జరిపించగలరన్న భావము ప్రజలలో కనిపించుచున్నది. సమానస్థాయి సంఘ నిర్మాణ మునకిది ఉపయోగపడచ్చును.

ఈ సందర్భమున సుప్రసిద్ధ రచయిత, మానవతావాది, ఆలోచనాపరుడు కీర్తి శేషులు ఆవుల గోపాలకృష్ణమూర్తిగారి సూక్తులు రెండు ఉదహరించుట అప్రస్తుతముకాదు.

"మన దేశములో వివాహ చక్రములో కులతత్వము పేరుకొని కరుడుగట్టినది. మనము దానిని బ్రద్దలు చేయాలి. లేక పోతే సాంప్రదాయ బద్ధమైన సాంఘిక శృంఖలాలనుండి మనకు విమోచనలేదు.

"మతతత్వము కులతత్వమును దింపింది. పెండ్లివ్యవస్థలో అది కుదురుకొన్నది. వ్రేళ్ళుతన్నినది. ఇది పునాదులతో కదిలి పోవాలి."

ఇవి A. G. K. మాటలు. చిరస్మరణీయములు. ఈ విషయమును వారు బ్రతికియుండగ వారి ఇంటిలో అమలు జరుపలేక పోయారు. ఇక్కడ సమావేశమైన చాలమంది ఆచరణలో అంతకన్న ముందుకు పోలేక పోవచ్చును. అయినా ఎవరి శక్త్యానుసారము వారు విరమింపబడక కొనసాగించవలసిన ప్రచారము - అనుసరించవలసిన మార్గము.

ఈ సమస్య పెద్దవారిది కానేకాదు. పిల్లలది. వివాహము కావలసిన యువతీ యువకులది. ఇది విద్యలోనికి, విద్యాలయములోనికి, విద్యార్థులలోనికి ప్రాకాలి. అందుకు తగిన కృషి జరగాలి.

కులవ్యవస్థ పోషణకు దోహదమిచ్చుచున్న పాతసాహిత్యమును పరిశీలించి, పనికిమాలిన ప్రమాదకర విషయములు ప్రచురితము కాకుండ ప్రజలు. ప్రభుత్వము జాగ్రత్తపడాలి. ఉదాహరణకు భాగవతం - కుచేలో పాఖ్యానములో -

దేవదేవుఁడఖిల భావజ్ఞుఁడాశ్రిత
నందుఁడయిన హరికి ధరణి సురులు
దైవతములుగాన, ధారుణీదివిజుల
కంటె దైవమొకడు గలడె భువిని.

అని యున్నది. ఇదియెంత దారుణమైన ప్రబోధము. ఈ భాగములను నిషేధించాలి.

పుణ్యము రావాలి - అందుకు దానము చేయాలి - అందుకు దరిద్రులుండాలి. కులము మెరుగుపడాలి - అందుకు కులసౌకర్యములుండాలి - అందుకు కులములుండాలి. ఇది మన అభిమతము, నడవడిక కాకూడదు. అందరు "మనుష్యుల" మనుకొను సంఘము నిర్మించబడాలి.

నాకీ అవకాశమునిచ్చిన జంట కార్యకర్తలు సీతారామచ్యుతరాంగార్లకు - ఇంతతడవు ఒపిగ్గా విన్న పెద్దలకు మరొకసారి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. సీతారాముడన్నా అచ్యుతరాముడన్నా, ఒకే మూర్తి నీడలు గనుక గురజాల సీతారామయ్యగారిని, పరుచూరి అచ్యుతరాంగారిని జంట కార్యకర్తలన్నాను.

# డాక్టర్ అంబేద్కర్

# సాంఘిక తత్త్వము

## డా॥ బి. ఆర్. అంబేద్కర్ తత్త్వవిచారణ

## ప్రారంభ సభ

ది 14-4--1972 శుక్రవారం సా॥ గం. 5-30 లు విజయవాడ

అగ్రాసనాధిపా ! సహృదయ సభాసదులారా !

బాబాసాహెబ్ డా॥ అంబేద్కర్ 82 వ జన్మదినోత్సవమును పురస్కరించుకొని మిత్రులు అంబేద్కర్ సాహితీ విహార్ - విజయవాడ వారు ఈ సభను యేర్పాటు చేశారు. పెద్ద యెత్తున సంవత్సరం పాటు జరుగనున్న తత్త్వవిచారణ సభల కిది నాందిగా సమావేశ కర్తలు కరపత్రములో పేర్కొన్నారు. నా కీ ప్రథమ సభలో పాల్గొను అవకాశమును కల్పించారు. వారికి నా ధన్యవాదములు.

"అవకాశము లభించినప్పుడల్లా మానవుడు
ఉపకార గుణమో - ఉత్తమ కార్యసాధనో
ఉత్సాహంతో పరుల కందించాలి - అందించే
అలవాటును ప్రయత్న పూర్వకంగానైనా చేసుకోవాలి."

ఆ ప్రయత్న ఫలితముగానే ఇంతటి విద్వత్సభలో ప్రసంగించుటకు అంగీకరించాను - కాదు సాహసించాను.

ఇంతవరకు నడుస్తున్న కాలంలో చిన్నవాళ్ళకు అవకాశములు రావటం

అరుదు. నాకు రాజకీయం లేదు. ఆర్థికంగా, అధికారికంగా చిన్నవాణ్ని. పండిత వ్యాఘ్రాన్ని, కవి వృషభాన్ని కాదు. అగ్రవర్ణస్థుడను కాదు. అయినా, నా కీ సభలో పాల్గొను అవకాశమిచ్చారు. నా మనుగడ కిది ప్రోత్సాహంగా భావిస్తున్నాను.

తన "జీవిత జ్యోతులు" లో అన్నాడు - సాంఘిక సేవా రంగములో అగ్రగామిగా నిలచిన మిత్రుడు కీర్తిశేషులు అల్లంమాణిక్యాలరావుగారు -

"ఉత్తమ గ్రంథాలు చదివితే జ్ఞానం లభిస్తుంది
ఉత్తమ వ్యక్తుల స్నేహంలభిస్తే ఉత్సాహం వస్తుంది
ఉత్తమ మానవుని జీవిత చర్యలు పరికిస్తుంటే
ఉత్త మోత్తమ అనుభూతులు అందుతుంటాయ్."

అని అన్నారు.

డాక్టర్ అంబేద్కర్ సాహిత్యమును నేను కొద్దిగ చదివాను. 22 సంవత్సరాల క్రితం వారితో నాకు స్నేహము కూడ వున్నది. Ofcourse, it is a pen friendship - కలం స్నేహం. 1950లో ఆంధ్ర ప్రాంతములో కొంగ్రొత్త వృత్తి సంఘము లేర్పడి బలము పుంజుకుంటున్న రోజులవి. అంబేద్కర్ కేంద్రములో న్యాయశాఖ మంత్రిపదవికి రాజీనామా యిచ్చి ఖాళీగా వుంటున్నాడని జ్ఞాపకం. ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన జాతుల సంఘ వ్యవస్థాపకులలో ఒకరు స్వర్గీయ పలకలూరు నారాయణ గారి ప్రోద్భలముతో, వచ్చీరాని ఇంగ్లీషులో ఒక పావుతావుమీద అంబేద్కర్ గారికి మేము ప్రారంభించిన ఉద్యమమునకు మీ తోడ్పాటేమిటని లేఖ వ్రాశాను.

స్వర్గము మీద నమ్మకములేని చచ్చిపోయిన మాణిక్యారావుకు ముందు "కీర్తిశేషుడు" స్వర్గముమీద నమ్మకమున్న చచ్చిపోయిన నారాయణకు ముందు "స్వర్గీయ" పదములను నేను కావాలని పలికాను.

నేనప్పుడు పేరుకు ఇంటర్మీడియెట్ విద్యార్థిని. చేయుచున్నది వృత్తి సంఘములు నడుపు పత్రికలలో పని. ఢిల్లీ నుండి 4వ రోజుకు ప్రత్యుత్తరము వచ్చినది. 1/6th డెమ్మీ సైజు బాండు పేపరు లెటర్ పాడ్ కాగితములపైన 4 పేజీలు అంబేద్కర్గారు స్వదస్తూరితో వ్రాసిన ఉత్తమది. భావములంతటి ఉన్నతముగ,కన్నుల విందుగ వున్న చక్కని దస్తూరి వారిది, ప్రధమముగ వారి డిగ్రీలను ఆ Letter pad పైన, M. A., ph. D. (London); L. L.D. (Columbia); D.Sc; D.Lit. (Usmania) Bar-ar. Law అనిచూచాను. ఒకే వ్యక్తికి ఇంతటి పెద్దవైన ఇన్ని డిగ్రీలు వుండటము నదే మొదటిసారిగ చూచాను. అంతటి పెద్ద వ్యక్తి నాకు స్వదస్తూరితో అంతటి పెద్ద ఉత్తరమును వ్రాయుట నాకు ఆశ్చర్యమును కలిగించింది. ఆ ఉత్తరమును జేబులో నిడుకొని సంవత్సరంపాటు కనిపించిన మిత్రునికల్లా చూపిస్తూ వుండేవాడను. బహుశః నేను నే నూహించుకుంటున్నంత సామాన్యుడను కానేమో ! కొంత అసామాన్యతలేకపోతే నవభారత రాజ్యాంగ నిర్మాత నా కింత పెద్ద ఉత్తరం వ్రాస్తాడా? అను ఒక విధమైన "అహము" నన్నావరించినది. కాల పరిణామ దశలో ఒకడుగు ముందు నిలువగలుగుటకు నా కీ ఉత్తర మిచ్చిన ప్రోత్సాహము అనన్యసామాన్య మైనది. ఈ రకముగ డాక్టర్ అంబేద్కర్ తన రచనల వలన, స్నేహమువలన, శీలమువలన, వ్యక్తిత్వమువలన కొన్ని కోట్ల మందిని ప్రభావితులను చేశారు.

డాక్టర్ అంబేద్కర్ బహుభాషా కోవిదుడు - మహా పండితుడు - మేధావి - రచయిత - వక్త -కర్తవ్యపరాయణుడు - కార్యసాధకుడు - కరుణామయుడు. వారి చెట్టంత శరీరము, చెరువంత గుండె.

డాక్టర్ అంబేద్క ర్ నవభారత రాజ్యాంగ నిర్మాతగ ప్రపంచముకు తెలుసు. కాని ఆయన రాజ్యాంగ రచన కన్న మిక్కిలి శ్రమించి చేసిన పని

మరియొకటున్నది. అదే భారతజాతి పునర్నిర్మాణము జాతి నిర్మాతగ వారి నేరు మరుగున పడినది. లేకపోతే, గాంధీ, నెహ్రూ బొమ్మలతో పాటు అంబేద్కర్ విగ్రహములు కూడ వాడ వాడలా ప్రతిష్ఠింపబడి వుండేవి. విగ్రహములు ప్రయోజనకారి కాకపోయినా, ప్రజా విశ్వాసమునకు ప్రతిబింబములు.

ఇటీవల కాలములో భారతదేశములో భావవికాసమునకు, ఆలోచనా క్రమమునకు ఆనుపానుల నేర్పరచినవారు ఇద్దరే వున్నారు. వారిలో ఒకరు యం.యన్. రాయ్, రెండవవారు బి. ఆర్ అంబేద్కర్ ఇందులో ఎవరు ప్రథములైనా, ఎవరు ద్వితీయులైనా మనకు ఇబ్బంది లేదు. వీరిద్దరు విశ్వమానవుల కోవకు చెందిన మనీషులు. వారి హేతువాద దృష్టిని, మానవతా వాదము నలవరచుకొని, మననము చేయవలసిన అవసరము మన కిపు డెంతైనను వున్నది.

శ్రీ నార్లవారన్నట్లు అంబేద్కర్ తన కాలమున కన్న ముందుగా పుట్టాడు. వారి కాల మిపుడు ప్రారంభమైనది. అంబేద్కర్‌ను గురించి ఆలోచించువారి సంఖ్య నేడు దేశములో పెచ్చుపెరిగింది. అద్యతన భావిలో ఈ ఆలోచన ప్రపంచమంతా ప్రాకినను మన మాశ్యర్యపడవలసినదిలేదు. మత మౌఢ్యము పోవుటకు, కులజాడ్యము నిర్మూలింపబడుటకు, ఆర్థిక అంతస్థులు తగ్గుటకు, రాజకీయ అసమానతలు తొలగుటకు మనము విధిగా అంబేద్కర్ అనుభవములను ఉవాచలను ప్రమాణముగ తీసికొనుస్థితికి వచ్చాం.

నన్నీ రోజున డాక్టర్ అంబేద్కర్ సాంఘిక తత్వమును (Social philosophy of Dr. Ambedkar) ప్రధాన విషయముగ తీసికొని మాట్లాడమన్నారు. అంబేద్కర్ పరిశోధన ప్రకారము మొదట బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య యను మూడు వర్ణములే వుండెడివి. తరువాత ఋగ్వేదములోని పురుష సూక్తములో నాల్గవ వర్ణమైన శూద్రులను చేర్చారు. అటుపైన మను

ధర్మశాస్త్రములో పంచములను చేర్చారు. ఇట్లా మానవులలో తెలివితోపాటు మూర్ఖత్వము, స్వార్థము పెరిగి, సమాజము ననేకానేక కులములుగ చీల్చారు. క్రింది కులములవారికి బానిసవృత్తులు కల్పించి పై కులముల వారు సర్వభోగముల ననుభవించారు.

భారతదేశములో సాంఘికమనునది ఆర్థికమునకన్న, రాజకీయమునకన్న ప్రధానమైనదిగ డాక్టర్ అంబేద్కర్ భావించారు. హిందూ సంఘములోని సర్వరోగములకు పునాది కులవ్యవస్థ అని నిర్ధారించుకున్నాడు. హిందువుగ వుండి హిందూ మతమును సంస్కరించుట అసంభవమని తీర్మానించుకున్నాడు. చివరిలో బౌద్ధుడుగా మారుటకు చరిత్రాత్మకమైన నిర్ణయము తీసికొని అమలుజరిపాడు.

హిందూ మతములో చాల లోపములున్నవని యెన్నడో గ్రహింపబడినది. బ్రహ్మ సమాజము, ఆర్యసమాజము వంటివి ఉద్భవించి బాల్యవివాహములు, సతీ సహగమనము, స్త్రీ వితంతువులకు పునర్వివాహము, పునర్వికాసము లేకపోవుట, విగ్రహారాధన వంటి వాటిని నిర్మూలించి హిందూమతమును సంస్కరించుటకు పెద్దలు ప్రయత్నించికృతకృత్యలయ్యారు. దీనివలన పై వర్గములవారికి అవసరమైన మేరకు హిందూ మతము సంస్కరింప బడినదే తప్పనీచాతి నీచమైన కులవ్యవస్థసడలలేదు. అస్పృశ్యులుగచూడ బడిన హిందువులు, హిందూదేవతలను ఆరాధించినా వారికి హిందూదేవాలయములలోనికి ప్రవేశము నిషేధించబడినది. వీరు సాంఘికమైన, మత సంబంధమైన పౌరసత్వ హక్కుల నుండి దూరము. చేయబడ్డారు. మానవులలో ఒక వర్గమును కనరాని వారుగ, వినరాని వారుగ, మాట్లాడరాని వారుగ చిత్రించి వెలివేశారు. చివరకు క్రైస్తవ మిషనరీలు కూడ అస్పృశ్యులనబడుచున్న వారి అమాయికత్వమును ఆలంబలనగ చేసికొని తమ

ప్రధానలక్ష్యములయిన వ్యాపరాభివృద్ధికి, మతవ్యాప్తికి ఇండియాలో చోటు చేసికొన్నారు. బ్రిటీష్ వారు మనదేశమును వదలి వెళ్లేవరకు క్రైస్తవ మిషనరీలు మనదేశములో కదంత్రొక్కుతున్న కులాధిపత్యమును, ఆర్థిక దోపిడీని, రాజకీయ బానిసత్వమును పోగొట్ట లేక పోయారు.

ఇటువంటి కుళ్ళు సమాజములో అంతర్భాగముగ నున్న క్రింది తరగతి (కడగొట్టు) కులములో జన్మించిన అంబేద్కర్ తన జీవితములో విపరీతమైన మానసిక హైన్యతకు గురి అయ్యారు. అడుగడునా నిప్పులతో చెరలాట లాడారు. కులం పోవాలని పరితపించాడు. డబ్బున్నా, గుణమున్నా, విద్యవున్నా, ఉద్యోగమున్నా చివరకు అధికార మున్నా సంఘంలో కులం పేరుతో నీచముగ చూచు స్వభావము పోవుటలేదు. ఎందుచేత? దీనికి గల కారణములను కనుగొనుటకు అంబేద్కర్ విపరీతముగ ఆలోచించాడు, పరిశోధన ప్రారంభించాడు.

రాముడిది ఒకే బాణ మంటాం. అయినా కిటుకు తెలిసేవరకు రావణాసురుడు చావలేదుగదా ! అంబేద్కర్ పరిశోధనలో కులముయొక్క జీవం హిందూ మతములో, కనుపించని దేవుడిలో, దేవభాష సంస్కృతములో, భారతీయుల దైనందిన జీవనములో సమ్మిళతమైవున్నట్లు తేలింది. కంటకావృతమైన ఈ మార్గమును బాగుచేయుటకు జీవితమును వెచ్చించుటకన్న మంచిదైన మరొక మార్గమున గమించుట మేలని నిర్ణయించుకొని బౌద్ధమును స్వీకరించారు.

బౌద్ధదర్మ యొక్క ఆవశ్యకత ప్రపంచమును పునర్నిర్మించుట కవసర మంటాడు అంబేద్కర్. బౌద్ధదమ్మలో మానవుని సర్వతోముఖాభివృద్ధి, సాంఘిక జీవనాభివృద్ధి ఇమిడియునవని వారి నమ్మకము. మానవుడు సుఖముగ, మంచిగ జీవించుటకు పనికివచ్చు ప్రజ్ఞ లేక అవగాహన (understanding) కరుణ

లేక భూతదయ (Love) మరియు సమత (equality) బుద్ధిజములో నున్నవని అంబేద్కర్ ప్రబోధము చేశారు.

అంబేద్కర్ సిద్ధాంతము ప్రకారము ఆత్మకు పునర్జన్మలేదు. ఆత్మ మరణానంతరము అనంతశక్తి (energy) లో కలసిపోతుంది, పంచభూత నిర్మితమైన పదార్థమునకు, అనగా శరీరమునకు మరణానంతరము మరొక రూపము వస్తుంది.

మానవుని విశేషశక్తులపైన అంబేద్కర్‌కు అచంచల విశ్వాసము. నిరుపేదలు, బలహీనులు, నిస్సహాయులు అయిన వారిపైన అంబేద్కర్‌కు కరుణ అధికము.

వ్యక్తిగతమైన దైవపూజను, పూజీ విధానమును అంబేద్కర్ తిరస్కరించారు. అందుకు వారు చూపిన కారణములివి - దేవునిలో నమ్మకము పూజారిపై నమ్మకమునకు దారితీస్తుంది. పూజారి యనువాడు సంఘములో విజ్ఞాన వంతమైన వేరుపురుగు. పూజారి మూఢ విశ్వాసమును కలిగిస్తాడు. వ్యక్తిలో సరియైన దృక్పధము పెరగకుండ వమ్ముచేస్తాడు. అందువలన దేవునిలోని నమ్మకము ప్రయోజనకారి కాదు. అసలు దేవుని వునికే లేదు.

బౌద్ధము దేవునకు, మానవునకు వున్న సంబంధముపైన కేంద్రీకరింపబడియున్న మతము కాదు. బౌద్ధము మానవునకు మానవునకు మధ్య గల అనుబంధము, అవగాహన ఆధారముగ గల మతము. బుద్ధుని విష్ణావతారములలో చేర్చుట తప్పు. ఆయన మానవతను గుర్తించిన మనీషి.

పరిజ్ఞానము లేక వివేకము (Knowledge), మంచి మార్గము (Right path), భూతదయ (Compassion) అని త్రివిధములుగ బుద్ధుడు బోధించిన మౌలిక సూత్రములు ఆదర్శముగ తాను శేషజీవితమును గడుపుతానని అంబేద్కర్ అన్నారు.

ఆకలిమైనవానికి కళలతో, ఆనందముతో పనిలేదు. సాంఘిక బాధితునకు రాజకీయమైన అధికార మక్కరలేదు. అందుచేత ముందు సమాజమునకు సాంఘిక న్యాయము చేకూరాలి. వెనుకబడిన తరగతులవారు ఆధ్యాత్మికమైన సంతృప్తికన్న బౌతికమైన, క్రియాత్మకమైన మంచిని కోతరుకోవాలని బాబాసాహెబ్ ప్రబోధించాడు.

స్వరాజ్య పోరాటము ముమ్మరముగ సాగుచున్న రోజులలో కూడ రాజకీయ దాస్యవిముక్తి, సాంఘిక దాస్య విముక్తి - ఈ రెంటిలో యేది ప్రథమము, యేది ద్వితీయమనుమీమాంస వచ్చినది. అందులో అంబేద్కర్ మనకు సాంఘిక దాస్యవిముక్తి ప్రధానమని, గాంధీజీ రాజకీయ దాస్య విముక్తి ప్రధానమని వాదించారు. సనమాజములో స్వరాజ్యపోరాటములో గాంధీగారి కున్న అంగబలము, అర్థబలము హెచ్చు గనుక రాజకీయ దాస్య విముక్తి ప్రధాన ఆశయముగ అందరు కలసి కృషి చేశారు.

హరిజనులకు జనాభానిష్పత్తి మేరకు ప్రత్యేక నియోజకవర్గములు (Seperate Electorate) వుండాలని అంబేద్కర్ పట్టుబట్టారు. (Seperate Electorate) అనగా హరిజనుల ఓట్లతోనే హరిజనులు యెన్నుకొనబడాలి. గాంధీ అనుయాయుల అడ్డంకువలన తన పట్టుదలను కొంత సడలించుకొని Reservations పద్ధతిలో అందరి ఓట్లతో హరిజనులే యెన్నుకొనబడవలెనను దానికి (General Electorate) అంబేద్కర్ అంగీకరించవలసి వచ్చినది. దీని వలన కులస్వాముల చెప్పుచేతలలో వుండువారు తప్ప వ్యక్తిత్వముగల హరిజన ప్రతినిధులు గెలుపొందుటకు వీలుండదని అంబేద్కర్ వాదన. ఇప్పుడది నిజమని ఆచరణలో మనం గమనించాలి. ఈ సందర్భమును పురస్కరించుకొని అంబేద్కర్‌గారన్నారు - ॥ మనకు కొద్దిగా రాజకీయాధికారము వస్తున్నది. దానిని మనము

సద్వినియోగము చేసికొనలేమోనన్న  భయము నన్నావరిస్తున్నది. వచ్చిన అధికారమును దుర్వినియోగము చేసికొనిన మనలనీబాధ లెన్నటికీ వదలి పెట్టవు." అని.

ఇప్పుడీ విషయమై మనము మరికొంత ముందుకు పోయి ఆలోచించాలి. అంబేద్కర్ ను వేధించిన సాంఘిక సమస్యలు ఆనాడున్నంత జటిలముగ ఈ నాడులేవు.  వారు చెప్పిన "సాంఘిక సమత" ప్రాతిపదికగ మనము అభివృద్ధికరమైన, ప్రగతిశీలకమైన ఆలోచనలను చేయాలి. మావుడు మౌలికముగ ఆలోచనాపరుడు గనుక మన ఆలోచనలను మనము చేస్తూనే వుండాలి.

మొత్తము జనాభాలో 5వ వంతుగ వున్న హరిజనుల లేదా అస్పృశ్యులుగ పరిగణింపబడిన వారి సమస్యలనే అంబేద్కర్ తీసికొన్నారు.  వారికి మాత్రమే రాజ్యాంగములో రక్షణ కల్పించారు. విద్యలోను, ఉద్యోగములలోను, రాజకీయాధికారములోను దాదాపు తమ నిష్పత్తిని పంచుకున్నారు. ఇది ముదావహమైన సంగతి. అయినప్పటికి హరిజనుల కింకా తమ కాళ్ళపై తాము నిలబడగల తాహతురాలేదు. పై అంతస్థులోనివారి దయాధర్మ భిక్షే వీరికింకా రక్షగా వున్నది. ఈ తీరు నిపుడు మనమే మార్చుకోవాలి.

మన ఆంధ్రప్రదేశ్‌లో 92 వరకు గల ఇతర వెనుకబడిన తరగతులను, హరిజనులను కలిపి మరికొంతకాలం కృషిని సాగించాలి. ఈ వెనుకబడిన తరగతులకు రాజ్యాంగములో రక్షణ లేదు ప్రజలలో ఆదరణ లేదు. ఎవరికి వారినిగా చూస్తే మొత్తము జనాభాలో అత్యంతమైన అల్పసంఖ్యాకులు. ఇప్పుడు అల్పసంఖ్యాకులు (Minorities) అని వాడుకలో నున్న పదము మతరీత్యా అల్పసంఖ్యాకులైన క్రైస్తవులు, ముస్లిములు మొదలగువారికి మాత్రమే వర్తిస్తుంది. ఆలనా పాలనా లేని వెనుకబడిన తరగతులవారి గతి అధోగతిగా వున్నది.

హరిజనులు గిరిజనులు, వెనుకబడిన తరగతులు, అల్పసంఖ్యాక వర్గములు కలసి కృషి చేస్తే తప్ప అంబేద్కర్ ఆశించిన సాంఘిక న్యాయము, రాజకీయ భాగస్వామ్యము వీరికి సమకూరవు.

మనకు రిజర్వేషన్లు వుండాలి, మన అభివృద్ధికి మరెవరో కృషిచేసి పెడతారన్న భావము మనలో యెంత త్వరగా నశిస్తే అంత త్వరగా మనలోని స్వీయశక్తులను ప్రజ్వలింప జేసికొన గలుగుతాం. రిజర్వేషన్ల పద్ధతి మన శ్రమను కొంత తగ్గిస్తుందేమో తప్ప మన అభివృద్ధికి పూర్తిపరిష్కార మార్గము కాదు. ఒక విధముగ చూస్తే మన పట్టుదలను సడలింపజేయు పనికిమాలిన పద్ధతి. మనలో చేయలేనప్పుడు, చేతగాని తనమున్నప్పుడీ పద్ధతికి ఆందోళన చేశాం. ఇప్పుడు చేవగలిగిన వారుగ, చేతనైనవారుగ, బహుజనము కలిగిన వారుగ క్రింది తరగతి ప్రజలు ఋజువు చేసికోవాలి. భూదానోద్యమము భూసంస్కరణల వాదనలోని తీవ్రతను తగ్గించి నట్లు పరుల దయాధర్మ భిక్షపై ఆధారపడు రిజర్వేషన్ల పద్ధతి స్వీయ శక్తులు ప్రకోపింపకుండ అణార్చివేస్తుందని నా అభిప్రాయము.

సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయము, - భావనా, వాక్కు, విశ్వాస స్వాతంత్ర్యము - స్థాయి, అవకాశముల సమానత - వ్యక్తి గౌరవము, జాతి సమైక్యత కాపాడు సహోదరభావము భద్రముగ నుండుటకు ఆదర్శ సంఘములో ప్రతి మనిషికి కలిగించాలని అంబేద్కర్ ఆశించారు. రాజ్యాంగము ఉపోద్ఘాతాము (Preamble) ఈ విషయమును పొందుపరచారు.

విశ్వమన మనకు కనిపించు పదార్థము. ఇది అనంతమైనది. ఒక ఆకారమునుండి మరొక ఆకారములోనికి మారుట పదార్థ లక్షణము. దీనిని దేవుడు పుట్టించుటగాని, గిట్టించుటగాని వుండదు. Matter can neither be created nor destroyed. ఇది ప్రకృతి పరిణామ సిద్ధాంతము. నీరు కాచిన ఆవిరి అవుతుంది. ఆవిరిని చల్బచిరచిన నీరు అవుతుంది. గాలిని

వత్తిడిలో పెడితేశక్తి పుడుతుంది. కట్టెను కాలిస్తే మంట జనిస్తుంది. ఇటులనే ప్రతిదీ.

భగవంతుడు సృష్టికర్త, పరిపాలకుడు అనునది ఆధారరహితము. అంతా భగవద తత్త్వమయితే మనిషికి మిగులునది లేదు. నీతి దైవసంబంధము కాదు - మానవ పరిధిలోనిది. విశ్వాసపాత్రులను ఆలోచనాపరులుగ, పూజారులను కృషీవలురుగ, మాధవ సేవను మానవ సేవగ మార్చుకొని పశువాదము, దైవ వాదము స్థానములో మానవ వాదమును తీసికొని రావాలి. కర్మవాదులు చెప్పినట్లు దేవుడి చేతిలోగాని, కమ్యూనిష్టులు చెప్పినట్లు ప్రకృతి చేతిలోగాని మానవుడు కీలుబొమ్మ కారాదు. వ్యక్తి త్వము, వ్యక్తి స్వేచ్ఛ అన్ని ప్రగతులకు మూలము. కులము పోవుటకు వర్ణాంతర వివాహములు సుళువైన మార్గము. కాలము మారినపుడు ఆశయ సిద్ధి జరుగుతుందని అనుకుంటే యెవరుగాని హడావుడి పడవలసిన పనిలేదు. త్వరితగతిని సదాశయములను సాధించవలెనన్న మనుషులు మస్తిష్కములను మరమ్మత్తు చేయాలి - దారితో పాటు అధికారమును చేపట్టి అనుకూలమైన శాసనములను చేయాలి. ఈ మాటలు చెప్పిన మాననీయుడు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్‌కు మానవాళి తరపున నివాళి సమర్పిస్తున్నాను.

నాకీ అవకాశము నిచ్చిన సమావేశకర్తలు మిత్రులు బి. కొమ్మెర్ల, తాళ్లూరి చిత్తరంజన్ దాసు, రాయలుగార్లకు శ్రద్దగావిన్న సభాసదులకు మరోకసారి అభినందనలు తెలుపుతూ ఇప్పటి "కవిరాజు" కొండవీటి వేంకటకవిగారు అప్పటి సంఘ సంస్కర్త బ్రహ్మంగారిపైన వ్రాసిన పద్య మొకటి చదివి నా ప్రసంగమును ముగిస్తాను.

"కులదేవతలకు గజ్జెలుగట్టి యాడించి
పాడించుచున్నంత బలుకునాడు
మత పిశాచములు మార్మసలి నెత్తురుద్రావి
తృప్తితో గఱ్ఱున ద్రేపునాడు
ఆచారమను మారి అట్టెత్తి హెచ్చు త
గ్గులు కొల్పి ప్రాణాలు కొఱుకునాడు
కట్టుబాటులకు లొంగని కులమ్ములబట్టి
ఉద్రేకమున తాటలొలుచునాడు
దివ్యబోధల మాల, దూదేకులకిడి
జాతి, మతములులేక భోజనము మెసవి
కుల, మతాచారములను హక్కులను దుల్చు
వీరగువర్య ! మానమస్కారమార్య !"

Educate - Agitate - Organise.

# వృత్తి సంఘములు - ఉద్యోగులు

## రజక ఉద్యోగుల సంక్షేమ సంఘ

## వార్షికోత్సవ సభ

ది 2-7-1972 ఆదివారం హైదరాబాదు

అధ్యక్షమహాశయా ! వేదికపై ఆసీనులైన పెద్దలార ! మిత్రులార ! ఇప్పటివరకీ సభలో పాల్గొనిన ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి గౌరవనీయులు పి.వి. నరసింహారావు, ఆర్థిక మంత్రి అనగాని భగవంతరావు, తదితర మంత్రులు అత్యవసర పనిమీద వెళ్ళిపోవుట - నాకు కొంత నిరుత్సాహమును కలిగించినది. వారికి నేనుగ మనవి చేయదలచిన విషయములను తీర్మానముల రూపములో అందజేయగలరని ఆశిస్తున్నాను.

అసలు మన గొడవ మనకు అర్థమయితే ఇతరులకు అర్థమగునట్లు చెప్పుట, చేయుట తేలిక. కాబట్టి నేను చెప్పబోవు విషయములను సభాసదులు, రెవిన్యూ డివిజనల్ ఆఫీసరు గంగుగారి వంటి ఉన్నతోద్యోగులు శ్రద్ధగా ఆలకించి, అర్థము చేసికొనవలసినదిగా కోరుచున్నాను.

ఇది ఆంధ్రప్రదేశ్ రజక ఉద్యోగుల సంక్షేమ సంఘం వార్షికోత్సవ సందర్భమున యేర్పాటు చేయబడిన సభ. ఈ సంఘము నేను, నాతోపాటు సూర్యనారాయణ, వి. భద్రయ్య మరికొంతమంది మిత్రులు ఐదారు సంవత్సరములుగ చేయుచున్న ఆలోచనలకు, సమాలోచనలకు రూపకల్పన.

రజకుల, ఉద్యోగులు, సంక్షేమము, సంఘము అనునాలుగు పదముల సమన్వయమే ఈ సంఘము. అందుచేత సమాజములో ఈ నాలుగు పదముల

కున్న స్థానమును స్థాలీపులకముగానైన ఇక్కడ చర్చించుట, ఆ సంఘ సమస్యలకు తోచిన మేరకు పరిష్కార మార్గములను సూచించుట అవసరముగ, నా బాధ్యతగ భావిస్తున్నాను.

ఈ సంఘము పేరుతో వ్యవహరించు కార్యకర్తలు మన ప్రజాస్వామిక రాజ్యములో ప్రజలనుండి ప్రభవించు ప్రశ్నలకు సమాధానము చెప్పుకొనవలసిన అవసర మేర్పడుతుంది. ఈ సందర్భముగ ముసుగులో వున్న విషయములను, తెరమరుగున జరుగుచున్న కథలను విడమర్చి చెప్పుకొనుట, హృదయము విప్పి మాట్లాడుకొనుట, మెదడుతో ఆలోచించుట జరగాలి. ఇది జరగకపోతే ఈ సంఘము నేర్పాటు చేసికొనవలసిన అవసరము లేదు.

మాటలలో అన్ని సంఘముల నిర్మాణమున కంగీకరించుచున్న పెద్దలు, ప్రభుత్వము వ్రాతలలో, ప్రధానముగ చేతలలో వర్గసంఘములను గుర్తించుట, వృత్తి సంఘములను నిరసించుట జరిగింది. ఇక్కడ "వర్గములు" అంటే ప్రాయికముగ కార్మిక సంఘములు, ఉద్యోగుల సంఘములు, హరిజన - గిరిజన సంఘములు. ఇటీవల మైనారిటీ వర్గముల క్రింద క్రైస్తవులు, ముస్లిములకు కూడ గుర్తింపు వచ్చినది. ఉద్యోగుల సంఘములో ఉపసంఘములుగా వున్న ఉపాధ్యాయుల సంఘమునకు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘమునకు కూడ సముచితస్థానము కల్పించబడినది. ఈ వర్గసంఘము అన్నింటికీ సూత్రప్రాయముగ నైన పరిపాలనా యంత్రాంగములో భాగస్వామ్యము కల్పించబడినది. అదే గుర్తించిన దానికి గుర్తు.

ఇక "వృత్తి సంఘము" లంటే రజక, నాయీ బ్రాహ్మణ, మహేంద్ర (మేదరి) కమ్మరి, శాలివాహన (కుమ్మరి), పల్లెకారి, విశ్వబ్రాహ్మణ, గౌడ, యాదవ, చేనేత ఇత్యాది 92 కులములు. ఈ 92 కులముల జాబితాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము నియమించిన అనంతరామన్ కమిటీ తయారు చేసినది.

భారతదేశములో వున్న అనేక వృత్తులలో వ్యవసాయ మొకటి. ఇది హెచ్చుమంది అవలంబించుచున్న వృత్తి. కలిగినవారు భాగస్వాములుగ వున్న వృతి గనుక దీనికి జాతీయ స్థాయిలో గుర్తింపు నిచ్చారు. వ్యవసాయ వృత్తిదారుల ఉపయోగార్థము ప్రత్యేక కళాశాలలే కాక ఒక విశ్వవిద్యాలయమునే నెలకొల్పారు. వ్యవసాయము వృత్తిగా గలవారి కీ ఉదయ మొక ఇబ్బంది వస్తే, వారి చేతిలో ఒక మొక్కకు జబ్బుచేస్తే, సాయంత్రమునకు వాటి పరిష్కార మార్గము ఆకాశవాణిలో ప్రసారిత మౌతుంది. సహాయ కార్యక్రమమును ప్రభుత్వము రూపొందిస్తుంది. ఈ వ్యవసాయమునకు సంబంధించిన భూమి సమాజము మొత్తములో చూస్తే సగముకన్న తక్కువమంది అనుభవములోనే వున్నది. అయినా జాతీయ స్థాయిలో దాని పెంపుకు బాటను వెలార్చుతునారు. ప్రజల ప్రధాన అవసరమైన ఆహారమునుత్పత్తి చేయుటపై ఆ మాత్రము నొక్కి పెట్టు అవసరమే. కాని , ఇతర వృత్తులవారి ఇబ్బందుల నసలు పట్టించుకొనక పోవుట అన్యాయము. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము రజిక వృత్తి, తదితర చేతివృత్తులు గౌరవముగ, ఆర్థికతను చేకూర్చుకొనే విధముగ మనుటకు వలసిన పరిశోధనలు చేసి తగిన సూచనలు చేయవలసినదిగ విశ్వవిద్యాలయములకు ఆదేశము లివ్వాలి. వాటిని ప్రచారము చేయవలసినదిగ ఆకాశవాణి వారికి కూడ ఆదేశము లివ్వాలి.

ప్రభుత్వ సహకార వ్యవస్థ రూపాయి వున్నవాడికి రూపాయి అప్పు ఇవ్వటం ప్రాతిపదికగ యేర్పడియున్నది. రూపాయి లేనివారికి యెట్లా అప్పు లేదా సహకారము ఇవ్వాలి అనుదానికి ఆలోచనలు జరగాలి - ఆనుపానులు వేయాలి.

ఇది రజక ఉద్యోగులసభ గనుక - రజకవృత్తి దారుల బాగోగులను చూచుట ఈ సంఘ ధ్యేయములలో ఒకటి గనుక - ఇక్కడీ వృత్తిని గురించి రెండు మాటలుచెప్పుట అసందర్భమని నేను భావించుటలేదు.

మానవుని సలక్షణ జీవనయాత్రకు చాల వస్తువులు అవసరము. అందులో ప్రధానమైనవి రెండు - ఒకటి ఆర్థికము, రెండవది ఆరోగ్యము. ప్రాణమును పదిలపరచుట కవసమైన "అన్నము" కూడ ఆర్థికములో ఒక భాగమే.

ఏ వ్యక్తి స్థితినైన అడుగునపుడు, ఆ వ్యక్తి ఆర్థికముగా బాగున్నాడా? లేక చితికి పోయాడా? వారి ఆర్యోగము సరిగా వున్నదా? లేదా? అని అడుగుతాం. అంతేగాని ఫలానావాడు అన్నము తింటున్నాడా? అని అడగం అయినప్పటికి ఆహారమును పండించు రైతుకు "అన్నదాత" బిరుదు నిచ్చి అన్ని వసతులు కల్పిస్తున్నాం. ఆర్థికతను చేకూర్చుతున్న పారిశ్రామిక వేత్తలకు అంతకంటే హెచ్చు స్థాయినే కల్పిస్తున్నాం.

చాల సందర్భములలో ఆరోగ్యమును ప్రధానముగ చెప్పుకొని, ఆర్థికతను ద్వితీయముగ చెప్పుకొనుట కూడకద్దు. దాని పర్యవసానమే "ఆరోగ్యమే మహాభాగ్యము" అనునానుడి తెలుగు నేల నాలుగు చెఱగులలో సతతము ప్రతిధ్వనిస్తూ వుంటుంది. అట్టి ఆరోగ్యమును కాపాడు రజకుడు "ఆరోగ్య ప్రదాత" కూడా ? వైద్యవృత్తి వచ్చిన రోగము రహితమగుటకు తోడ్పడుతుంది అసలు రోగము రాకుండ వుండుటకు రజకవృత్తి తోడ్పడుతుంది.

నేను ప్రస్తుత ముంటున్నది తెనాలి "ఆంధ్రపారిస్" అని పేరుగాంచిన పట్టణము, ఆ పట్టణములో "చినరావూరు చెరువు"న్నది వర్షాకాలము ఆపట్టణములోని మురికి నీటితో చెరువు నిండుతుంది. సంవత్సరములో 8 మాసములు నీరు పసరుతో కూడుకొని మురుగువాసన కొడుతూ వుంటుంది. అది రహదారి ప్రక్కన వున్నది. చెరువు దాటువరకు ప్రయాణీకులు ముక్కుకు గుడ్డఅడ్డము పెట్టుకొని పోతూ వుంటారు. ఇక, ఈ నీళ్ళ దగ్గరకు వెళ్ళి పరిశీలించి చూస్తే, కంటికి కనపడేవి, కనపడనివి పరుగులు, సూక్ష్మజీవులు, లుకలుకలాడుతూ వుంటయ్. అంతటి అపరిశుభమైన నీటిలో తెల్లవారు

ఝాము గం. 4ల నుండి సాయంత్రము గం. 4ల వరకు తల్లి ప్రసవించిన రక్తపు బట్టలు, పిల్లపీతిగుడ్డలు, కుష్ఠురోగి చీముగుడ్డలు, మోటరు మెకానిక్ ఆయిలు బట్టలు, రైతు బురద గుడ్డలు, ఆచార్లుగారి మడిబట్టలు, మున్సిపల్ ఛైర్మన్‌గారి పొందూరు ఖాదీ ధోవతులు, కలక్టర్ భార్య పట్టుచీరెలు, అన్నీ కలగాపులగంగా రజకులు ఉతుకుతుంటారు. అన్ని గ్రామములలోని చెరువుగట్ల వలెనే ఈ చెరువు కట్ట కూడ మలమూత్రముల విసర్జన కాలవాలము. పచ్చి పెంట పైన రజకుడు వస్త్రము లారవేయడు - చూడక జరిగితే తప్ప. ఎండిన పెంట చెక్కులపైన, తడిగా వున్న మూత్రపు మరకలపైన తప్పనిసరి పరిస్థితులలో ఉతికిన బట్టలు ఆరవేస్తారు. కుళ్ళిన నీళ్ళలో ఉతికి, మలినమైన ప్రదేశములలో ఆరవేసిన వస్త్రములు ధరించు ప్రజల ఆరోగ్యము పదిలముగా వుంటుందని యెలా ఊహించ గలము? అటువంటి నికృష్టమైన నీళ్ళలో యెల్ల కాలము నానుతున్న రజకుని ఆరోగ్యము యెలా భద్రముగా వుంటుంది.

ఈ నికృష్ఠ, నిరర్థక, నీచజీవితములను మార్చమని, పరిస్థితులను మెరుగుపరచమని రజకజన సేవాసంఘము 40 సంవత్సరములుగ అడుగుతున్నది. శ్రీ వేమవరపు వెంకటేశ్వర్లు గారి నాయకత్వము వచ్చిన తరువాత 25 సంవత్సరములుగ స్వల్పము, అతి ప్రధానము అయిన ఈ విషయమును ప్రజలకు, ప్రభుత్వమునకు నచ్చజెప్పుటకు వందలాది మహాసభలురాష్ట్ర వ్యాప్తముగ జరిపించబడినవి. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వములోగాని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వములో గాని శ్రీ వేమవరపు వెంకటేశ్వర్లుగారితోను, వారి ఉద్యమముతోను పరిచయము లేని మంత్రులు అరుదు. గత 5 సంవత్సరములుగ అన్ని రాష్ట్రములు తిరిగి తన కార్యక్రమమును దేశవ్యాప్తము చేశారాయన. భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధిని రెండు మూడుసార్లు కలిసి చర్చలు జరిపారు. అయినా, వెంటేశ్వర్లుగారు, వారి ఉద్యమము ప్రారంభదశ నుంచి అంతగా పెరిగినట్లు కనుపించదు.

ఇది వెంకటేశ్వర్లుగారిది. లేదా రజక సంఘమునది అయిన సమస్యయేకాదు. నేనెఱిగినంత వరకు ఆంధ్రప్రదేశ్‌లో వృత్తి సంఘములకు నాయకత్వము వహించి, తమ కాలమును, ఆరోగ్యమును 25 సంవత్సరములుగ త్యాగము చేయుచున్న ప్రతికార్యకర్త, వృత్తి సంఘము స్థితి అట్లానే యున్నది. దీనివలన సాంఘిక సేవానురక్తి కలిగిన కార్యకర్తలలో నిరుత్సాహము జనించుటకు, క్రొత్తగా తయారుకావలసిన వారిలో అసలు ఉత్సాహమే జనించకుండుటకు, పర్యవసానముగ సాంఘిక ఉద్యమములు నిస్సార మగుటకు ఆస్కార మేర్పడుతుంది. ఇది చాలప్రమాదకరమైన సంగతి. ఉద్యమ ముమ్మొత్తుగా సాగినా ఆచరణలో కార్యసాఫల్యతను పొందకపోవుటకు గల కారణములను మన మన్వేషించాలి. ఇందుకు కారణము -

(1) మనము కోరే కోరిక సబబైనది కాకపోవచ్చు. (2) ఈ ఉద్యమము సభిమానించుచున్నట్లు కనిపించువారి హృదయాంతరాళములలో వ్యతిరేకతైనా వుండి తీరాలి. (3) వృత్తి సంఘములువా రవలంబించుచున్న సాధనోపాయములు ప్రజలను ప్రభుత్వమును చలింపజేయు పద్ధతిలో లేక పోయి వుండాలి.

తమ తమ ఆశయముల ననతికాలములో సాధించు కుంటున్న అనేక సంఘముల తీరు తెన్నులను అనుభవపూర్వకముగ అవగాహన చేసికొనిన నాకు మూడవ కారణమే సరియైన దనిపిస్తున్నది. వృత్తిసంఘములవా రవలంబించుచున్న సాధనోపాయము లత్యంత సున్నితమైనవి. అవి జటిలమైన ప్రజా సంస్థలను కదిలించ గలిగినంత వాడిగ లేవు. అందుచేత రజక సంఘము తన నడతను మార్చుకోవాలి. రజకులకు, తద్వారా సమాజమునకు ప్రయోజనకరమైన పనులను సాధించుటలో వొడుపును ప్రదర్శించాలి.

ఇందుకు కొంత విజ్ఞానము, ఆర్థికము, మందిబలము కావాలి. వీటిని ఉద్యోగుల సంఘము సమకూర్చాలి. వృత్తి దారులుగ వున్న తల్లిదండ్రులు

తమకు విజ్ఞానమును కలిగించారు. విజ్ఞానమును పొందిన ఉద్యోగులు వృత్తిదారులుగ వున్న తల్లిదండ్రులను, సోదరులను ఆదుకోవాలి. తమకన్న వెనుకబడినవారిని ఆదుకొను తత్వము ఉద్యోగులలో లేకపోవుట చేతనే వృత్తిసంఘము లెదుగుబొదుగులు లేక జీవచ్ఛవములుగ వున్నవి.

లోగడ చెరువులను, చెరువుల ప్రక్క ఖాళీస్థలములను రజకవృత్తికి కేటాయించవలసినదిగ ప్రభుత్వపు టుత్తర్వులున్నవి. ఇల్లు లేని వారికి ఇండ్ల స్థలములు, వృత్తి పరికరములను సరసమైన ధరలకు పొందుటకు సహకార సంఘముల నేర్పాటు చేసికొనుటకు ప్రభుత్వము వీళ్ళు కల్పించినది. ఈ విషయములను రజక ప్రజలకు తెలియజెప్పి వారికి సలహా సంప్రతింపులలోను, వ్రాతకోతలలోను ఉద్యోగులు తమ విద్యుక్త ధర్మముగ భావించాలి. ఇందుకు కారణము ఇతరులు, ఇతరులతోపాటు తాము తమ కులము "తక్కువ" అని భావించుకొనుటయే.

ఉద్యోగులలో కూడ చిన్న ఉద్యోగులు, పెద్ద ఉద్యోగులు వున్నారు. ముందు వీరి మధ్య సదవగాహన, సత్సం బంధము కుదరాలి. నేనొకరిద్దరు తయారు చేసిన రజక ఉద్యోగుల జాబితాలు చూచాను. అందులో చిన్న ఉద్యోగుల చిరునామాలు అంతగా కనుపించవు. అందరినీ చేర్చవలసినదిగ కోరుచున్నాను.

పెద్ద ఉద్యోగులలో తమ కులము పేరు చెప్పుకొను ధైర్యము కలవారు తక్కువ. వీరు సాధారణముగ "నాయుళ్లు"మని చెప్పుకుంటారు. ఇట్లా తమ కులమును "నాయుళ్ళు"గా మార్చి చెప్పుకొను అలవాటు సమాజములో చిన్న చూపు చూడబడుచున్న అన్ని కులములవారిలో హెచ్చుమందికి వున్నది. ఇట్లా చెప్పుకొనువారిలో రజకులు, నాయీ బ్రహ్మణులు, కళావంతులు.

వీరికి కులమును చెప్పుకొనుటలో ఇబ్బంది లేక పోలేదు. ఒక ఉద్యోగి రజకుడనని చెబితే, తోటి రజకుడు వారి బట్టలుతుకుటకు

వెనకాడతాడు ; జవానుగ వున్న రజకుడు తన అధికారికి తగిన మేరకై గౌరవమిచ్చుటకు తటపటాయిస్తాడు. ఇంటికి వచ్చు పాలుపోసేవారు, పిల్లలకు ప్రైవేటు చెప్పేవారుకూడ తక్కువగ చూస్తారు. ఇక చుట్టుప్రక్కల పై తరగతుల అమ్మలక్కలు వీరిని వెలివేసినట్లు చూస్తారు. పైకులములనుకొనబడువారికే అద్దెకిచ్చుటకు ఊరిమధ్యలో మంచి ఇళ్ళు వుంటై. క్రింది కులముల ఉద్యోగులు తమ కులముల పేరు చెబితే పై కులములవారు తప్పని పరిస్థితులలో తప్ప హృదయ పూర్వకముగ ఇల్లు అద్దెకివ్వరు. అధవా యిచ్చినా, పైకులముల వారద్దెకుండుటకు దొరికితే, ఏదో ఒక మిషతో అంతకు ముందు అద్దెకున్నవారిని ఖాళీ చేయమని గొడవచేస్తారు. ఇది తెనాలిలో నా స్వీయానుభవము. క్రిందికులములుగ పరిగణింప బడుచున్న ప్రభుత్వోద్యోగులీ ఇబ్బందుల నధిగమించగల ధైర్యముతో వ్యవహరించాలి.

నేను రహదార్ల భవనముల శాఖలో సూపర్ వైజరును. అదేశాఖలో పనిచేయుచున్న మరొక సూపర్‌వైజరు కార్యాలయము ఒకే ఆవరణలో వున్నవి. నా దగ్గర పనిచేయుచున్న జవాను రజకుడు. చాల సౌమ్యుడు, భయస్తుడు. సామాన్యముగ రజకులంత ఇట్లానే వుంటారు. అవివారి సహజ గుణములేమో ననిపిస్తుంది. హెచ్చుకాలం నీళ్ళలో నాను పరిస్థితులవల్ల వీరి శరీరములలో వేడివున్నా దాని వొడుపు స్వభావము తగ్గినదేమో. ఒక రోజు సాయంత్రము పోస్టలు టైం అయింది. బయట నిలుచున్న జవానుని "సుబ్బారావ్ ! ఈ ఉత్తరం పోస్టుచేసిరా !" అన్నాను, అంతలోనే ప్రక్క ఆఫీసునుండి " అరేయ్ ! సుబ్బారావ్ ! ఇటు రా !" అని అదరిపోవు లాగున సూపర్ వైజరుగారు కేక వేశారు. మావాడికి గోచివూడిపోయింది. పరుగెత్తాడు. ఆ సూపర్ వైజరుగారు చెప్పిన పని పూర్తిచేసికొని నా దగ్గరకు వచ్చాడు. ఆ రోజుకు నా ఉత్తరం నా బల్లపైనే విశ్రాంతి తీసికొన్నది. వాస్తవమున కా సూపర్ వైజరుగారు చెడ్డవారు కాదు. పెద్దగా అరవటం, గట్టిగా చెప్పటం వారి స్వభావం.

నేనంటే మా సుబ్బారావుకు గౌరవము లేదని గట్టిగా చెప్పలేను. భయము మాత్రము లేదు. ఇద్దరు చేయుచున్నది ఒకే ఉద్యోగ మయినప్పటికి పై కులములకు చెందిన ఉద్యోగులు తమ కున్న అధికారమును, లేని అధికారమును చలాయించినంతగ క్రింది కులములలోని ఉద్యోగులు చలాయించలేరు. వారు పొందునంత గౌరవమును కూడ పొందలేరు. సమాజ ప్రభావము అన్ని రంగములలోను పనిచస్తుందిగదా !

చిన్న ఉద్యోగులలోను, పెద్ద ఉద్యోగులలోను కొంత అవగాహన రావాలి. అభిమానము నిచ్చిపుచ్చుకొను ధోరణిలో వ్యవహరించాలి. ఇబ్బంది సబ్బందులలో ఒకరి నొకరు ఆదుకొని సహకార భావము పెరగాలి. ఇక్కడ కులం పేరుతో ఒకరి నొకరు ఆదుకోవాలి లేదా అభిమానించు కోవాలి అను మాటలను నేను కావాలని పలుకుతున్నాను. వెనుకబడిన తరగతుల ఉద్యోగు లట్లా ప్రవర్తించుటలో చాల న్యాయము, అవసరము వున్నదని నేను భావిస్తున్నాను. దేశమంతా ఆశిస్తున్న విధముగ సమాజములోని మెరక పల్లములను చదును చేయుట కిది ఉపయోగపడుతుంది.

ఉద్యోగులు సంఘములలో పాల్గొనవచ్చునా ? లేదా ? అను సమస్య చాలమందిలో అనుమానము రేకెత్తిస్తున్నది. ఉద్యోగులు రాజకీయములలో పాల్గొనరాదని సర్వీసురూల్సు సాధారణ ఉద్యోగ నింబంధనలలో వున్నది. రజక ఉద్యోగుల సంక్షేమ సంఘమునకు రాజకీయములతో సంబంధము లేదని నియమావళిలో స్పష్టముగ వ్రాయబడినది. అందువలన ఉద్యోగు లందరిందులో నిరభ్యంతరముగ, నిర్భయముగ పాల్గొనవచ్చును. ఇది యొక సేవా సంస్థ మనం "ఉద్యోగులం"తో పాటు మానవులం సాధారణ పౌరులం కూడా అన్న సంగతి మనం మరచిపోకూడదు.

మానవుడుగ కొన్ని మమతలు, కోర్కెలు, భారతీయపౌరుడుగ కొన్ని బాధ్యతలు, ధర్మములు మనకున్నవి. ఉద్యోగ ధర్మములతో పాటు, మానవ ధర్మములను, పౌరధర్మములను మనము నిర్వర్తించాలి. అది మనవిధి.

భారత రాజ్యాంగ ఉపోద్ఘాతములో పొందుపరచిన విషయములు గమనించ దగినది. (1) భారత పౌరులందరు భారతదేశమును స్వతంత్ర ప్రజాస్వామిక రాజ్యముగ రూపొందించు కోవాలి. (2) సామాజిక, ఆర్థిక రాజకీయ రంగములలో న్యాయము చేకూర్చుకోవాలి. (3) ఆలోచన, భావవ్యక్తీకరణ, నమ్మిక, విశ్వాసము, ఆరాధన విషయములలో స్వేచ్ఛ కలిగి వుండాలి. (4) అంతస్థు, అవకాశములలో సమానత్వము కల్పించ బడాలి. (5) పౌరులలో వ్యక్తి గౌరవమును కాపాడుకొంటూ, దేశసమైక్యతను కాపాడాలి. ఈ పరిధుల్లో ఆంధ్రప్రదేశ్ రజకోద్యోగుల సంఘము, మిగతా వెనుక బడిన, బలహీన, అల్పసంఖ్యాక వర్గములకు చెందిన ఉద్యోగులు పయనించాలి.

మనకు గౌరవము నొకరిచ్చే దానికన్న, మనగౌరవాన్ని మనం సంతరించుకొనుట పైననే మనం ఆధారపడాలి. రజకోద్యోగులకు గౌరవముండాలంటే, రజకవృత్తి దారులకు గౌరవముండాలి. రజకవృత్తిదారుకు గౌరవము రావాలంటే, దానికి ఆర్థిక వనరులు పెరగాలి. అప్పుగా వృత్తి చేయుట, ఒకరి ఇంటికి వెళ్ళి వృత్తిచేయుట మానాలి. దాని స్థానే పట్టణములలో వలెనే పల్లెలోకూడ లాండ్రీపద్ధతి రావాలి. కూలి క్రింద అన్నం తెచ్చుకొనుటకు అవశ్యం వర్జించాలి. ప్రధానంగా రజక స్త్రీలను పరుల ఇండ్లకు పంపించే పద్ధతికి స్వస్తిచెప్పాలి. స్త్రీని గౌరవించుకొనలేని యేజాతికి గౌరవయుండదు, ప్రగతి ఉండదు.

ప్రజల కవసరమైన ఒక డాక్టర్‌ను తయారుచేయుటకు షుమారు. రూ 15000/-లు, ఒక ఇంజినీరును తయారుచేయుటకు రు 10,000/-లు, ఒక

నర్సును తయారు చేయుటకు రు 5000/-లు ఒక శానిటరీ ఇన్స్పెక్టరును తయారు చేయుటకు రు2000/-లు ప్రజాధనమును వెచ్చించి, తిరిగి వారు హెచ్చు ఆర్థికతను వొనగూర్చుకొనుటకు తగిన పెచ్చు జీతముల నిచ్చి పెన్షన్ వగైరా వసతులను ప్రభుత్వము కల్పిస్తున్నది. ఫలితముగ వారినుండి ప్రజలకు వచ్చు ఉచిత సర్వీసేమీలేదు. అయినా, వారు అధిక సౌకర్యముల కొరకు సమ్మెలు చేస్తూనే వున్నారు. తిరిగి వారిస్థితి మరింతగ మెరుగుపడుటకు ప్రభుత్వము పునరాలోచనలు చేస్తూనేవున్నది. అదే విధముగ ప్రజల కుపమోగపడు రజక, నాయీబ్రాహ్మణ, శాలివాహన (కుమ్మరి), మహేంద్ర విశ్వబ్రాహ్మణ, దర్జీ, చేనేత వగైరా చేతివృత్తుల వారు తమ వృత్తిలో నైపుణ్యమును సంపాదించుకొనుటకు, వృత్తిని సుళువుగా కొనసాగించుటకు, ఇంటెల్లపాది పనిచేసినా పస్తులుండని మాత్రంగానైన ఆర్థికతను వొనగూర్చి కొనుటకు తగిన మార్గములను నేర్పుటకు ప్రభుత్వము పైసా ఖర్చు పెట్టకపోవుటం విచిత్రం. ఇంతవరకు వారి పూరిగుడిసెలే వారికి బళ్ళు. వారి తల్లిదండ్రులే వారికి అధ్యాపకులు వారి తాతలు సంపాదించిన అరిగిన, విరిగిన పనిముట్లే వారికి నేటికీ నవీన పరికరాలు. ఈ పరిస్థితులెంతగా మారాలో, అందుకు వృత్తిసంఘముల వారేమి చేయాలో సభాసదులు ఆలోచించాలి. ప్రభుత్వమును పనిచేసే విధముగ మలచాలి.

మనపని మరొకరు చేసిపెడతారన్న మందకొడి భావమును విడిచిపుచ్చి, మన అభివృద్ధికి మనమే కృషి చేసుకోవాలనే నిర్ణయానికి రావాలి.

## కృషితో నాస్తి దుర్భిక్షం.

(గమనిక : ఈ వ్యాసములోని విషయము లన్నియు క్రింద ఉదహరించిన సభలలో వ్యక్తీకరింపబడినందున ఆ సభలలోని ప్రసంగములను ప్రచురించలేదు.

1. అఖిల భారత రజక మహాసభ ది 30-4-72 ఆదివారం విజయవాడ.

2. ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సభ 7-5-72 ఆదివారం, గుంటూరు.

3. అద్దంకి తాలూకా రజక మహసభ ది 4-6-72 ఆదివారం అద్దంకి.

4. కనిగిరి, పొదిలి తాలూకాల రజక మహాసభ ది 25-6-72 ఆదివారం, కనిగిరి

# కీర్తి శేషులు గోపాలకృష్ణమూర్తి

## ఆవుల గోపాలకృష్ణమూర్తి సంస్మరణ సభ

ది 24-9-72 ఆదివారం తెనాలి

సభాధ్యక్షులు, దర్శనాచార్యులు, కళాప్రపూర్ణులు శ్రీ కొండూరి వీరరాఘవాచారిగారూ ! తోటి వక్తలారా ! సభాసదులారా !

కీర్తిశేషులు ఆవుల గోపాలకృష్ణమూర్తి మూర్తి పోయింది, కీర్తి మిగిలింది. కీర్తి శేషులందరు వాస్తవమునకు కీర్తి మిగిలినవారు కారు. కీర్తి మిగిలినవారికి మాత్రమే సంస్మరణ సభలు జరుగుతై. ఆరు సంవత్సరముల క్రితము మూర్తి పోయినా, నేటికినీ కీర్తి శేషించినవారు గనుకనే ఆవుల గోపాలకృష్ణమూర్తిగారు అర్థవంతమైన కీర్తిశేషులయ్యారు.

కీర్తి శేషులను స్మరిస్తే, వారి నడవడిని, సూక్తులను మననం చేసికొంటే, లేదా జ్ఞాపకం చేసికొంటే భౌతికంగా మనకు ప్రయోజన ముంటుంది. ప్రస్తుతం సమాజంలో సజీవంగా వుండి, పనికిమాలిన వాడుగా, ప్రజా ద్రోహిగా వుంటున్న వారిని గురించిన మాటలతో అనుదినం అమూల్యమైన మన కాలాన్ని కొంత వ్యర్థం చేసికొంటున్నాం. అంతకన్నా, సంవత్సరాని కొకసారియైనా కొంతకాలం సమాజంలో ప్రయోజకులుగా, మంచివారుగా వుండిపోయినవారిని సంస్మరించటం, వారి మంచి మాటలను మననం చేసికోవటం చాలమంచిది.

మానవతగలవాడు మనిషి. కాని మనుష్యులందరిలో కాదు హెచ్చుమందిలో మానవత వుండదు. మానవునిత్యంత ముఖ్యముగ వుండవలసిన మానవతలేదా మానవత్వము - అందుకు అవసరమైన పరిజ్ఞానము, శక్తియుక్తులు వగైరా సరంజామా కలిగిన మనుషులను తయారు చేసిన కర్మాగారంగా ఆవులవారు

ఆంధ్రదేశంలో భాసించారు. అందుకే వారిని సంస్మరించటానికి ఈ సంస్మరణసభ యేర్పాటు చేయబడినది.

నేడు నాకప్పగించినపని ఉపన్యసించటం కాదు. కేవలం కీర్తి శేషులు గోపాలకృష్ణమూర్తిని సంస్మరించటం మాత్రమే. నేను వారిని మొదటి సారిగా చూచింది **1950** లో . అప్పటికే వారు సాంఘిక, సాహితీ రంగాల్లో, వ్రాతల్లో, ప్రసంగాలలో బాగా పరిణతి చెందినవ్యక్తి. నేనారంగాల్లో అప్పుడు ఓనమాలు దిద్దుకుంటున్న విద్యార్థిని. అందుచేత హృదయంవిప్పి మాట్లాడుకునే సన్నిహితం మాకులేదు. నేను వ్రాసిన "శ్రామిక సింహం" పుస్తకానికి వారు ముందుమాట వ్రాశారు. నాకు ముందుబాట చూపారు. నేను సంపాదకుడిగా వున్న "యుగవాణి" పత్రికకు వారు రాజకీయ వ్యాఖ్యాతగా వ్యాసాలు వ్రాశారు. అయినా నాకు వారితో విషయములపై లోతులను చర్చించు అర్హత అప్పటికిరాలేదు. ఆయన కర్మాగారంలో తయారయిన మనిషిగా నన్ను లోకం చూస్తున్నది. ఆ గౌరవాన్ని దక్కించుకొనుటకు నేనూ తాపత్రయ పడుతున్నాను. ఈ సభలో ప్రారంభ కవిత చదవమని మిత్రుడు అచ్యుతరాం క్రిందటి రాత్రినాకు పని పురమాయించారు. యెందుచేతనో విషయమంతగా స్ఫురించలేదు. "కీర్తి శేషులు గోపాలకృష్ణమూర్తి" గీత పద్యపాదంగా తోచింది. ఆ మకుటంతో వారిని సంస్మరిస్తాను.

నిత్యసంతోషి, చక్కని నిండుమూర్తి
పరుల కెంతయు కలిగించె భావస్ఫూర్తి
ధన్యజీవన పథవర్తి ధర్మమూర్తి
కీర్తిశేషులు గోపాలకృష్ణమూర్తి
నవ్య మానవతావాది, న్యాయవాది
కలిగి, కలిగించె నాగరకతను ప్రజకు

మంచి అన్నది పెంచి గడించె కీర్తి
కీర్తి శేషులు గోపాలకృష్ణమూర్తి
దివ్యగుణ సుమవల్లి మా తెలుగుతల్లి
కూర్మి కొడుకయి ధరణిపై పేర్మిమీర
వరలియుండిన ఆవులాన్వయుడు బుధుఁడు
కీర్తిశేషుడు గోపాలకృష్ణమూర్తి
భూషణమ్ములు సరసంభాషణములు
కీర్తిశేషులు గోపాలకృష్ణమూర్తి
భాషణమ్ములు ప్రజకు సమ్మానసభలు
కీర్తిమంతుడు గోపాలకృష్ణమూర్తి
మూర్తిపోవగ మిగిలెను కీర్తినేడు
కీర్తిమిగిలిన గోపాలకృష్ణమూర్తి
భావముల నేడు ప్రజలకు భావదీప్తి

ఈ విధంగా ధన్యజీవిని సంస్మరించుకొను అవకాశమును కలిగించిన ఆహ్వాన సంఘంవారికి ప్రత్యేకంగా సీతారామచ్యుతరాం జంట కార్యకర్తలకు, నాతో పాటు ఆవుల వారిని సంస్మరించటానికి విచ్చేసిన పెద్దలకు నమస్కరిస్తూ విరమించుకుంటున్నాను.

## శుద్ధ పత్రం

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 2 | 9 | పాత్రమెరిగిన | పాత్ర యెరిగిన |
| 3 | 18 | రాష్ట్రియ | రాష్ట్రియ |
| 9 | 19 | ఆఖీల | ఆఖీల |
| 12 | 10 | మేసంఘ | యేసంఖ |
| 15 | 9 | చెప్పేడి | చెప్పేది |
| 16 | 4 | బతికి | చితికి |
| 20 | 3 | జాని | కాని |
| 20 | 9 | Absorving | Absorbing |
| 20 | 14 | పోల్ని | పోల్చి |
| 22 | 8 | స్పష్టం | స్పృష్టం |
| 24 | 7 | వాటినీ | వాటిని |
| 24 | 11 | వ్రాతలను | వ్రాతలకు |
| 26 | 15 | నినియోగించు | వినియోగించు |
| 27 | 21 | ఉండుట | ఉండుటలో |
| 28 | 17 | దళితర్గముల | దళితవర్గముల |
| 30 | 9 | Cast | Caste |
| 30 | 10 | జరుగుచున్చ | జరుగుచున్న |
| 31 | 9 | ఇప్పటికి | ఇప్పటి |
| 33 | 1 | ఆత్మగౌరవంతో | (లేదు) |
| 34 | 4 | దోర్బల్యం | దౌర్బల్యం |
| 35 | 9 | ఆలేశము | ఆవేశము |
| 35 | 11 | మాన్చుకొని | మార్చుకొని |
| 37 | 2 | సానిక | స్థానిక |

| | | | |
|---|---|---|---|
| 38 | 21 | దేశములు | దేశమును |
| 39 | 10 | సాపకుడైన | స్థాపకుడైన |
| 43 | 13 | సాయిలలో | స్థాయిలలో |
| 43 | 20 | పంచుకున్న పాటి | పంచుకున్నపాలు |
| 45 | 3 | వగ్గము | వర్గము |
| 52 | 13 | తప్పు | తీర్పు |
| 56 | 17 | మార్చుకొను | కూర్చుకొను |
| 64 | 5 | Gass | Gas |
| 65 | 6 | నాగించుటకు | గావించుటకు |
| 68 | 18 | లిచ్చిన | నిచ్చిన |
| 69 | | 1972 | 1971 |
| 69 | 6 | శాఖాధి | శాఖాధికారి |
| 69 | 9 | సూమాంజలి | సుమాంజలి |
| 71 | 14 | పవిచేయాలి | పనిచేయాలి |
| 71 | 20 | నివేదిక | వేదిక |
| 73 | 18 | సమర్పించి | సమర్పించిన |
| 79 | 8 | Suprem | Supreme |
| 81 | 11 | సత్వములను | స్వత్వములను |
| 82 | 9 | కర్లుడు | కర్ణుడు |
| 82 | 11 | కూతతులోద్భ | నూతకులోద్భ |
| 82 | 14 | కుణజ్ఞు | గుణజ్ఞు |
| 86 | 10 | మాకవా? | మానవా? |
| 86 | 11 | తక్కువ | తక్కు |
| 98 | 5 | మహేశ? | మహీశ? |
| 99 | 10 | శ్రదా | శ్రద్ధా |

| | | | |
|---|---|---|---|
| 105 | 1 | genius | inntelligent |
| 112 | 6 | Cast | Caste |
| 113 | 20 | విద్యా | విద్య |
| 123 | 21 | యేరుపురుగు | వేరుపురుగు |
| 127 | 20 | విధము | విధముగ |
| 127 | 21 | చేయ | చేవ |
| 128 | 6 | అణార్చి | అణగార్చి |
| 128 | 12 | మనిషికి | మనిషికి |
| | | కలిగించాలని | వసతికలిగించాలని |
| 135 | 14 | ఆర్థికము | ఆర్థికముగ |
| 141 | 10 | ఇంటికి వచ్చు | ఇంటికి వచ్చి |
| 145 | 6 | వత్తి | వృత్తి |
| 146 | 1 | పడకు | పడుటకు |
| 151 | 11 | కీర్తిశ్షులు | కీర్తి శేషులు |
| 151 | | సరసంభాషణములు | సరససంభాషణములు |
| 151 | 16 | భావముల | భావములు |

## రచయిత

జన్మస్థనం గుంటూరు జిల్లా నిడుబ్రోలు. జననం 1932. విద్యార్థి దశలోనే సాంఘిక విముక్త ఉద్యమాలతో సన్నిహిత సంబంధం పెంచుకొని పత్రికల్లో పాటలు, పద్యాలు, వ్యాసాలు వ్రాయటం ప్రారంభించారు. లోగడ నిడుబ్రోలు రజకజన సేవాసంఘానికి, ఆంధ్రరాష్ట్ర వెనుకబడిన జాతుల ంఘానికి, ఆంధ్రరాష్ట్ర కంప్రెస్ట్ ఇంజనీర్ల సంఘానికి కార్యదర్శిగా, "యుగవాణి" పత్రికా సంపాదకులుగా, "గంటూరు పత్రిక" కు సహాయ సంపాదకులుగా పనిచేశ్వారు. "రజక సేవ" బుర్రకథ, "శ్రామిక సంహం" అనే గద్య పద్య గేయాత్మక ఉదోబద వ్రాసి ప్రచురించారు. 1959 నుండి పబ్లిక్ వర్క్స్ శాఖలో సూపర్‌వైజరుగా ఉద్యోగం చేస్తున్నారు. 1970 నవంబరులో తెనాలిలో "వెనుకబడిన తరగతుల వేదిక"ను స్థాపించి దానికి కార్యదర్శిగాను, '72 ఏప్రిల్ నుండి గుంటూరు జిల్లా కులనిర్మూలన సంఘానికి, విజయవాడ ఆంబేద్కర్ సాహితీ విహార్‌కు, అఖిలభారత రజకజనసేవా సంఘానికి కార్యనిర్వాహక వర్గ సభ్యులుగాను, 72 సెప్టెంబరు నుండి ఆంధ్రప్రదేశ్ కంప్రెస్ట్ ఇంజనీర్ల సంఘానికి ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు.

మావద్ద అమ్మకమునకు సిద్ధముగా నున్న ఇతర గ్రంథములు:

దీపావళి (పద్యగేయ ఖండకావ్యం) - దేవరపల్లి మస్తాన్‌రావు 1-50

క్రాంతిరథం (రేడియో ప్రసంగాలు, పత్రికావ్యాసాలు).జె.వీరాస్వామి 2-00

కొండా రంగారావు - పబ్లిషర్